అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 31-01-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 సంచిక : 31 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు వెల : 6.50



ప్రజా సమస్యలు చర్చించాలి

నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుంభమేళా తొక్కిసలాటపై ప్రతిపక్షాలు పట్టు

- అన్ని పార్టీలూ సహకరించాలి : కిరణ్ రిజిజు
- ఆమోదం కోసం 16 బిల్లుల జాబితా
- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- సభలను ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రేపు కేంద్ర బడ్జెట్

వివరాలు 7లో



గగనతలంలో ఘోరం

అమెరికాలో విమానాన్ని ఢీకొన్న సైనిక హెలికాప్టర్

- నదిలో పడిన శకలాలు
- 28 మృతదేహాల వెలికితీత
- మిగిలిన వారి కోసం కొనసాగుతున్న సహాయ చర్యలు
- రెండింటిలోనూ మొత్తం 67మంది

అమెరికా రాజధాని వాషింగ్టన్ గగనతలంలో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. 64మందితో ప్రయాణిస్తున్న ప్రయాణికుల విమానాన్ని అదే మార్గంలో వచ్చిన సైనిక హెలికాప్టర్ ఆకాశంలోనే ఢీ కొనడంతో పెద్ద శబ్దం చేస్తూ మండుతున్న అగ్నిగోళాల్లా రెండూ పక్కనే గల నదిలో పడిపోయాయి.

వాషింగ్టన్ : అమెరికా రాజధాని వాషింగ్టన్ గగనతలంలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగినపుడు హెలికాప్టర్‌లో ముగ్గురు వున్నారు. విమానంలో 60మంది ప్రయాణికులు కాగా, నలుగురు సిబ్బంది వున్నారు. మరికొద్ది క్షణాల్లో రొనాల్డ్ రీగన్ జాతీయ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ కానున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎంతమంది మరణించారనే విషయమై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. అయితే ఇప్పటివరకు 28మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారి కోసం విమాన శిథిలాలు పడిన పొటొమాక్ నదిలో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 9గంటల సమయంలో ...15లో

పథకాల పరేషాన్..!

మండలానికో గ్రామానికి రైతు భరోసా..ఊరికో ఐదారు ఇందిరమ్మ ఇండ్లు

గ్రామ సభల్లో అధికారుల హడావుడి

- ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- నిరంతర ప్రక్రియ అంటూ సర్కార్ దాటవేత
- ఇప్పటికీ ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తుల వెల్లువ
- ఎమ్మెల్సీ కోడ్ ఎఫెక్ట్‌తో పథకాలకు బ్రేక్..?

"ఊరికో కోడి.. ఇంటికో ఈక" అనే సామెతలా ఉంది నాలుగు కొత్త పథకాల పరిస్థితి. ప్రజా పాలన పేరిట దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం పథకాలు మంజూరు చేస్తున్నామంటూ గ్రామ సభలు పెట్టింది. అక్కడా దరఖాస్తులు తీసుకోవడంతోనే సరిపుచ్చింది. మండలానికో గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి నాలుగు పథకాలను మంజూరు చేసింది. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలనేవి నిరంతర ప్రక్రియలంటూ మంత్రులు, అధికారులు పదేపదే ప్రకటిస్తూ వస్తున్నారు. లబ్దిదారుల జాబితాలో పేర్లు లేని వాళ్లంతా తిరిగి దరఖాస్తు చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పథకాల మంజూరు ప్రక్రియ షురూ అయ్యిందో లేదో ఇంతలో ఎమ్మెల్సీ కోడ్ రావడంతో 50 రోజుల పాటు కొత్త పథకాల అమలుకు ఛాన్స్ ఉండదని అధికారులు చెబుతున్నారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు పదే పదే ప్రకటిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ పాలనంటే ప్రజా పాలన అని చెబుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని సీఎం, ఇతర మంత్రులంతా రోజూ పాఠం మాదిరి బోధిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు కొత్త పథకాలకు శ్రీకారం చుట్టేందుకు హడావుడి చేశారు. కొత్త రేషన్‌కార్డు, అదనపు పేర్ల నమోదు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా నాలుగు పథకాల్ని అమలు చేయాల్సి ఉండగా కొన్ని గ్రామాలకే పరిమితం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నాలుగు పథకాల కోసం లక్షలాది మంది ప్రజా పాలన సభల్లో దరఖాస్తులు చేశారు. వాటి ఆధారంగా ఇంటింటికీ తిరిగి అధికారులు సర్వే నిర్వహించారు. ఏఏ పథకాలకు ఎవరు అర్హులు, అనర్హులనేది నిర్ధారించేందుకు సర్వే చేపట్టారు. సర్వే పూర్తికాగానే జనవరి 26 నుంచి మంజూరు చేస్తామని ప్రకటించారు. రైతు భరోసాను మండలానికో గ్రామానికి, ఇందిరమ్మ ఇండ్లు ఊరికో నాలుగు మాత్రమే మంజూరు చేశారు. మిగతా గ్రామాల్లో దశల వారీగా మంజూరు ప్రక్రియ కొనసాగుతుందంటున్నారు.

దరఖాస్తులు లక్షల్లో.. మంజూరీ వందల్లో..

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంక్షేమ పథకాల కోసం లక్షల సంఖ్యలో దరఖాస్తులొచ్చాయి. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల కోసం భారీగా వచ్చిన దరఖాస్తుల్ని ఇటీవల సర్వే చేశారు. ఇందిరమ్మ ఇండ్ల ...6లో



వివరాలు 13లో

శాంతి, అహింసల ఆచరణే అసలైన నివాళి

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గవర్నర్, సీఎం నివాళులు

ఫిబ్రవరి 7న అసెంబ్లీ !

ఐదో తేదీన క్యాబినెట్

కులగ[illegible]పైనే చర్చ

వివరాలు 13లో

జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ రసాభాస

రెండు గంటల్లో ఐదుసార్లు వాయిదా



- మేయర్ పోడియాన్ని చుట్టుముట్టిన బీఆర్ఎస్ సభ్యులు
- వారిని బయటకు తీసుకెళ్లిన మార్షల్స్
- చర్చ లేకుండానే రూ.8,440 కోట్ల బల్దియా వార్షిక బడ్జెట్ ఆమోదం
- మాజీ ప్రధాని డా.మన్మోహన్‌సింగ్ మృతికి సభ్యుల సంతాపం
- మహాత్మాగాంధీకి నివాళులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన కార్పొరేషన్ 10వ సాధారణ సమావేశం రసాభాసగా కొనసాగింది. రెండు గంటల్లో ఐదుసార్లు వాయిదా పడింది. ఉదయం 10:30 గంటలకు మొదలైన సభలో మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకుముందు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్‌ఎంసీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. అయితే, ఎలాంటి చర్చ లేకుండానే బల్దియా రూ.8,440కోట్ల వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. చర్చ లేకుండా ఎలా ఆమోదిస్తారంటూ మేయర్ తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై కాకుండా కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు మొదటి నుంచీ పట్టుబట్టారు. బడ్జెట్ ఆమోదం పూర్తయిన తర్వాత కౌన్సిల్ సమావేశం నిర్వహిద్దామని మేయర్ చెప్పడంతో సమావేశం రసాభాసగా మారింది. బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు వినూత్న రీతిలో నిరసన ...15లో

బీజేపీ డీఎన్ఏలోనే ప్రజాస్వామ్య ఖూనీ

మత ఉద్రిక్తతలు పెంచేందుకు ప్రయత్నిస్తోంది

కాషాయపార్టీపై ప్రకాశ్ కరత్ ఆగ్రహం

దాడి చేస్తే మరింత విజృంభిస్తామని హెచ్చరిక

లౌకిక, ప్రజాతంత్ర శక్తుల ఐక్యతకు పిలుపు





అగర్తల : ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అధికార బీజేపీ స్వభావమని సీపీఐ (ఎం) సీనియర్ నేత, పార్టీ సమన్వయకర్త ప్రకాశ్ కరత్ విమర్శించారు. త్రిపుర రాజధాని అగర్తలలోని స్వామి వివేకానంద మైదానంలో పార్టీ తలపెట్టిన ర్యాలీకి అనుమతి నిరాకరించడాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. రవీంద్ర శతబర్షికి భవన్ ఎదుట బుధవారం జరిగిన పార్టీ రాష్ట్ర సమావేశాలను ఉద్దేశించి కరత్ ప్రసంగిస్తూ 'బీజేపీకి, దాని ప్రభుత్వానికి ఓ విషయం చెప్పాలని అనుకుంటున్నాము. మీరు మాపై ఎంతగా దాడి చేస్తే మేము అంతగా విజృంభిస్తాం. త్రిపురలో సీపీఐ (ఎం) అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ. భారీ ప్రదర్శన నిర్వహించేందుకు పార్టీకి అనుమతి ఇవ్వలేదు. ఈ ఘటనతో త్రిపురలో ప్రజాస్వామ్యం ఏ స్థితిలో ఉన్నదో దేశం ముందు ఆవిష్కృతమైంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం బీజేపీ డీఎన్ఏలో, దాని జన్యువుల్లోనే ఉంది' అని ...3లో



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

లేనిపక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తాం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ - ముషీరాబాద్

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చేపట్టే కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం బీసీ విద్యార్థుల సమర శంఖారావం మహాసభను సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఏ ఉద్యమమైనా విద్యార్థులతోనే మొదలవుతుందని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులకు నాణ్యమైన చదువు అందడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4 వేల కోట్లు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల వారు అణచబడుతూనే ఉన్నారన్నారు. పేద విద్యార్థులు తిరగబడాల్సిన సమయం ఆసన్నమైందని, ఫూలే, అంబేద్కర్ ఆశయాలను సాధించడానికి, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీ విద్యార్థులకు పది వేల ర్యాంకు నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. సమస్యలు ...3లో

సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్తాం

చుక్కా రామయ్య వారసత్వాన్ని కొనసాగిస్తాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

3లో..

బండరాళ్లు పడి ఇద్దరు ఉపాధి కూలీలు మృతి

ప్రమాదమని తెలిసినా పనిలో పెట్టిన వైనం

పలువురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-అక్కన్నపేట

ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు మీద పడి ఇద్దరు మహిళా కూలీలు మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల వ్యాప్తంగా గురువారం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామ శివారులోని గుట్ట వద్ద కొన్ని వారాలుగా ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. గురువారం యధావిధిగా పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మట్టి దిబ్బలు, రాళ్లు మీద పడి అన్నాజీ మమత(35), కందారపు సరోజన (50) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ఇంద్రాల స్వరూప కాళ్లు విరగ్గా, ఈసంపెల్లి కనుకవ్వ, ఇంద్రాల రేణుకకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు చేసే సమయంలో ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం ...15లో





ఏఐలో భారత్ వెనుకబాటు

దూసుకొచ్చిన చైనా డీప్‌సీక్ | వాల్‌స్ట్రీట్ బెంబేలు | పోటీపై దృష్టి పెట్టాలి : ట్రంప్

అమెరికాలోని దిగ్గజ కృత్రిమ మేధా (ఏఐ) కంపెనీలకు దీటుగా చైనాకు చెందిన డీప్‌సీక్ తన అత్యంత ప్రభావంతమైన ఏఐ మోడల్‌తో గణనీయమైన పురోగతిని సాధించింది. డీప్‌సీక్ తన దూకుడుతో వాల్‌స్ట్రీట్‌లోని పశ్చిమ దేశాల ఏఐ కంపెనీలకు వణుకు పుట్టిస్తోంది. ఆయా కంపెనీల షేర్లు కుదేలు అవుతోన్నాయి. ఈ రంగంలో అమెరికా, చైనా తీవ్ర పోటీపడుతోంటే.. భారత్ వెనుకబడిపోతుందని స్పష్టమవుతోంది. దీనిపై మోడీ ప్రభుత్వ చొరవ పేలవంగా ఉందని టెకీల విమర్శలు పెరిగాయి. బహు భాషల్లో ఆవిష్కరించిన డీప్‌సీక్ ఏఐలో ప్రధాన సంస్థగా నిలుస్తోంది. పూర్తి అడ్వాన్స్ ఏఐ మోడల్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తుండడం విశేషం.



న్యూఢిల్లీ: పశ్చిమ దేశాలతో పోల్చితే చైనా అతి తక్కువ ఖర్చుతో డీప్‌సీక్‌ను అభివృద్ధి చేసింది. మరోవైపు ఈ రంగంలో తమకు పోటీ లేదనుకున్న వేళ డీప్‌సీక్ దూసుకురావడం యూఎస్‌కు మింగుడుపడటం లేదు. డీప్‌సీక్ పురోగతిపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సైతం అశ్చర్యం వ్యక్తం చేస్తూ.. ఇది అమెరికన్ కంపెనీలకు మేల్కొలుపు కావాలన్నారు. ఈ ఆటలో గెలవడానికి పోటీ పడాలని తమ దేశ సంస్థలకు సూచించారు. డీప్‌సీక్‌ను ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ కూడా ప్రశంసించారు. తమకు కొత్త పోటీదారు రావడం ఉత్తేజకరమని ఆల్ట్‌మాన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ సాంకేతిక పురోగతిపై భారత్ సహా ఇతర దేశాలు ఎలా స్పందించాలనే దానిపై ఉత్సుకత, చర్చలకు దారితీసింది. భారత్‌కు చెందిన ఏఐ స్టార్టప్ అయినా సర్వమ్ ఏఐ 200 కోట్ల అంశాలతో ఓ వేదికను అభివృద్ధి చేస్తోంది. ఇది భారతీయ భాషల్లో రానుంది. కాగా.. డీప్‌సీక్ మోడల్ ఏకంగా 67,100 కోట్ల అంశాలతో అభివృద్ధి చేయబడింది. ఏఐలో భారత్ రాణించడానికి మూలధనం, ప్రతిభ, సామర్థ్యం ఉందని జులియా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ కో-ఇన్వెంటర్ విరాల్ షా పేర్కొన్నారు. ప్రముఖ గ్లోబల్ వెంచర్ క్యాపిటల్ సంస్థలు భారత్‌లో కార్యాలయాలను స్థాపించాయని, ఎన్విడియా, ఇంటెల్ చిప్‌లలో ఎక్కువ భాగంగా భారత్‌లోనే రూపొందించబడ్డాయన్నారు. అయితే ఏఐ కోసం సమయం పడుతుందన్నారు. వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ఉన్నత విద్యను మెరుగుపరచడం, డీప్‌టెక్‌పై ఆర్అండ్‌డీ వ్యయాన్ని పెంచడం ద్వారా మన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి మొత్తం పర్యావరణ వ్యవస్థ కలిసి రావాలన్నారు. భారతీయ పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థలు, వెంచర్ క్యాపిటలిస్టులు ఏఐలో బలమైన ఉనికిని నెలకొల్పడానికి కొత్త ఆలోచనలతో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.గ్లోబల్ ఏఐ రేస్‌లో సామర్థ్యం గల మోడల్‌లను అభివృద్ధి చేయడానికి భారత్ ప్రధాన పరిశోధనలో మరింత పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉందని గార్టినర్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇందుకోసం కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక డేటా సెంటర్‌లు, ఎనర్జీ, కూలింగ్ టెక్నాలజీలు, కంప్యూట్, చిప్‌ల కోసం ఇది చాలా ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. అంతకు మించి భారత విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరగాలన్నారు. తెలివైన వ్యక్తులను ఒక తాటిపైకి తీసుకురావడం ...15లో

కాంగ్రెస్ చార్ సౌ బీస్ పార్టీ

- గ్యారెంటీలపై పొంతనలేకుండా సీఎం, మంత్రుల మాటలు
- స్పీకర్ ప్రకటనతో హామీలపై చేతులెత్తేసినట్టే : మీడియా సమావేశంలో మండలి పక్షనేత ఎస్.మధుసూదనాచారి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఇచ్చిన 420 హామీలను విస్మరించిన కాంగ్రెస్ చార్ సౌ బీస్ పార్టీ గా మారిందని శాసనమండలి ప్రతిపక్షనేత ఎస్.మధుసూదనా చారి విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. ఆర్థిక పరిస్థితి లోతు తెలియక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడటం విడ్డూరంగా ఉందనీ, ఆయన ప్రకటనతో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలపై చేతులెత్తేసిందని అర్థమవుతున్నదని చెప్పారు. గ్యారెంటీలపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర అప్పుల గురించి కూడా కాంగ్రెస్ అబద్దాలు ప్రచారం చేసిందన్నారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.43 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తామని తెలిపారు. గొంగిడి సునీత మాట్లాడుతూ..హామీలు అమలు చేయలేకపోతున్న కాంగ్రెస్ పార్టీకి సద్బుద్ధిని ప్రసాదించాలని మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. గాంధీ విలువలను కేసీఆర్ పాటిస్తే కాంగ్రెస్ వాటిని తుంగలో తొక్కుతున్నదని విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ, రేషన్ కార్డులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేసీఆర్‌పై అబద్దాలు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్‌ను మించిపోయారని విమర్శించారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న రాహుల్ గాంధీ.. అందులో పావలా వంతు కూడా ఇప్పించలేక పోయారన్నారు. గురుకులాల్లో పిల్లలు వసతులు లేకుండా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యూరియా కు కూడా రైతులు చెప్పులు క్యూలో పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు.



కదిలిస్తే కన్నీటి కథలే..

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటన మిగిల్చిన చేదు జ్ఞాపకాల నుంచి జనం ఇంకా తేరుకోలేదు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు లక్షలాదిగా తరలిరావడంతో తొక్కిసలాట జరిగి 30 మంది ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే. దీనికి ప్రత్యక్ష సాక్షులుగా నిలిచిన కొందరు భక్తులు ఆ విషాద ఘడియలను గుర్తు చేసుకుంటూ 'భయపడ్డాం. విలపించాం. ఎవరూ మా గోడు వినలేదు. జనం పరుగులు పెడుతుంటే వారి కాళ్ల కిందే చాలా మంది నలిగిపోయారు. మా కళ్ల ముందే అంతా జరిగిపోయింది. అధికార యంత్రాంగం, పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పించింది' అని వాపోయారు.

అన్నింటా సర్కారు వైఫల్యమే !

- కానరాని పోలీసులు, అధికారులు
- మార్చురీల వద్ద బంధువుల పడిగాపులు
- కుంభమేళా మిగిల్చిన చేదు అనుభవాలు
- అక్కడ మరోసారి అగ్ని ప్రమాదం...టెంట్లు దగ్ధం
- తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్

ప్రయాగ్‌రాజ్: తొక్కిసలాట ఘటన తర్వాత ఆచూకీ తెలియకుండా పోయిన తమ వారి కోసం చాలా మంది వెతుకుతూ కన్పించారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆస్పత్రుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. తొక్కిసలాటలో ఎంత మంది చనిపోయిందీ రాత్రి వరకూ ప్రకటించనే లేదు. సమాచారం అడిగితే అధికారుల నుండి మౌనమే సమాధానంగా వచ్చింది. వదంతులు నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని మాత్రం చెప్పారు.

నిద్రావస్థలో వ్యవస్థలు

వాస్తవానికి కుంభమేళాపై ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం విస్తృత ప్రచారం చేసింది. సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ప్రతి దానికీ లెక్కలు చెప్పారు. ప్రత్యేక రైళ్లు ఎన్ని వచ్చాయి? వాటిలో ఎంత మంది ప్రయాణించారు? ఎంత మంది స్నానాలు చేశారు?....ఇలా ప్రతి రెండు గంటలకూ ఓ బులెటిన్ విడుదలయ్యేది. కానీ తొక్కిసలాట తర్వాత మృతులు, గాయపడిన వారి సమాచారం అందించడానికి అనేక గంటల సమయం పట్టింది. మృతులు, క్షతగాత్రులు, జాడ తెలియకుండా పోయిన వారి వివరాల కోసం బంధువులు, స్నేహితులు ఇటూ అటూ పరుగులు తీస్తూ అల్లాడిపోయారు.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

'నా సోదరి రేణు ఆచూకీ తెలియడం లేదు' అని అజయ్ కుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాగరాజ్‌లోని మోతీలాల్ నెహ్రూ వైద్య కళాశాల ఆస్పత్రి మార్చురీ ఎదుట ఆయన ఆత్రుతగా ఎదురు చూస్తూ కన్పించారు. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నానని, సమాచారం చెప్పాలని పోలీసులను వేడుకున్నానని, క్యూలో నిలబడి వేచి ఉండమని వారు సలహా ఇచ్చారని తెలిపారు. 'ఆస్పత్రికి ఎన్ని మృతదేహాలు వచ్చాయో వారికి తెలియదా? వారి వద్ద సమాచారమే లేదా?' అని తిరుపతికి చెందిన మనీష్ పాండే ఆగ్రహంతో ప్రశ్నించారు. ఆయన కూడా తన సోదరి కోసం వెదుకుతున్నారు. ఘటనా స్థలంలో చెప్పులు, బట్టలు, నీటి సీసాలు, వ్యక్తిగత సామగ్రి...ఇలా అన్నీ చెల్లాచెదురుగా కన్పించాయి. పోలీసులు మానవ హారాన్ని ఏర్పాటు చేసి పరిస్థితిని చక్కదిద్దేందుకు కొంత వరకూ ప్రయత్నించారు. లౌడ్‌స్పీకర్లలో సూచనలు అందించారు. అయినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది.

ఏం జరిగింది?

త్రివేణీ సంగమంలో అసలు ఏం జరిగిందనే విషయంపై భిన్న కథనాలు విన్పిస్తున్నాయి. గంగ, యమున, సరస్వతి నదులు కలిసే త్రివేణీ సంగమం వద్దకు జనం ఒక్కసారిగా భారీ సంఖ్యలో తరలి వచ్చారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘాట్‌లో ప్రవేశించేందుకు ఏర్పాటు చేసిన నాలుగు గేట్లలో మూడింటిని మూసేశారని కొందరు చెప్పారు. దీంతో తెరిచి ఉంచిన ఒకే గేటు వద్దకు ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. స్నానాలు చేసే తొందరలో కొందరు బారికేడ్లను పడదోసి లోపలికి పరుగులు తీశారు. 'తోపులాట జరిగింది. కర్రలతో కట్టిన బారికేడ్ విరిగింది. చాలా మంది చనిపోయారు. అనేక మంది గాయపడ్డారు' అని 60 ఏండ్ల బేబీ దేవి చెప్పారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారిలో ఆమె భర్త కూడా ఉన్నారు. తాను ముందుగా ఆస్పత్రికి వెళ్లానని, అక్కడి వారు తనను మార్చురీ వద్దకు పంపారని విలపిస్తూ అన్నారు.

తొక్కిసలాట జరిగిన ప్రదేశానికి సమీపంలోని పిల్లర్ నెంబర్ 147 వద్ద గందరగోళం నెలకొన్నదని మరి కొందరు తెలిపారు. తన తల్లి మృతదేహం కోసం మార్చురీ వద్ద వేచి ఉన్న జయప్రకాష్ సోనీ మాట్లాడుతూ భక్తుల సంఖ్య అకస్మాత్తుగా పెరిగిందని చెప్పారు. 'రాత్రి 1-1.30 గంటల సమయంలో జనం ఇక్కడికి పరుగులు పెడుతూ వచ్చారు. అప్పుడు పోలీసులు ఎవరూ లేరు. తొక్కిసలాటలో కొందరు కింద పడిపోవడం, ప్రజా సమూహం వారిని తొక్కుకుంటూ వెళ్లడం జరిగింది. మా నాన్న, పిల్లలు తప్పించుకోగలిగారు కానీ అమ్మ బయటపడలేక పోయింది. జనం ఒక్కసారిగా మీద పడడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది' అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.

'రాత్రి 12.30 గంటల సమయంలో స్నానాలు చేయడానికి 20 మందిమి వచ్చాము. అప్పుడే జనం ఓ ప్రవాహంలా వచ్చి పడ్డారు. కొద్ది నిమిషాల వ్యవధిలోనే మా బంధువు ఒకరు చనిపోయారు' అని దేవ్‌కీ రాజ్‌పుట్ చెప్పారు.

కన్నీటి అనుభవాలు

తొక్కిసలాటలో కింద పడిపోయిన వారిని తొక్కుకుంటూ జనం పరుగులు పెడుతుంటే పరిస్థితిని అదుపు చేసే వారే కరువయ్యారు. తొక్కిసలాటలో కొందరు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. బతికి బయటపడినా ఇప్పుడు తమ వద్ద డబ్బు లేదని, ఫోన్ కూడా పోయిందని, ఇంటికి తిరిగి ఎలా వెళ్లాలో తెలియడం లేదని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. భార్య చేతిని పట్టుకొనే ఉన్నానని, అయితే తొక్కిసలాటలో తన చేతి నుండి ఆమె పట్టు జారి పోయిందని చివరికి ప్రాణాలు కోల్పోయిందని బల్జీత్ సింగ్ చెప్పారు. 'తొక్కిసలాటలో అరగంట సేపు చిక్కుబడి పోయాను. చివరికి ఎలాగో బయటపడే సరికే నా భార్య విగతజీవిగా మారింది' అని ఫూల్ చంద్ విశ్వకర్మ తెలిపారు. ఇలా ప్రయాగరాజ్‌లో ఎవరిని కదిలించినా కన్నీటి కథలు, వ్యథలే విన్పించాయి. మృతదేహాలను తీసుకొని స్వస్థలాలకు బయలు దేరే వారు కొందరైతే వాటి కోసం ఆస్పత్రుల వద్ద ఇప్పటికీ పడిగాపులు కాస్తున్న వారు మరి కొందరు. అసలు అయిన వారి ఆచూకీయే లభించక తల్లడిల్లిపోతున్న వారు ఇంకొందరు. వారిని ఊరడించే వారు కానీ, ఓదార్చే వారు కానీ కన్పించడం లేదు.

మరోసారి అగ్ని ప్రమాదం

కుంభమేళాలో మరోసారి అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్-22లోని ఛట్‌నాగ్ ఘాట్ వద్ద ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో దాదాపు 15 గుడారాలు కాలిపోయాయి. అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. అయితే 11 రోజుల క్రితం రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో భారీగా మంటలు వ్యాపించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో 18 టెంట్లు దగ్ధమయ్యాయి.

తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టులో పిటిషన్

తొక్కిసలాటలో 30మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. విశాల్ తివారీ అనే న్యాయవాది ఈ వ్యాజ్యాన్ని వేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రాలకు స్పష్టమైన, విధానపరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని అందులో కోరారు. భక్తుల భద్రత ప్రమాదంలో పడకుండా నివారించేలా వీఐపీల కదలికలను ఆపాలని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ వ్యాజ్యం నేపథ్యంలో తొక్కిసలాటపై యూపీ ప్రభుత్వం స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పిం చాల్సి ఉంటుంది.





బీజేపీ డీఎన్ఏలోనే ప్రజాస్వామ్య ఖూనీ

(మొదటిపేజీ తరువాయి)

కరత్ మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏండ్ల పాలనలో పార్లమెంటరీ పద్ధతులకు తిలోదకాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరిగాయని ప్రకాశ్ కరత్ తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సొరేన్‌ల అరెస్టులను ఆయన ప్రస్తావిస్తూ 'ప్రతిపక్షాలకు చెందిన నాయకులను ఏ విధంగా జైలులో ఉంచారో మనం చూశాం. ఇప్పుడు ఢిల్లీలో శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందు అప్పటి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి జైలులో పెట్టారు. దానికి ముందు జార్ఖండ్ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత హేమంత్ సొరేన్‌ను కూడా అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ప్రతిపక్షాలపై దాడి చేయడం, ఆ పార్టీల నేతలపై తప్పుడు కేసులు బనాయించడం, వారిని జైళ్లలో పెట్టడం బీజేపీకి పరిపాటిగా మారింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్ష ప్రభుత్వాల పాలనలో త్రిపురలో మతపరమైన అల్లర్లేవీ జరగలేదని ప్రకాష్ కరత్ గుర్తు చేశారు. కానీ ఇప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రల కారణంగా అలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. 'దేశంలో హిందువులు, ముస్లింల మధ్య ఉద్రిక్తతలను పెంచడానికి వారు పథకాలు రచిస్తున్నారు. బీజేపీ అధికారంలో ఉన్నంత కాలం ప్రజాస్వామ్యానికి ప్రమాదమే' అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరమున్నదని నొక్కి చెప్పారు. దేశ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని మార్చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. జమిలి ఎన్నికల బిల్లు అందులో భాగమేనని అన్నారు. ఈ సవరణల ద్వారా శాసనసభ ఎన్నికలు రెండేండ్లకో మూడేండ్లకో ఒకసారి జరిగేలా వారు నిర్ణయం తీసుకోగలరని ప్రకాశ్ కరత్ చెప్పారు.

హామీల అమలులో విఫలం : మాణిక్ సర్కార్

2018కి ముందు త్రిపురకు కాషాయ పార్టీ ఇచ్చిన అనేక హామీలు నేటికీ నెరవేరలేదని మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ విమర్శించారు. ఉపాధి హామీ పథకం కార్మికుల రోజువారీ వేతనాన్ని పెంచుతామని చెప్పి ఆ మాటే మరిచారని అన్నారు. రాష్ట్రాన్ని పాలించిన సమయంలో వామపక్ష ప్రభుత్వం సామాన్య ప్రజల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. బీజేపీ పాలనలో రాష్ట్రంలో అవినీతి పెచ్చురిల్లిందని, శాంతి భద్రతలు కనుమరుగయ్యాయని, రాజకీయ హింస, మహిళలపై నేరాలు పెరిగాయని తెలిపారు. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని సీపీఐ (ఎం) భారీ ర్యాలీ ప్రతిబింబించిందని అన్నారు. ఈ ర్యాలీకి ప్రతిపక్ష నేత, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి, మాజీ మంత్రి బాదల్ చౌదరి తదితర నేతలు హాజరై ప్రసంగించారు. ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేశారు. అగర్తల వీధులన్నీ కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించకపోతే తమ పార్టీ తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగం పెరిగి పేద విద్యార్థుల బతుకులు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు అడ్డా కూలీలుగా ఆటో రిక్షా కార్మికులుగా పని చేస్తున్నారని ఆందోళన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు చేస్తున్న పోరాటానికి తమ పార్టీ సంపూర్ణంగా మద్దతిస్తుందని చెప్పారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ..ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలుగా కాకుండా విద్యార్థుల హక్కుగా చూడాలన్నారు ఈ నిధుల విడుదల నిరంతర ప్రక్రియగా కొనసాగాలి కానీ ముఖ్యమంత్రి జేబు నుంచి ఇచ్చి నట్టుగా చూడొద్దన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫీజుల బకాయిలు విడుదల చేయాలని అడుగుతుంటే ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు మాత్రం వేల కోట్ల రూపాయలు రాత్రికి రాత్రే విడుదల చేస్తోందని ఆరోపించారు. వారం పది రోజుల్లో మొత్తం ఫీజుల బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే విద్యార్థులతో సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం, కురుమ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్‌చారి, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.మనిమంజరి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహనాయక్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్తాం

చుక్కా రామయ్య వారసత్వాన్ని కొనసాగిస్తాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యను హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న ఆయన నివాసానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం ఉదయం వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. రామయ్యకు శాలువా కప్పి సన్మానించారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చుక్కా రామయ్యను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఎన్నికయ్యారంటూ చుక్కా రామయ్యకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, కంట్రోల్ కమిషన్ చైర్మెన్ డిజి నరసింహారావు వివరించారు. జాన్‌వెస్లీ డీవైఎఫ్ఐ, కేవీపీఎస్‌లో పనిచేశారంటూ గుర్తు చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీకి రామయ్య మిఠాయి తినిపించి శుభాకాంక్షలు చెప్పారు. వెళ్తున్నామని చెప్పగానే 'మంచిది' అంటూ చుక్కా రామయ్య సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో జాన్‌వెస్లీ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉద్యమాలకు పూనుకుంటామని చెప్పారు. విద్యారంగంలో చుక్కా రామయ్య అందించిన సేవలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని వివరించారు. ఆయన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. పుచ్చలపల్లి సుందరయ్యతోపాటు జైలు జీవితం గడిపారని చెప్పారు. చుక్కా రామయ్య స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారని అన్నారు. వామపక్ష ఉద్యమాలకు, సీపీఐ(ఎం)కు అండగా నిలబడ్డారని వివరించారు. ఎమ్మెల్సీగా ప్రజలకు, ఉపాధ్యాయులకు సేవ చేశారని చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మిగిలిన ఉన్న వారు అరుదుగా ఉన్నారని వివరించారు. ప్రజాపోరాటాలను ముందుకు తీసుకుపోవడానికి ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తామని అన్నారు.

ఆర్థిక వ్యవస్థ గొప్ప స్థితిలో లేదు

మాజీ సీఈఏ అరవింద్ సుబ్రమణియన్

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ గొప్ప స్థితిలో ఏమీ లేదని మోడీ ప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) అరవింద్ సుబ్రమణియన్ అన్నారు. సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం తన విధానాన్ని, ప్రవృత్తిని మార్చుకోవాలన్నారు. 2014 నుంచి 2018 వరకు ఆయన మోడీ ప్రభుత్వం మొదటి సీఈఏగా ఉన్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడుతోందనడంలో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు.

చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై ఎస్మా

నిర్బంధ చర్యలు మానుకోవాలి

ప్రయివేటీకరణ ఆపాలి : సీపీఐ(ఎం) డిమాండ్

చండీగఢ్ : ప్రభుత్వ రంగంలోని విద్యుత్ పంపిణీ విభాగాన్ని ప్రయివేటు కంపెనీకి బదలాయించడానికి చండీగఢ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సమ్మె చేస్తున్న చండీగఢ్ విద్యుత్ శాఖ ఉద్యోగులపై హర్యానా అత్యవసర సేవల (నిర్వహణ) చట్టం-ఎస్మాను ప్రభుత్వం ప్రయోగించింది. ఫిబ్రవరి మొదటి వారంలో కేంద్రపాలిత ప్రాంతమైన చండీగఢ్ విద్యుత్ పంపిణీ విభాగాన్ని ప్రైవేటు రంగంలోని ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ (ఈఈడీఎల్)కు అప్పగించనున్నారు. "కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లోని సీపీడీఎల్ (చండీగఢ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్)లో ఉద్యోగులు చేసే సమ్మె ఏదైనా అది విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, నిర్వహణను దెబ్బతీస్తుంది. ప్రజలకు అత్యవసరమైన సేవ అయినందున ఈ సమ్మె వల్ల వారు ఇబ్బందులు పడతారు. అందువల్ల ప్రజా ప్రయోజనాల రీత్యా సమ్మెను నిషేధించడం అవసరమైనందున ఈ చర్య తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రకటన వెల్లడించింది. ఆరు మాసాల పాటు సమ్మె చేయరాదని, ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది.

కాగా ప్రయివేటు కంపెనీకి తమ విభాగం బదిలీ అయిన రోజు నుండే తాము విధులను బహిష్కరిస్తామని యుటి పవర్‌మెన్ యూనియన్ బుధవారమే పునరుద్ఘాటించిందని యూనియన్ ప్రధాన కార్యదర్శి గోపాల్ దత్ జోషి తెలిపారు. ప్రయివేటు కంపెనీకి బదలాయించబడే ఉద్యోగులకు ఎలాంటి విధానం ప్రకటించకుండా, వారికి ఒక అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా ఈ చర్య చేపట్టారని, అందువల్లే తాము విధులను బహిష్కరించాల్సి వస్తోందని ఆయన చెప్పారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు ప్రభుత్వ మొండి వైఖరే కారణమని ఆయన విమర్శించారు.

ప్రయివేటీకరణ చర్యలు ఆపండి : సీపీఐ(ఎం)

చండీగఢ్ విద్యుత్ విభాగం ప్రయివేటీకరణను తక్షణమే ఆపాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గత 50రోజులుగా విద్యుత్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, వృద్ధులు, మహిళలు, పిల్లా పాపలనే తేడా లేకుండా సమ్మె చేస్తున్నారు. పలు గ్రామ కమిటీలు, సంక్షేమ సంఘాలు, స్వతంత్ర మహిళా సంఘాలు, గురుద్వారా కమిటీలు, రైతు, యువజన సంఘాల ప్రాతినిధ్యంతో ప్రయివేటీకరణ వ్యతిరేక వేదికను చండీగఢ్ ప్రజలు ఏర్పాటు చేశారు. అత్యధిక లాభాలనార్జించే, సమర్ధవంతమైన, తక్కువ టారిఫ్‌లు గల ఈ విద్యుత్ సంస్థను ప్రయివేటీకరించడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని సీపీఐ(ఎం) విమర్శించింది. నిరసనలు చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను వినడానికి బదులుగా వారిపై ఎస్మాను ప్రభుత్వం ప్రయోగించిందని, పైగా యూనియన్ నేతలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని విమర్శించింది. ఇక చివరి ప్రయత్నంగా ఉద్యోగులు కూడా సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని పేర్కొంది. ఎస్మాను విరమించి, ఉద్యోగులపై చేపడుతున్న అణచివేత చర్యలను తక్షణమే ఉపసంహరించాలని సీపీఐ(ఎం) చండీగఢ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వెంటనే ఉద్యోగులు, వినియోగదారులతో చర్చలు జరపాలని కోరింది.



ఎస్మాను ఎత్తివేయాలి : ఏఐకేఎస్

చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై విధించిన ఎస్మాను తక్షణమే ఎత్తివేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) డిమాండ్ చేసింది. పోరుబాటలోని ఉద్యోగులకు సంఘీభావాన్ని తెలియచేసింది. ప్రజా వ్యతిరేకమైన ఈ ప్రయివేటీకరణ చర్యను ఖండిస్తూ ఈఈఎఫ్ఐ (ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా), ఎన్‌సీసీఓఈఈఈ ఆధ్వర్యంలో గత 50 రోజులుగా కార్మికులు వీరోచితమైన రీతిలో పోరు సాగిస్తున్నారని పేర్కొంది. గత కొద్ది సంవత్సరాలుగా ఈ సంస్థ వార్షిక సగటు లాభాలు దాదాపు రూ.250కోట్లుగా వున్నాయని తెలిపింది. ఇంత లాభాలను ఆర్జించే సంస్థను కేవలం రూ.174.63కోట్ల ధరకే బిడ్డింగ్ పెట్టారని విమర్శించింది. ఈ లావాదేవీల్లో అవినీతి పెచ్చరిల్లిందంటూ, ఈ చర్యతో కార్మికులు, వినియోగదారులపై ఒకేసారి దాడి చేస్తున్నారని ఏఐకేఎస్ విమర్శించింది. దేశవ్యాప్తంగా ప్రయివేటీకరణ చర్యలను అడ్డుకోవాలని, ఇది దేశానికి ఇంధన భద్రత, సార్వభౌమాధికారతకు సంబంధించిన అంశమని పేర్కొంది.

మందు బాబుల నెత్తిపై పిడుగు

- త్వరలో మద్యం ధరలకు రెక్కలు
- 20 నుంచి 25 శాతం పెంపు?
- కింగ్ ఫిషర్ ఒత్తిడితో దిగొచ్చిన సర్కార్
- ప్రతినెలా రూ.500 కోట్ల నుంచి రూ.700 కోట్ల మేర అదనపు ఆదాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో త్వరలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. ముందుగా బీర్లు, ఆ తర్వాత లిక్కర్ ధరలను పెంచనున్నారు. త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా ఎక్సైజ్ శాఖ ధరల పెంపు ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేసింది. రాష్ట్రంలో మద్యం ధరలు పెంచొద్దని ప్రభుత్వం ముందుగా నిర్ణయం తీసుకున్నప్పటికీ, పక్క రాష్ట్రాల్లో ధరలు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. అంతేకాకుండా ఇటీవల యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరాను ఆపేసింది. ధరల పెంపునకు నిర్ణయం తీసుకోవడం లేదంటూ లేఖ రాసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో బీర్లతో పాటుగా లిక్కర్ ధరల్లో మార్పులు చేయాలనే ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చినట్లు ఎక్సైజ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. లిక్కర్ ధరలను సగటున 20 నుంచి 25 శాతం మేర పెంచేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం

బీర్లపై 15 శాతం?

మద్యం ధరల పెంపుపై ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ నివేదిక ప్రకారం బీర్లపై 15 శాతం, బ్రాండెడ్ లిక్కర్‌పై క్వార్టర్‌కు రూ.10 నుంచి 80 వరకు పెంచనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి అమలు చేయాలని ఎక్సైజ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. సచివాలయంలో గత నాలుగైదు రోజులుగా అధికారులు సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ప్రీమియం బ్రాండ్ లిక్కర్‌తో పాటు బీర్లను పెంచనున్నారు. అయితే చీప్ లిక్కర్ రేట్లను మాత్రం తక్కువ శాతం పెంచాలని ఎక్సైజ్ శాఖ నివేదిక ఇచ్చినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఆదాయం కోసమే...

ఈ ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాల వ్యాట్, ఎక్సైజ్ డ్యూటీల రూపంలో రూ.36 వేల కోట్ల ఆదాయం వస్తుందని రేవంత్ సర్కార్ అంచనా వేసింది. ఏప్రిల్ -సెప్టెంబర్ వరకు తొలి ఆరు నెలల్లో ఎక్సైజ్ శాఖకు ఎక్సైజ్ డ్యూటీ ద్వారా రూ.9,493 కోట్లు, వ్యాట్ ద్వారా రూ.8,040 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. అంటే తొలి ఆరు నెలల్లో రూ.17,533 కోట్ల రాబడి మాత్రమే వచ్చింది. అయితే, ఆ తర్వాత పండుగలు, డిసెంబర్ నెలలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో ఆదాయం పెరిగింది. ప్రస్తుతం మద్యంపై కొంత ఆదాయం తగ్గిన నేపథ్యంలో ధరలు పెంచి ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సర్కార్ భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్‌లు, పబ్‌ల ద్వారా ద్వారా రోజుకు సరాసరిగా రూ.90 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. నెలకు సగటున రూ. 2,700 కోట్ల నుంచి రూ. 3,000 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడిస్తున్నారు. లిక్కర్ రేట్లు పెంచితే ఆ ఆదాయానికి తోడు.. ప్రతి నెలా దాదాపు రూ.500 నుంచి రూ.700 కోట్ల వరకు అదనంగా ఆదాయం వస్తుందని అంచనా.

కంపెనీల ఒత్తిడికి తలొగ్గిన సర్కార్..

రాష్ట్రంలో మద్యం ధరలు పెంచాలని కంపెనీలు గత కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్ర మద్యం మార్కెట్‌లో దాదాపు 60 శాతం వాటా ఉన్న కింగ్‌ఫిషర్ బీర్ల కంపెనీ తమకు ప్రస్తుతం చెల్లిస్తున్న బేసిక్ ధర మీద కనీసం 30.1 శాతం అదనపు ధర చెల్లించాలని కోట్ చేసింది. ఈ కంపెనీ డిమాండ్‌నే మిగిలిన కంపెనీలూ అనుసరించాయి. ఈ నేపథ్యంలోనే త్రిసభ్య కమిటీ కూడా 15 నుంచి 19 శాతం పెంచేందుకు నివేదిక ఇవ్వగా.. 15 శాతం బీర్ బేసిక్ ధర పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినట్టు తెలిసింది. ఒక్క బీర్ల పెట్టె మీద 15 శాతం బేసిక్ ధర పెంచితే, దానికి కనీసం రూ. 250 నుంచి రూ. 280 వరకు వ్యాట్, ఎక్సైజ్ సుంకంతో పాటు వివిధ రకాల పన్నులు జత కలుస్తాయి. దీంతో రూ.150 ఉన్న లైట్‌బీరు రూ.180 వరకు, రూ.160 ధర ఉన్న స్ట్రాంగ్‌బీరు ధర రూ.200 వరకు పెరగవచ్చని టీజీబీసీఎల్ అంచనా వేస్తున్నది. తాజాగా త్రిసభ్య కమిటీ నివేదిక, అబ్కారీ శాఖ ప్రతిపాదనలపై కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది.

నవతెలంగాణ

మనిషిని సంస్కారవంతుడిగా తీర్చిదిద్దేదే నిజమైన విద్య - స్వామి వివేకానంద

శుక్రవారం 31 జనవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

కర్తవ్యపథం



ఒక పార్టీ మహాసభ, మహా అయితే వారి శ్రేణులకు కర్తవ్య బోధ చేసి, దిశా నిర్దేశం చేయొచ్చు. కాని, ఇక్కడ సీపీఐ(ఎం) శ్రేణులే కాదు, రాష్ట్రంలోని కష్టజీవులు ఆ పార్టీ 4వ మహాసభ ఏమి చెప్తుందోనని, ఏ ఫలితాలు వెలువడతాయోనని శ్రద్ధగా ఎదురుచూశారు. మరీ ముఖ్యంగా మోడీ సర్కార్ కార్పొరేట్ల కొమ్ముకాస్తూ బరితెగిస్తున్న వేళ, కార్మిక చట్టాలను చుట్టచుట్టి నాలుగు కోడ్‌లుగా రూపొందిస్తున్న సమయాన 'కార్మికుల' జిల్లా సంగారెడ్డి జిల్లా కార్మికవర్గం అక్కడక్కడా మిణుకుమిణుకుమంటున్న బీఎంఎస్ యూనియన్ల సభ్యులతో సహా ఏ పోరాటాలకు పిలుపునిస్తుందోనని వాళ్లంతా కళ్లు చేసుకుని ఎదురుచూడటంలో ఆశ్చర్యమేముంది? పదులుకాదు, వందలుకాదు, వేలాది మంది కార్మికులు తమకొస్తున్న దాంట్లో కొంత, మరికొందరు తమ జీతమంతా ఈ మహాసభ కోసం విరాళమివ్వడం ప్రస్తుతం వినిమయతత్వం కరాళ నృత్యం చేస్తున్న వేళ సామాన్య విషయం కాదు. ఆ జిల్లా ప్రతినిధి ఈ విషయం చెప్పినపుడు ప్రతినిధుల హర్షధ్వానాలు మిన్నంటాయి. వారిని తన్మయుల్ని చేసిందీ విషయం.

> రాష్ట్రంలో ముంచుకొస్తున్న మతోన్మాద ప్రమాదం గురించి ఇటు కాంగ్రెస్ గానీ, అటు బీఆర్ఎస్‌కు గానీ అర్థమైనట్లు కన్పడదు. 'నువ్వు బీజేపీకి చెంచావి' అని బీఆర్ఎస్ వారు కాంగ్రెస్‌ని తిడితే, 'నువ్వే బీజేపీకి బీ టీమ్‌వి' అని కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను తిడ్తున్నది. కానీ ఇద్దరూ కలిసి రాష్ట్రంలో బీజేపీకి ఫీల్డు వదిలేస్తున్నామనే ధ్యాసే లేదు. ఈ నేపథ్యంలో వామపక్ష ప్రజాతంత్ర, సామాజిక శక్తులన్నింటిని కూడగట్టాలని సీపీఐ(ఎం) నాలుగవ మహాసభ పిలుపునిచ్చింది. ఆ దశలో ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలను నిర్మించటానికి నూతనోత్సాహంతో ముందుకు పోతామని కొత్త కమిటీ ప్రకటించడం ఆహ్వానించాల్సిన పరిణామం.


అంతేనా?! ఒకసారి ఢిల్లీని కమ్ముకుని మోడీ మెడలు వంచిన హాలికులు మరోసారి గడ్డకట్టే ఈ హేమంతంలో కార్పొరేట్ల సేవకై తపిస్తున్న మోడీ సామ్రాజ్యంపై ఉద్యమాలను ఎక్కుపెడుతున్నది రైతాంగం. ఆ హాలికుల అనుయాయులు తెలంగాణలో తమ కోసం సీపీఐ(ఎం) నాలుగవ మహాసభ ఏ నిర్ణయాలు చేసిందోనని పరిశీలించి చూస్తున్నారు. "దళితులు, వ్యవసాయ కార్మికులు, పేద రైతుల సమస్యలపై వర్గపోరాటాల"కు పదును పెట్టాలనే కర్తవ్యం సీపీఐ(ఎం)ను రాష్ట్రంలో అగ్రభాగాన నిలుపుతుందనడంలో సందేహం లేదు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ గత మూడేండ్ల కాలంలో చేసిన కార్యకలాపాలను సమీక్షించుకుంటుంది. దానిలోని లోటుపాట్లను సరిదిద్దుకుంటుంది. తదుపరి మూడేండ్లకు అవసరమైన ఎత్తుగడలను రూపొందించు కుంటుంది. సీపీఐ(ఎం) అఖిల భారత పార్టీ కావున, అఖిల భారత విధానంలో అంతర్భాగంగానే ఈ ఎత్తుగడలుంటాయి. ఈ విషయాన్ని పొలిట్‌బ్యూరో నేతలంతా స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రజావ్యతిరేక విధానాలపై మొదటి నుండీ పోరాడుతున్న సీపీఐ(ఎం), బీజేపీ వ్యూహాన్ని సరిగానే అర్థం చేసుకుంది. కాంగ్రెస్ ఎంఎల్ఏగా గెల్చిన కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డిని బీజేపీలో చేర్చుకుని రాజీనామా చేయించి ఉప ఎన్నిక తెచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గనుక గెలిచి ఉంటే రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రమే మారిపోయి ఉండేది. అన్నేళ్ల రాజకీయ వైరంతో సంబంధం లేకుండా బీఆర్ఎస్‌ను బలపరుస్తామని సీపీఐ(ఎం) ప్రకటించింది. అందుకు సీపీఐ కూడా చేదోడువాదోడుగా నిలిచింది. ఇది రాష్ట్ర రాజకీయ పరిణామాలను ఒక మలుపు తిప్పాయి.

ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు సదుపాయం మినహా మిగిలినవి సరిగా అమలుకావడంలేదు. ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తిని పక్కదారులు పట్టించేందుకు రేవంత్ సర్కార్ ఉధృతమైన ప్రయత్నాలు చేస్తున్నది. ఈ అసంతృప్తిని ఉపయోగించుకునేందుకు మరోపక్క బీజేపీ కేంద్ర మంత్రులతో సహా ఢిల్లీ నుండి గల్లీ నేతల దాకా రంగంలోకి దిగారు. అందుకనే తెలంగాణలో పైన జరిగే ఆర్భాటపు హడావుడేగాక చాపకింద నీరులా విస్తరిస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నిలువరించడం కీలక కర్తవ్యంగా మహాసభ భావించింది. బీజేపీకొస్తున్న ఓట్లు, దాని సీట్లకు సంబంధం లేకుండా ఈ భావజాల విస్తరణ కొనసాగుతోంది. దాన్ని ఎదుర్కొనేందుకు సకల సన్నద్ధం కావాలని మహాసభ నిర్ణయించింది. కానీ రాష్ట్రంలో ముంచుకొస్తున్న మతోన్మాద ప్రమాదం గురించి ఇటు కాంగ్రెస్ గానీ, అటు బీఆర్ఎస్‌కు గానీ అర్థమైనట్లు కన్పడదు. 'నువ్వు బీజేపీకి చెంచావి' అని బీఆర్ఎస్ వారు కాంగ్రెస్‌ని తిడితే, 'నువ్వే బీజేపీకి బీ టీమ్‌వి' అని కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను తిడ్తున్నది. కానీ ఇద్దరూ కలిసి రాష్ట్రంలో బీజేపీకి ఫీల్డు వదిలేస్తున్నామనే ధ్యాసే లేదు.

ఈ నేపథ్యంలో వామపక్ష ప్రజాతంత్ర, సామాజిక శక్తులన్నింటిని కూడగట్టాలని సీపీఐ(ఎం) నాలుగవ మహాసభ పిలుపునిచ్చింది. ఆ దశలో ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలను నిర్మించటానికి నూతనోత్సాహంతో ముందుకు పోతామని కొత్త కమిటీ ప్రకటించడం ఆహ్వానించాల్సిన పరిణామం.

యుద్ధం- అస్త్రశస్త్రాలతో కాదు, శాస్త్రాలతో చేయండి!



డాక్టర్ దేవరాజు మహారాజు

"ఏ విషయాలనైతే మనం నిజం కావాలనుకుంటున్నామో ఆ విషయాల్ని నమ్మేముందు మనం కొంత జాగరూకతతో ఉండాలి! నిన్ను నువ్వు మోసం చేసుకున్నంతగా వేరెవరూ నిన్ను మోసం చేయలేరు"

- నొబెల్ గ్రహీత, అమెరికా భౌతికశాస్త్రవేత్త, రిచర్డ్ ఫేన్‌మన్

భారతదేశంలో బౌద్ధసంస్కృతి ఉందని తవ్వకాల చరిత్ర చెపుతుంది. తవ్వకాల ద్వారా భూగర్భంలో లెక్కలేనన్ని ఆధారాలు దొరికాయి. కానీ, బ్రాహ్మణ వైదిక సంస్కృతి, చరిత్రా ఇప్పటివరకు ఏ తవ్వకాల్లో బయట పడిందీ? బుద్ధుడి ఆనవాళ్లు లెకలేనన్ని దొరికాయి. దొరుకుతున్నాయి. ఇతర వైదిక దేవీదేవతల ఆనవాళ్లు ఎక్కడ దొరికాయీ? కల్పిత కథల్ని వాస్తవాలతో ఎందుకు ముడిపెడతారూ? 'దీక్ష'- బౌద్ధ అంతర్జాతీయ నెట్‌వర్క్ అందించిన సమాచారం ప్రకారం, బుద్ధుణ్ణి 'సమ్మ-శంబుద్ధ' అని పిలుచుకుంటారు. ఈ సమ్మ శంబుద్ధ నుండే శంభూనాథ్ అనే పేరు ఏర్పడింది. ఆ రకంగా శంభూనాథ్ అన్నా, శంభూ మహదేవ్ అన్నా అవి బుద్ధుని పేర్లే. హర్ హర్ మహాదేవ్ - అంటే అర్హత్ మహాముని బుద్ధుడు. "శమభో మతాలబ్ శివహే/ బాలకీ శంభో మతాలబ్ / సమ్మ సమ బుద్ధా తథా గత బుద్ధే!" - మూసుకుని ఉన్న బుద్ధుడి కళ్లకు (శిల్పానికి) తెల్లగా పెయింట్ కొట్టి, కృత్రిమంగా నల్లరంగుతో కళ్లు దిద్ది- లేదా బుద్ధుడి శిల్పానికే గుంగురు వెంట్రుకల వెనుక విరబోసుకున్న జుట్టు అమర్చి, ధ్యానముద్రలో ఉన్న బుద్ధుడి విగ్రహం వెనక త్రిశూలం పెట్టి, దాన్ని శివుడి విగ్రహంగా మార్చి, పూజల పేరుతో వ్యాపారం చేయడం భావ్యమా? బుద్ధుడి త్రిశరణాలకు సంబంధించి బౌద్ధంలో ఒక సంకేతం-(గుర్తు)ఉంది. దాన్ని కొంచెం పెద్దగా చేసి త్రిశూలం చేయడం. ఆత్రిశరణాల గుర్తునే ఒకవైపు తిప్పి, దాన్నే వైదిక మతస్తులు 'ఓం' గుర్తుగా మార్చుకోవడం న్యాయమా?

భారతదేశ చరిత్రలో అత్యంత శక్తివంతులు నాగులు. నాగులు అంటే నాగుపాములు అని కాదు. అది ఒక తెగ. దేశంలో చాలాచోట్ల ఆ తెగ వ్యాపించి ఉండేది. నాగులను జయించలేని ఆర్యులు, నాగులతో సఖ్యత పాటించి, సంధి చేసుకున్నారు. ఆర్యేతరులైన ఈ నాగుల కాలంలో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లారని తెలుస్తూ ఉంది. నాగులకు ఆద్యుడు శిశునాగుడు. సాధారణ శకానికి ముందు 642 BCEలో మగధలో ఈ నాగరాజ్యం ఉండేదని తెలుస్తూ ఉంది. ఈ విషయం అంబేద్కర్ తన రచనలో ఒకచోట ప్రస్తావించారు. బుద్ధుడు ధ్యానముద్రలో ఉండగా, నాగుపాము వచ్చి, పడగవిప్పి నీడనిచ్చినట్లు కొన్ని శిల్పాలు, చిత్రపటాలు కనిపిస్తాయి. అలాంటివి వైదిక మత ప్రభావంతో చిత్రించబడ్డవి లేదా శిల్పాలుగా చెక్కబడ్డవి. నిజానికి నాగవంశం వారు బౌద్ధులు! బుద్ధుడికి అనుయా యులుగా ఉన్నారు. ఆయనకు రక్షణగా ఉన్నారు అని చెప్పడానికి ఒక సంకేతంగా అలా చెక్కారు. అంతే! నాగుల జనాభా అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలన్నీ వారి నాగ పేరుతో ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. ఉదాహరణకు నాగ్ పూర్, దాని దగ్గరలో నాగ్‌నది వగైరా... బుద్ధుణ్ణి అవతారాల్లో చేర్చుకునేందుకు వైదిక మతస్తులు పన్నిన కుట్రలో భాగంగా నాగుపాము పడగవిప్పి బుద్ధుడికి నీడనిచ్చినట్లు చెక్కుకున్నారు. బౌద్ధంమీద వైదిక మతస్తుల ప్రభావం అధికం కావడంతో బౌద్ధంలో వజ్రయానం ప్రారంభమైంది. వైదిక మతంలో ఉన్నవన్నీ వజ్రయానంలో ఉన్నాయి.

అశోకచక్రవర్తి తన రాజ్యంలోని గ్రామాల్లో, పట్టణాల్లో 84వేల బౌద్ధస్థూపాలు, విహారాలు, సంఘారామాలు, విద్యాలయాలు, చికిత్సాలయాలు కట్టించాడు. అవి మూడేళ్లలో పూర్తయ్యాయి. వాటన్నిటినీ కార్తీక అమావాస్య రోజు దీపదానోత్సవం రోజు ఒకేసారి ప్రారంభింపజేశాడు. అంతేకాదు, మనువాదుల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు విడిచిన బుద్ధుడి అనుచరుడు మౌద్గాల్యన్ స్మృతిలో కూడా కార్తీక అమావాస్యరోజే దీపాలు వెలిగించి నివాళులు అర్పించాలని అశోకుడు ప్రకటించాడు. వీటితో పాటు మొదటిసారి పశువులకు చికిత్సాలయాలు, రహదారుల వెంట మంచినీటి సౌకర్యం- అశోకుడే ప్రారంభించాడు. మనుషుల గురించే కాదు, పశుపక్ష్యాదుల గురించి ఆలోచించా లన్నది బౌద్ధం చెప్పింది.దాన్ని అశోకుడు పూర్తిగా పాటిస్తూ, మనుషులకు, పశువులకు విడివిడిగా మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశాడు. అలాగే విడివిడిగా చికిత్సాలయాలు ఏర్పాటు చేశాడు. ఇది గమనించాల్సిన విషయం!

బౌద్ధపర్వదినాల్లో 'ఉపాసథ' ముఖ్యమైంది. అమావాస్య - పౌర్ణమినాడు అంటే, పదిహేను రోజులకు ఒకసారి సమావేశాలు నిర్వహించుకునే రోజులను 'ఉపోసథ' రోజులు అంటారు. బుద్ధుడు భిక్షులతో కలిసి వచ్చిన సందర్భాల్లో ఇంటింటా దీపాలు వెలిగించి ఆహ్వానం పలికే విధానం సంప్రదాయంగా సాగింది. ధర్మోపన్యాసాలు, దాన కార్యక్రమాలు జరిపే ప్రదేశాలను దీపాలతో నింపేవారు. స్థూపాలన్నీ దీపాల దిబ్బలుగా, దీపాల కొండలుగా కని పించేవి. అందుకే వీటిని 'దీపాల దిన్నెలు' అని అనేవారు. దీపావళి బౌద్ధుల పండగ. దీపావళి మరుసటి రోజు గోవర్ధన్ పూజ చేస్తారు. వైశాలిలోని బౌద్ధ స్థూపం వంటిది చిన్నస్థూపం పెద్ద పళ్లెంలో తయారు చేసి, దానికి పూజ చేస్తారు.

అదే గోవర్ధన్ పూజ! ప్రతి ఒక్కరూ బీహార్‌లోని ప్రసిద్ధ వైశాలి స్థూపం వెళ్లి పూజించుకోలేరు కాబట్టి, వారి వారి ఇళ్లలోనే చిన్నచిన్న స్థూపాలు తయారు చేసుకుని, పూలతో అలంకరించి బుద్ధుణ్ణి తలచుకుంటారు. అదే గోవర్ధన్ పూజ. ఉత్తర భారతదేశంలో ఇది ఒక ఆచారంగా పాటిస్తున్నారే గాని, దాని వెనకఉన్న బౌద్ధమూలాల్ని మరిచి పోయారు. పూర్వీకులు చేశారు, మనమూ దాన్ని కొనసాగిద్దాం - అనే తప్ప, అసలు ఎందుకు చేస్తున్నాం? ఏ విలువల్ని కాపాడడానికి చేస్తున్నాం అనేది జనం ఆలోచించడం లేదు


బౌద్ధులు మరణాన్ని నిర్వాణం అంటారు. 'నిర్వాణం' అంటే దీపం ఆరిపోవడం. ప్రమిదలోని నూనె, వత్తి పూర్తిగా మండిన తర్వాత ఇక ఆ దీపం ఆరిపోతుంది. అదే నూనె, అదే వత్తి ఇక ఉండవు. వీటితో మళ్లీ దీపం వెలిగించలేం. మనిషి నిర్వాణం తర్వాత కూడా అంతే! ఇలా అనిత్యత్వాన్ని, అనాత్మవాదాన్నీ దీపంతో పోల్చి చెపుతుంది బౌద్ధం. ఒక రకంగా పునర్జన్మ ఉండదు అని ఈ దీపంతో బౌద్ధం స్పష్టంగా వివరించింది. మరణించిన వారి తల దగ్గర దీపం ఉంచే సంప్రదాయం ఈ నిర్వాణం నుండి వచ్చిందే. అందుకే మరణాన్ని దీపం ఆరిపోడంతో పోలుస్తారు. "నీ దీపం ఆరిపోను" అనే మాట ఇప్పటికీ వాడుకలో ఉంది కదా? నమస్తే, నమస్కారం - అనే మాటలూ పాలిభాష నుండీ వచ్చాయి. సంస్కృతం నుండి కాదు. డా.బి.ఆర్. అంబేద్కర్ పాలి - ఇంగ్లీషు డిక్షనరీ తయారు చేశారు. ఆయన రచనల్లో సంపుటి 16. పేజి. నెం. 217లో ఈ విషయం చూడొచ్చు.నమస్సా-నమస్సి-నమతి - అనే పాలి భాషా పదాల నుండి మనం ఇప్పటి నమస్కారం, నమస్తే-నమస్కార్ వంటి మాటలు తీసుకున్నాం. నమస్తి - అంటే TO PAY ATTENTION/ TO HONOUR/TO WORSHIP. ఇప్పటికీ మన నిత్యజీవితంలో వాడుతున్న మాటలు, కొనసాగిస్తున్న పద్ధతులు బౌద్ధం నుండి తీసుకున్నవే! సనాతన ధర్మమంటే ఏమిటో, ఏదో తెలుసుకుండా మూర్ఖంగా కట్టుకథల సంస్కృతి గురించి గొప్పలు చెప్పుకుంటున్నది నిజం కాదా? బౌద్ధ సంప్రదాయం నుండి తీసుకున్న విషయాలు ఇప్పటికీ మన జీవితంలో ఎందుకున్నాయీ? ఆలోచించాలి కదా?

ప్రపంచంలో ఒకానొక కాలంలో చిన్న చిన్న విషయాలకు కూడా పెద్ద ఎత్తున యుద్ధాలు జరిగేవి. చావుల్ని, రక్తపాతాల్ని తగ్గించడానికి ఇరుపక్షాల నుండి యుద్ధం చేయడానికి ఒక్కొక్కర్ని ఎన్నుకునేవారు. అందులో ఏ పక్షం వాడు గెలిస్తే, ఆ పక్షానిదే విజయం అనే ఒప్పందం ఉండేది. దానితో ఇరుపక్షాల సైన్యంలో మరణాలు తగ్గేవి. అప్పటి నుండే మల్లయుద్ధాలకు, గదా యుద్ధాలకు ప్రాధాన్యత పెరిగింది. ఈ విధంగా ప్రపంచమంతా యుద్ధాలతో, జయా పజయాలతో సతమతమౌతున్న సమయంలో గౌతమబుద్ధుడు మరొక రకమైన యుద్ధానికి తెరలేపాడు. అది అస్త్రశస్త్రాలతో చేసేది కాదు. శారీరకంగా చేసేది కూడా కాదు. బుద్ధిని ఉపయోగించి చేసేది. శాస్త్రాలతో చేసేది. తర్కబద్ధంగా వాదిస్తూ ప్రతివాదిని ఓడించడం. అది జ్ఞానయుద్ధం! జంబూ ద్వీపంలోనే కాదు, మొత్తం విశ్వవ్యాప్తంగా అభిప్రాయాలున్నంత మాత్రాన యుద్ధాలు చేసి ప్రాణాలు కోల్పోవల్సిన అవసరం లేదనీ, వైరం వైరాన్ని పెంచు తుందేగాని శాంతిస్థాపన చేయదనీ ఆయన ప్రచారం చేశాడు. వివేచనతో, వివేకంతో శాంతిస్థాపన జరుగుతుందని అదే సనాతన ధర్మమని ఆయన చెప్పగలిగాడు (యమక వగ్గే 5 : ధమ్మపథం)

బుద్ధుడి ఆలోచనా విధానంతో ప్రభావితులై ఎంతోమంది తత్త్వవేత్తలు, మేధావులు తయారయ్యారు. కేవలం చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలుసు కున్నారు. చర్చలు జ్ఞానాన్ని పెంచాలే గానీ, మనస్పర్థలు పెంచగూడదన్న నిర్ణయానికి వచ్చారు. ఈ అవగాహన ఫలితంగానే బౌద్ధులు ప్రపంచస్థాయి ప్రమాణాలుగల విశ్వ విద్యాలయాల్ని నెలకొల్పగలిగారు. అప్పుడే ఈ భారతదేశం 'విశ్వగురువు' స్థాయికి ఎదిగింది. ఎదిగి కూడా శతాబ్దాలు గడిచిపోయాయి. అవన్నీ నాశనం చేస్తూ వచ్చిన మూర్ఖ మనువాదులు ఇప్పుడు దేశాన్ని తామే విశ్వగురువుగా నిలబెడతామని ప్రగల్భాలు పలుకుతున్నారు. జాతుల మధ్య, వర్గాల మధ్య, ప్రాంతాల మధ్య అంతరాలు సష్టించి, విద్వేషాలు రెచ్చగొట్టి- అణిచివేతకు, అఘాయిత్యాలకు, హత్యలకు, అత్యాచారాలకు, అవినీతికి ప్రాధాన్యతనిస్తున్న నేటి ఈ పాలకుల్ని చూస్తే ఏమనిపిస్తుంది? మనమేం కోల్పోయామో, ఏస్థాయి నుంచి ఏస్థాయికి దిగజారిపోయామో తెలుస్తుంది. మనం దేన్ని కాపాడుకోవాల్సి ఉందో, దేన్ని పునర్నిర్మించుకోవాల్సి ఉందో- తేల్చుకోవాల్సి ఉంది. హ్యూన్ త్సాంగ్, ఇత్సింగ్ నోట్స్ వల్ల దేవభిక్షు అశ్వఘోష్, నాగార్జునుల గురించి, వారి బోధనల గురించి విస్తృతంగా తెలి సింది. తాత్విక విషయాల్లో వీరితో ఢీకొట్టగలవాడు తమకు ఒక శంకరాచార్య ఉన్నాడన్న ఆర్యబ్రాహ్మణులు, తర్వాత కాలంలో తోకముడిచారు. ఎందుకంటే, శంకరాచార్యను జనం ప్రచ్ఛన్న బుద్ధుడన్నారు. ఇకనేం జ్ఞానంతో పోటీపడలేక మోసపూరితంగా బౌద్ధారామాల్ని శివాలయాలుగా మార్పించే ప్రయత్నంలో పడిపోయాడు- శంకరా చార్య! ఏమైనా, ఆయన ప్రచ్ఛన్న బుద్ధుడన్న పేరు తగిలించుకోక తప్పలేదు !!

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

> చర్చలు జ్ఞానాన్ని పెంచాలే గానీ, మనస్పర్థలు పెంచగూడదన్న నిర్ణయానికి వచ్చారు. ఈ అవగాహన ఫలితంగానే బౌద్ధులు ప్రపంచస్థాయి ప్రమాణాలుగల విశ్వ విద్యాలయాల్ని నెలకొల్ప గలిగారు. అప్పుడే ఈ భారతదేశం 'విశ్వగురువు' స్థాయికి ఎదిగింది. ఎదిగి కూడా శతాబ్దాలు గడిచిపోయాయి. అవన్నీ నాశనం చేస్తూ వచ్చిన మూర్ఖ మనువాదులు ఇప్పుడు దేశాన్ని తామే విశ్వగురువుగా నిలబెడతామని ప్రగల్భాలు పలుకుతున్నారు. జాతుల మధ్య, వర్గాల మధ్య, ప్రాంతాల మధ్య అంతరాలు సష్టించి, విద్వేషాలు రెచ్చగొట్టి- అణిచివేతకు, అఘాయిత్యాలకు, హత్యలకు, అత్యాచారాలకు, అవినీతికి ప్రాధాన్యతనిస్తున్న నేటి ఈ పాలకుల్ని చూస్తే ఏమనిపిస్తుంది? మనమేం కోల్పోయామో, ఏస్థాయి నుంచి ఏస్థాయికి దిగజారిపోయామో తెలుస్తుంది. మనం దేన్ని కాపాడుకోవాల్సి ఉందో, దేన్ని పునర్నిర్మించుకోవాల్సి ఉందో- తేల్చుకోవాల్సి ఉంది.



సెల్‌ఫోన్, మాధ్యమాలకు బానిసగా యువత



తంగళ్లపల్లి కుమారస్వామి
8106133144

నేడు విద్యార్థులు, యువత సెల్‌ఫోన్లు, మాధ్యమాల బారిన పడి విలువైన భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటుండం బాధాకరమైన విషయం. కొంతమందికి క్రికెట్ అంటే పిచ్చి అభిమానం. స్నేహితులతో కలిసి ఐపీఎల్ ప్రతి ఒక్క మ్యాచ్‌ను తిలకించి ఎంజాయ్ చేస్తారు. దీన్ని ఎవరూ కాదనలేరు. కానీ, ఆ తర్వాత సెల్‌ఫోన్లలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లోకి ప్రవేశించి పందేలు కట్టడం ప్రారంభిస్తారు. ఇది ఆరంభంలో కొంత నగదు రావడంతో ఉత్సాహం ఉంటుంది. తర్వాత జేబులకు చిల్లుపడుతుంది. తొలుత బంధువులు, తెలిసినవారి వద్ద అప్పులు చేయడం, తర్వాత ప్రయివేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకోవడం, వాటిని తీర్చాలని అప్పులిచ్చినవారు నిత్యం వేధించడం వెరసి విద్యార్థులు, యువత పెడదారి పట్టడం పత్రికల్లో చూస్తున్నదే. ఈ మధ్యకాలంలో ఆన్‌లైన్ బెట్టింగులతో నష్టపోయిన యువకులు చోరీలకు దిగి పోలీసులకు చిక్కుతున్నారు. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో సమస్త ప్రపంచాన్ని వీక్షించే అవకాశం ఉంది. ఇది మంచి విషయం.తాము చదివే కోర్సులకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, జ్ఞానాన్ని విస్తృతం చేసుకోవచ్చు. కొంతమంది అలా ఉపయోగించుకుంటున్నారు కూడా. కానీ, బాధ్యత తెలియని యువకులు ఇలాంటి యాప్‌ల బారిన పడి వారు బలిపశువులవడమే కాకుండా కుటుంబాలను రోడ్ల మీదకు లాగుతున్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో చిన్నారుల నుంచి మొదలుకుని నలభై సంవత్సరాల యువత వరకు తెల్లవారుజామున రెండు, మూడు గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. విద్యార్థులైతే అవసరానికి మించి సెల్‌ఫోన్లను వాడు తున్నారు. రాత్రి నిద్రలేక ఉదయం తరగతి గదిలో నిద్రమత్తులో అధ్యాపకులు చెప్పే పాఠాలు వారికి అర్థం కావడం లేదు. దీంతో ఏకాగ్రత దెబ్బతిని చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోవడం ఒక సమస్య, అనారోగ్య సమస్యలు తలెత్తడం ఇంకో సమస్య. కరోనా కాలంలో లాక్‌డౌన్ విధించడంతో ఇంట్లోనే ఉండాల్సి రావడం, ఖాళీ సమయం ఎక్కువగా లభించడంతో యువత సోషల్‌మీడియా బారిన పడ్డారన్నది వాస్తవం. అయితే అది నేటికీ కొనసాగుతుండటం పట్ల విద్యారంగ, ఆరోగ్య నిపుణులు ఆందోళన చెందుతున్నారు.

ఓటీటీల్లో కొత్త సినిమాలు, వెబ్ సిరీసుల్లో అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు నేరుగా ప్రసారమవుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి సెన్సార్‌షిప్ లేకపోవడంతో వీటిని చూసి పిల్లలు, యువత పాడైపోతున్నారు. హింసాత్మక, లైంగిక కార్యకలాపాల దృశ్యాలు నేరుగా ప్రసారం అవుతుండటంతో దానికి ప్రభావితమై చెడిపోతున్నారు. అంతేకాదు, తలనొప్పి, కంటిచూపు ఇతర అనారోగ్య సమస్యలు కూడా వారిని చుట్టుముడుతున్నాయి. యాంత్రిక జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు మరచిపోతున్నారు. నైతిక విలువలు, ప్రమాణాలు దిగజారిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. జల్సాలకు అలవాటు పడి ఈ దందాల్లోకి దిగినట్లు పోలీసుల విచారణలో వెలువడుతుండటం ఆందోళనకరమైన అంశం. ఎనిమిది నుంచి పది గంటలు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లలో సినిమాలు, వీడియోలు చూడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటం చూస్తే గనుక నేటి విద్యార్థులు, యువత బానిసలుగా మారుతున్నారా? అనే ఆందోళన కూడా తల్లిదండ్రుల్లో మొదలవుతున్నది. పిల్లలు, యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తలనొప్పి, కంటి చూపు సమస్యలు వస్తున్నాయి. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. మత్తుపదార్థాలకు అలవాటుపడి బానిసలై నగదు కోసం నేరాలకు దిగడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తున్నది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వచ్చిన తర్వాత పోలీసులు నిఘా పెట్టి పట్టుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఐపీఎల్ సమయంలో పెద్దఎత్తున బెట్టింగ్‌లలో యువత భారీ ఎత్తున నగదు పోగొట్టుకు న్నారు. రూ.లక్షల అప్పు చేసి తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడ్డారు. తల్లిదండ్రులకు పుత్ర శోకాన్ని మిగిల్చారు. సెల్‌ఫోన్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. విద్యార్థులు, యువత పలు రకాల ఆటలాడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారికి ఇష్టమైన కళలో శిక్షణ ఇప్పిస్తే రాణిస్తారు. యోగా, ధ్యానం సాధన చేయించడం ద్వారా ఏకాగ్రత సాధిస్తారు. పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టి దారి తప్పక ముందే వారు సన్మార్గంలో నడిచేలా చూడాలి. తల్లిదండ్రులు ఎంత తీరిక లేకుండా ఉన్నా పిల్లలకు మాత్రం తగిన సమయం కేటా యించాలి. వారితో ప్రేమగా మాట్లాడి ఇష్టాఇష్టాలు తెలుసుకోవాలి. మంచి, చెడు గురించి వివరంగా చెప్పాలి. సానుకూల దృక్పథంలో ఆలోచించేలా వుండాలి. విద్యార్థులు, యువత బలహీన తలను ఆసరాగా తీసుకొని బెట్టింగ్ తరహా వ్యాపారాలు కొంతమంది చేస్తున్నారని, దీనిపై పోలీస్‌యంత్రాంగం గట్టి నిఘాపెట్టి దీన్ని అరికట్టే చొరవ చేయాలి. ముఖ్యంగా విద్యార్థులు, యువత సెల్‌ఫోన్లకు, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉన్నది.

విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకేదీ ప్రామాణికత?



కత్తెరసాల శ్రీనివాస్
8121184095

ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా...అభివృద్ధికైనా పరిశోధనలే కీలకం. అందుకే ప్రతీదేశంలో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ శాఖ తప్పనిసరిగా ఉంటుంది. తక్షశిల, నలంద లాంటి విశ్వవిద్యాలయాలతో భారతదేశం ప్రపంచంలోనే పేరుగాంచింది. కాలక్రమేణా దేశంలోని పరిశోధనలకు ప్రామాణికత తగ్గుతున్నది. దీనికి కారణం, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు. అధ్యాపకులు కేవలం ప్రమోషన్ల కోసం, విద్యార్థులైతే పీహెచ్‌డీల సబ్‌మిషన్ కోసమో ఐఎస్ఎస్ఎన్‌లో ప్రచురించు కోవడం వల్ల అసలైన పరిశోధకులకు తీవ్రనష్టం జరుగుతున్నది. ఒకవైపు అవగాహన లేకుండా, మరోవైపు త్వరితగతిన ప్రచురించుకోవాలనే ఉద్దేశంతో నకిలీ రీసెర్చ్ జర్నల్స్(ప్రిడియాట్రీ జర్నల్స్) యాజమాన్యాల మాటలు నమ్మి అందులో తమ విలువైన పరిశోధన పత్రాలను (రీసెర్చ్ పేపర్స్ లేదా రీసెర్చ్ ఆర్టికల్స్‌ను) ప్రచురిస్తున్నారు. దీనివలన వారిశ్రమతో పాటు ఆదాయం కూడా వృథా అవుతున్నది. ఆయా యూనివర్సిటీలకు రావాల్సిన పేరు ప్రఖ్యాతులు కూడా దక్కకుండా పోతున్నాయి.మరోవైపు కొంతమంది తూతూమంత్రంగా పరిశోధనలు చేస్తూ కేవలం ఇంటర్నేషనల్ స్టాండర్డ్ సిరీస్ నెంబర్ (ఐఎస్ఎస్ఎన్) జర్నల్స్‌లో ప్రచురిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన అండర్ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిజమైన పరిశోధకులు ఎంతో శ్రమించి పరిశోధన చేసి రాస్తున్న తమ పరిశోధన పత్రాలను ఎలాంటి ప్రామాణికత లేని, గుర్తింపులేని ఐఎస్ఎస్ఎన్ జర్నల్స్‌లో ప్రచురిస్తున్నారు. దీనివల్ల ఆ పరిశోధకులకే కాకుండా యూనివర్సిటీలకు చెడ్డపేరు వస్తున్నది. దీనికితోడు దేశానికున్న పేరు ప్రఖ్యాతలు కూడా నిలడటం లేదు. అంతేకాకుండా ఈ పరిశోధనా పత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఉండే ఒరిజినల్ పరిశోధకులు తమ రిఫరెన్స్‌గా చూసే అవకాశం లేకుండా పోతున్నది. అందువల్ల పరిశోధకులు గుర్తుంచుకోవాల్సిన అంశమేమిటంటే ఐఎస్ఎస్ఎన్ నెంబర్‌తో పాటు ఆ రీసెర్చ్ జర్నల్స్ స్కోపస్, యూజీసీ కేర్ లేదా వెబ్‌ఆఫ్ సైన్స్ , పీర్‌రివ్యూ మొదలైన వాటి లిస్టులో ఉన్నాయా లేదా చూసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఈ లిస్టులో ఉన్న రీసెర్చ్ జర్నల్స్‌లో మాత్రమే నిజమైన పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను ప్రచురించుకోవాలి. అంతేకాదు ఆ జర్నల్స్‌లో పలుమార్లు సమీక్షలు చేసిన తర్వాతనే అలాంటి ఆర్టికల్స్‌ను ప్రచురిస్తున్న పరిస్థితి ఉంది. సదరు రీసెర్చ్ ఆర్టికల్ ఒరిజినల్ కాదని ఆ కమిటీ పరిశీలించినప్పుడు, అలాంటి నకిలీ ఆర్టికల్స్‌కు ప్రచురించే అవకాశం ఉండదు. గనుక అధ్యాపకులైనా, పరిశోధక విద్యార్థులైనా పరిశోధనలు చేస్తున్నప్పుడు, ఆర్టికల్స్ ప్రచురిస్తున్నప్పుడు వాస్తవాల ఆధారంగానే తమ ఆర్టికల్స్‌ను ప్రచురించుకోవాలి.

స్కోపస్, యూజీసి-కేర్, వెబ్ ఆఫ్ సైన్సెస్, పీర్ రివ్యూ మొదలైన వాటి లిస్టులో ఉన్న రీసెర్చ్ ఆర్టికల్‌కు మాత్రమే మార్కులుంటాయి. ప్రపంచ స్థాయిలో విశ్వవిద్యాలయాలతో పాటు వివిధ సంస్థలకు వాటి పరిశోధనా ప్రమాణాల ఆధారంగా ఇచ్చే క్యూఎక్స్ ఇండెక్స్ ర్యాంకులు కానీ జాతీయస్థాయిలో భారత ప్రభుత్వం ఇచ్చే నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులు కానీ స్కోపస్ లేదా, యుజిసి కేర్, వెబ్ ఆఫ్ సైన్సెస్ లాంటి మొదలైన రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురితమైనప్పుడే దక్కుతాయి. వ్యక్తికైనా, వ్యవస్థకైనా, దేశానికైనా, యూనివర్సిటీ కైనా, ఇలాంటి ఉన్నతమైన ప్రమాణాలతో అందిస్తున్న ర్యాంకులే కీలకం. ఈ ర్యాంకుల ఆధారంగానే ప్రపంచ స్థాయిలోగానీ, జాతీయస్థాయిలోగానీ, వివిధ ప్రభుత్వాలు సంస్థలు పరిశోధనలు చేయడానికి ఉదారంగా నిధులను ఆయా వ్యక్తిగత పరిశోధకులకు లేదా సంస్థలకు లేదా యూనివర్సిటీలకు అందిస్తాయి. దీంతో భారత దేశ పరిశోధన ప్రస్థానం మరింత ముందుకు సాగుతూ మనదేశ యూనివర్సిటీలకు, వివిధ సంస్థలకు మంచిర్యాంకులు, మంచి పేరు రావడానికి అవకాశం ఉంటుంది.

పరిశోధనలతోనే ఏదైనా కనుగొనడం, పరిశోధన నుండి ప్రగతి, పరిశోధనలతోనే సామాజిక మార్పు, ప్రభుత్వాలు పాలసీలు చేయడానికి పరిశోధన ఫలాలే. అందువల్ల నిజమైన పరిశోధనలు చేస్తున్న వారిని ప్రోత్సహించడానికి ఆర్టికల్ పబ్లికేషన్ చార్జెస్ (ఏపిసి)సహకారం ఉండాలి. స్కోపస్, యుజిసి కేర్, వెబ్ ఆఫ్ సైన్సెస్, పీర్ రివ్యూ లాంటి మొదలైన రీసర్చ్ జర్నల్స్‌లో అధ్యాపకులు లేదా రీసెర్చ్ స్కాలర్స్ లేదా పరి శోధకులు తమ పరిశోధన పత్రాలను ప్రచురించుకోవాలనుకున్నప్పుడు ఆయా రీసెర్చ్ జర్నల్స్ ఆర్టికల్ పబ్లికేషన్ ఛార్జెస్ అడుగుతున్నారు. స్కోపస్ లాంటి జర్నల్స్‌లో తమ రీసెర్చ్ ఆర్టికల్స్‌ను పబ్లిక్ చేసుకోవాలంటే 300 డాలర్ల నుంచి నుంచి 10వేల డాలర్ల వరకు అంటే, మన లెక్కలో రూ. 25 వేల నుంచి 9 లక్షల వరకు ఏపీసి చార్జీలను వసూలు చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా స్కోపస్ జనరల్స్ ఒక్కో జర్నల్ ఒక్కోరకంగా చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇలాంటప్పుడు లక్షల్లో రూపాయలు వెచ్చించి ఆయా రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురించే ఆర్థిక స్థోమత ఎంతోమంది పరిశోధకులకు లేదు. గనుక పరిశోధనలను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు లేదా ఆయా సంస్థలు, యూనివర్సిటీలు పరిశోధకులకు ఏపీసీ చార్జీల సహకారం తప్పనిసరి. ఈ పబ్లికేషన్స్‌తో ఆయా వ్యక్తులకే కాకుండా సంస్థలకు, యూనివర్సిటీలకు మంచిర్యాంకులు వస్తాయి. తద్వారా కోట్లాది రూపాయలను వివిధ ఫండింగ్ ఏజెన్సీల నుంచి వివిధ సంస్థలు లేదా యూనివర్సిటీలు పొందే అవకాశం ఉంటుంది. మళ్లీ ఈ డబ్బుల్ని తిరిగి పరిశోధనలకు వెచ్చించడానికి అవకాశమూ లేకపోలేదు. ఇది దేశాన్ని, దేశప్రగతిని ఎంతో ఉన్నత స్థానంలో ఉంచుతుంది.

కేవలం ఐఎస్ఎస్ఎన్ నెంబర్ ఉన్న కొన్ని రీసెర్చ్ జర్నల్స్ స్కోపస్‌లో లేకున్నా యూజీసీ కేర్ లిస్టులో లేకున్నప్పటికీ ఆ లిస్టులో తమ జర్నల్స్ ఉన్నాయని ఆ జర్నల్స్ వెబ్‌సైట్‌లో పెట్టుకుని పరిశోధకులను మోసం చేస్తున్నాయి. కేవలం లాభార్జన ధ్యే యంగా పరి శోధనా పత్రాలను ఈ జర్నల్స్ ప్రచురిస్తున్నాయి. ఒకవైపు నకిలీ పత్రాలను ప్రచురించడం, మరోవైపు నిజమైన పరిశోధకులను కూడా మోస గించడం ఈ జర్నల్స్ నిర్వాహకులు చేస్తున్నారు. అందువల్ల ఇలాంటి జర్నల్స్‌పై యుజిసి నిరంతరం నిఘా పెట్టి వాటిపై సరైన చర్యలు తీసుకోవాల్సిన అసవరం ఉన్నది. స్కోపస్, యుజిసి కేర్, వెబ్ ఆఫ్ సైన్సెస్, పీర్ రివ్యూ లాంటి మొదలైన రీసెర్చ్ జర్నల్స్‌లో మాత్రమే పరిశోధకులు ప్రచురించుకోవాలని, వాటికే గుర్తింపు ఉంటుందని, వాటికే అధ్యాపక నియామకాల్లో, ప్రమోషన్లలో మార్కులు ఉంటాయని అధ్యాపకులకు, రీసెర్చ్ స్కాలర్స్‌కు విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఆయా యూనివర్సిటీల పైన ఎంతగానో ఉన్నది. అంతేకాదు, ఇది రీసెర్చ్ సూపర్‌వైజర్స్‌గా ఉండే అధ్యాపకుల బాధ్యత కూడా.





రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోసం అధిష్టానానికి ముగ్గురి పేర్లు
జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం
కేంద్ర మంత్రులు తెచ్చిన నిధులెన్ని? ప్రాజెక్టులెన్ని?
బీజేపీ కార్పొరేటర్లు భిక్షాటన చేయడం సిగ్గు చేటు
పథకాలను అందించడంలో క్షేత్రస్థాయి అధికారులు వైఫల్యం : ఇష్టాగోష్టిలో మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలుంటాయని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనే అంశంపై స్పందించిన ఆయన...క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల వైఫల్యం కారణంగానే కొంతమేరకు పథకాలు లబ్ధిదారులకు అందడం లేదని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్టానానికి పంపించామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి సారించామని చెప్పారు. అత్యధిక సీట్లు గెలిచి మేయర్ పీఠం మరోసారి కాంగ్రెస్ కైవసం చేసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి తెచ్చిన నిధులెన్ని, ప్రాజెక్టులెన్ని చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ కార్పొరేటర్లు భిక్షాటన చేయడం సిగ్గు చేటన్నారు.

ఆ పరిస్థితి ఎందుకొచ్చిందని ఆయన ప్రశ్నించారు. గాంధీజీ కలలు కన్న సమానత్వం కోసం పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలు కులగణనను అడ్డుకోవాలని చూసినా దాన్ని పూర్తి చేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రియల్ ఎస్టేట్ పడిపోయిందని గుర్తు చేశారు. దాన్ని తమ ప్రభుత్వం గాడిన పెడుతుందని చెప్పారు. కులగణన స్వతంత్ర భారతదేశంలోనే చరిత్రాత్మకమని తెలిపారు. బీజేపీ మాదిరిగా తాము హామీలు అమలు చేయకుండా వదిలేయబోమని స్పష్టం చేశారు. కొంత ఆలస్యమైనా ఒక్కొక్క హామీ అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి ఇప్పటికే ముగ్గురు అభ్యర్థుల పేర్లను అధిష్టానానికి పంపించామన్నారు. తుది నిర్ణయాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. అన్ని సౌకర్యాలున్న పాత సెక్రటేరియట్‌ను కేసీఆర్ ఎందుకు కూల్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమయాభావం దృష్టిలో పెట్టుకొని సీఎం నివాసంలో సీసీసీ సమీక్షలు చేస్తున్నారని, అందులో తప్పేముందని వివరించారు. రాహుల్ గాంధీ సభ ఫిబ్రవరి రెండోవారంలో సూర్యాపేట జిల్లాలో నిర్వహించబోతున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారిక నివాసంలో సీఎం ఫోటోతోపాటు రాహుల్, సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే ఫోటోలను ముద్రించాలని సూచించారు. పదేండ్లుగా కేసీఆర్ పరిపాలను గాడిన పెట్టలేకపోయారని స్పష్టం చేశారు. వైఎస్ఆర్‌కు ఉన్నంత అభిమానులు ఎవ్వరికి లేరని తెలిపారు.

పదేండ్లలో కేసీఆర్ చేసిన రుణమాఫీ సొమ్ము ఎంత? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన రుణమాఫీ ఎంత అనే తేడా చూడాలని కోరారు. ఫామ్‌హౌస్ పాలన కోరుకునేది దొరలు మాత్రమేనన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, కల్వకుంట్ల కవిత రాజకీయ ముఖచిత్రంలో తమ అస్థిత్వం కోసం విమర్శలు చేస్తున్నారని విమర్శించారు.

ఘన వారసత్వానికి నవ తేజస్సు..

నేడు ఉస్మానియా నూతన ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేయనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
పేద ప్రజలకు ప్రజా ప్రభుత్వం మరో కానుక
ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వైద్యారోగ్య చరిత్రలో మరో కొత్త శకం ప్రారంభం కానుంది. వందేళ్లుగా తెలంగాణతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్నాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా నూతన ఆస్పత్రికి నూతన భవనం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా, నూతన ఆస్పత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. నూతన ఆస్పత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో మొత్తం 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆస్పత్రిని నిర్మించనున్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ నూతన ఆస్పత్రిని కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పూర్తి వసతులతో...

రాబోయే వందేండ్ల అవసరాలకు తగినట్టు నూతన ఆస్పత్రిని నిర్మించాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా.. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఒకే చోట అన్నిరకాల డయాగ్నసిస్ సేవలు, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్ కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లకు రూపకల్పన చేశారు. అలాగే అండర్ గ్రౌండ్ రెండు ఫ్లోర్లలో పార్కింగ్, ఆస్పత్రి సమీపంలో ఫైర్ స్టేషన్, ఆస్పత్రి చుట్టూ విశాలమైన రహదారులు, ఆస్పత్రి ప్రాంగణంలో ఎక్కడికైనా ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు తిరిగే మార్గాలు, వికలాంగులు ఆస్పత్రిలోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంప్‌లు, ఆసుపత్రిలోని రోగులకు సహాయకులుగా వచ్చే వారు సేద తీరేందుకు డార్మెటరీలు, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు.

ఉద్యోగులు సామాజిక బాధ్యతతో పని చేయాలి

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి.కమలాసన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సామాజిక బాధ్యతతో ఉద్యోగం చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వివి.కమలాసన్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ ధూల్‌పేట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 53 మంది సిబ్బందికి గురువారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆపరేషన్‌లో ఎక్సైజ్, ఎస్టీఎఫ్ టీమ్‌లు కలిసి పని చేయడంతో ఆరు నెలల్లో గంజాయి అమ్మకాలు కనుమరుగయ్యాయని గుర్తు చేశారు. నిబద్ధతతో విధులు నిర్వహించినందుకే మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీగా చేయాలనే ప్రభుత్వ అదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు బాగా పని చేస్తున్నాయని కితాబునిచ్చారు. గంజాయి, డ్రగ్స్‌ను తుదిముట్టించే వరకు అందరూ కష్టపడి పని చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అబ్కారీ శాఖ జాయింట్ కమిషన్ ఖురేషీ, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ, అడిషన్ ఎస్పీ భాస్కర్, అధికారులు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎస్ కౌంటర్లలో మెరుగైన క్యూఆర్ కోడ్

చెల్లింపు వ్యవస్థల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా అన్ని యూ.టి.ఎస్. కౌంటర్లలో మెరుగైన క్యూఆర్ కోడ్ చెల్లింపు వ్యవస్థల ఏర్పాటు చేశారు. దీంతో కౌంటర్లలో క్యూఆర్ కోడ్ సదుపాయంతో టిక్కెట్ల కొనుగోలు ఇక నుంచి మరింత సులభతరం కానుంది. టిక్కెట్ల కొనుగోలులో క్యూ లైన్లలో ప్రయాణీకుల సమయాన్ని ఆదా చేయడం, ద్రవ్య లావాదేవీలలో ఖచ్చితత్వాన్ని కొనసాగించడం కోసం జోన్ వ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులను దక్షిణ మధ్య రైల్వే ప్రోత్సహిస్తున్నది. తాజా వెర్షన్‌తో క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ చెల్లింపు ఎంపికను సద్వినియోగం చేసుకునేలా 879 క్యూఆర్ పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. చెల్లించవలసిన చార్జీ జమచేయబడిన తరువాత టికెట్ జనరేట్ చేయబడుతుంది. రైలు వినియోగదారులందరూ రిజర్వ్ చేసిన టిక్కెట్లు/సాధారణ టిక్కెట్లను కొనుగోలు చేయడానికి ఈ క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ విజ్ఞప్తి చేశారు. ఈ విధానం పారదర్శకతకు, ఖచ్చితత్వానికి మైలు రాయిగా నిలుస్తోందనీ, నగదు చెల్లింపుల నుంచి ఉపశమనం కలిగిస్తుందని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్ ఆఫీసును సందర్శించిన స్లొవేకియా యువకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత్‌లోని ప్రముఖ నగరాల్లో పర్యటిస్తున్న స్లోవేకియా దేశ యువకులు మైఖేల్, వైబీరవో బంజారాహిల్స్ లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌ను గురువారం సందర్శించారు. పార్టీ కార్యాలయమంతా కలియతిరిగి కేసీఆర్ గురించి, తెలంగాణ తల్లి విగ్రహం గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. భవన్ గోడలపై ఉన్న ఫోటోలకు సంబంధించి వివరాలను కార్యాలయ సిబ్బంది వివరించారు .తెలంగాణ భవన్ సందర్శన తమకు పూర్తి సంతృప్తినిచ్చిందని వారు తెలిపారు.

అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి
- చేర్యాలలో జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా
- పాల్గొన్న అఖిలపక్ష పార్టీల నాయకులు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాలను రెవిన్యూ డివిజన్ చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, వెంటనే ఏర్పాటుచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో సహా పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు ప్రాంతాలను రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేశారని, చేర్యాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంతంలో ఉన్న పోలీసులు కూడా ఈ ప్రాంత ప్రజల మనోభావాలకు విలువనిస్తూ రెవెన్యూ డివిజన్‌కి సహకరించాలన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అన్ని వర్గాల ఏకైక కోరిక చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయడమే అని, ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డగా చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ఈ ప్రాంత పోరాట యోధుల స్ఫూర్తితో శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ఎనిమిదేండ్లుగా పోరాటం జరుగుతుందని అన్నారు. కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాలకు మధ్యలో ఉన్న మండలం చేర్యాల కావడంతో ఇది రెవెన్యూ డివిజన్ అయితే అన్ని మండలాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్‌కు ఈ ప్రాంత కాంగ్రెస్ వాళ్ళే అడ్డుకున్నారన్నారు. రెవెన్యూ డివిజన్ కోసం ప్రభుత్వ మేడలు వంచి వచ్చేదాకా పోరాడతామన్నారు. రెవెన్యూ డివిజన్ కోసం త్వరలోనే చేర్యాలను పూర్తిస్థాయిలో బంద్ చేస్తామని, వంట వార్పు చేస్తామని, అవసరమైతే ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని, చేర్యాలను అప్పటిలోపు రెవెన్యూ డివిజన్ చేయకపోతే స్థానిక సంస్థల్లో ఒక వార్డు మెంబర్ కూడా గెలవనిచ్చే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కెఎల్ఎన్ రెడ్డి, సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సామర్థ్యం పెంపులో మరో ముందడుగు

- హిమాచల్‌ప్రదేశ్ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై ఆసక్తి : ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్‌తో డిప్యూటీ సీఎం భట్టి భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్‌



తెలంగాణ విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచనలతో అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్ ప్రభుత్వం బూట్ (బిల్డ్ ఆన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలను ఆహ్వానించింది. ఆయా ప్రతిపాదనలపై అధ్యయనం చేసిన రాష్ట్ర విద్యుత్‌శాఖ అధికారుల బృందం 100 మెగావాట్లకు పైబడిన సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది. ఈ క్రమంలో గురువారం ఢిల్లీలో హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సఖుతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 400, 120 మెగావాట్ల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా అధికారికంగా ఒక లేఖను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్ట్ ముసాయిదాను పంపిస్తే ఒప్పందంపై తగిన పరిశీలన చేసిన త్వరితగతిన ఎంఓయూపై సంతకం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని భటి ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే హైడ్రోఎలక్ట్రిక్ విద్యుత్‌ను మన రాష్ట్రానికి సరఫరా చేస్తారు. ఫలితంగా ప్రస్తుత రాష్ట్ర అవసరాలు, భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్, సరఫరా సామర్థ్యం పెంచేందుకు మరింత ఉపయోగపడుతుందని సర్కార్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హిమాచల్ ప్రభుత్వం ప్రతిపాదించిన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులను దక్కించుకునేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ భేటిలో విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకెళ్లాలి

- ప్రభుత్వ అసమర్థతను కాంగ్రెస్ నేతలే అంగీకరిస్తున్నరు : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కామారెడ్డి డిక్లరేషన్ హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నామని కాంగ్రెస్ నేతలే ఒప్పుకోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మోసాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావని చెప్పారు. తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులను బెనిఫిట్స్ కోసం ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటూ బిల్లులను చెల్లించకుండా పెండింగులో పెట్టిందని విమర్శించారు. జీపీఎఫ్, గ్రాట్యూటీ, కమ్యూటేషన్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 317 జీవోను తీసుకొచ్చి టీచర్లను గోసపెట్టిందనీ, దానికి వ్యతిరేకంగా ఉద్యోగుల తరపున కొట్లాడింది బీజేపీనేనని గుర్తుచేశారు. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం, నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కోసం వారి గొంతుకగా పోరాడి హక్కులు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

మిర్చి రైతు పాపం సర్కారుదే..

- తెలంగాణలో రూ.13 వేలకు కొనే దిక్కులేకపోవడం దారుణం
- మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి మిర్చి కొనుగోళ్లు చేపట్టాలి
- లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతాం.. : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

క్వింటా మిర్చి ధర రూ.25 వేలకు కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-మహబూబాబాద్

రాష్ట్రంలో మిర్చి ధర దయనీయ స్థితికి పడిపోవడానికి రాష్ట్ర సర్కారు అవలంభిస్తున్న విధానమే కారణమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ విమర్శించారు. మహబూబాబాద్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌ను ఆయన గురువారం సందర్శించారు. భారీ ఎత్తున అమ్మకానికి తరలివచ్చిన మిర్చి బస్తాల నడుమ నడుచుకుంటూ మార్కెట్ అంతటా కలియ తిరిగారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వివిధ ప్రాంతాల నుంచి మిర్చిని అమ్మకానికి తెచ్చిన రైతులతో మాట్లాడి వారి గోడును స్వయంగా విన్నారు. ఈ సందర్భంగా మూడు శోభన్ మాట్లాడుతూ.. మిర్చి ధరలు తగ్గడానికి ఉత్పత్తి పెరగడమో, అంతర్జాతీయ మార్కెట్‌లో ధర తగ్గడమో కారణం కానేకావని స్పష్టంచేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కారు పాపమేనని విమర్శించారు. ఎకరాకు 35-40 క్వింటాలు సాధారణ దిగుబడి వచ్చేదని, ఇప్పుడు 15-25 క్వింటాలు మాత్రమే వస్తోందని అన్నారు. ఎకరాకు రూ.1.5 లక్షల పెట్టుబడిని మిరప పంటపై ధార పోశారని, ప్రస్తుతం మార్కెట్‌లో ధర చూస్తే కంటిపై కునుకు కూడా రావడం లేదని తెలిపారు. ప్రభుత్వంపై పోరాడి మద్దతు ధర సాధించుకోవాలన్నారు. గతేడాది క్వింటా మిర్చి ధర రూ.24 వేలు పలికిందని, ప్రస్తుతం రూ.13వేలకు కూడా కొనుగోలు చేసే దిక్కులేకపోవడం దారుణమన్నారు. జిల్లాలో మిర్చి ధర దారుణంగా పతనమైందని, వ్యాపారులు, దళారులతో అధికారులు కుమ్మక్కై, మిర్చి రైతును చిత్తు చేస్తున్నారని విమర్శించారు. కనీస మద్దతు ధర లేక పంటను కోల్డ్ స్టోరేజీలో దాచుకుందామన్నా అందులోనూ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లే తిష్ట వేస్తున్నారని ఆరోపించారు. అప్పులబాధతో మిర్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రైతుల కష్టాలు, కన్నీళ్ల గురించి ఏ ఒక్కరూ మాట్లాడకపోవడం శోచనీయమన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి దళారీ వ్యవస్థను నివారించడంతో పాటు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజీల్లోనూ తనిఖీలు నిర్వహించి రైతుల పంట మాత్రమే నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి ధర విషయంలో రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కనీస మద్దతు ధర కల్పించేందుకు తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి మిర్చిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, అధ్యక్షులు గునిగంటి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, పల్లా ప్రభాకర్ రెడ్డి, బయ్యా సోమన్న, నిరుటి జలంధర్, కట్ల కృష్ణయ్య, బానోత్ రమేష్, వెంకన్న, కులగుజ్జు రాంమూర్తి, అంగోత్ ఇస్లా, రామసాని రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో టెర్రస్ గార్డెన్‌లను ప్రమోట్ చేస్తున్నాం

- స్ట్రెస్ నుంచి ఉపశమనానికి గ్రీనరీ
- ఎంత స్థలం ఉంటే అన్ని మొక్కలు పెంచాలి
- హార్టీకల్చర్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది :17వ గ్రాండ్ నర్సరీ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల



నవతెలంగాణ-అంబర్‌పేట

పట్టణ ప్రాంతాల్లో ప్రజలు చెట్లు పెంచుకునేలా సబ్సిడీ అందిస్తూ ఈ ఏడాది నుంచీ టెర్రస్ గార్డెన్లను ప్రమోట్ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో 17వ గ్రాండ్ నర్సరీమేళా పేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టీకల్చర్ షోను గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పట్టణంలో పెద్దఎత్తున రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రజలు ఏమాత్రం ఖాళీ స్థలం ఉన్నా కూరగాయలతోపాటు పచ్చదనం కోసం మొక్కలు పెంచాలని సూచించారు. పట్టణ ప్రాంత ప్రజలు ఉదయం నుంచి ఉద్యోగాలు చేసి స్ట్రెస్‌కు గురవుతారని, సాయంత్రం ఇంటికి వెళ్లి టెర్రస్‌పై కూర్చుంటే ఆహ్లాదంగా గడిపేందుకు గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎంత స్థలం ఉంటే అన్ని మొక్కలు పెంచుకొని పచ్చదనాన్ని పెంపొందించడం ఉపయోగమని చెప్పారు. మానవ జీవితానికి, మనుగడకు పచ్చదనం కావాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మొక్కలు పెంచడం అనివార్యం అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలా అయితే వ్యవసాయ క్షేత్రాలు ఉంటాయో అలాగే పట్టణ ప్రాంత ప్రజలు వీలైనంత ఎక్కువగా గ్రీనరీ పెంచుకోవాలన్నారు. వ్యవసాయం చేసుకునే వారికి ఏ జబ్బులు రావన్నారు. పొల్యూషన్ నుంచి ఉపశమనం పొందడానికి రూఫ్ గార్డెన్, వర్టికల్ గార్డెన్స్ ఇలా ఇంటినిండా మొక్కలు పెంచుకోవాలనే ప్రజల ఆకాంక్షను చూస్తున్నామన్నారు. నర్సరీ ప్రేమికుల కోసం దేశ, విదేశాల నుంచి అరుదైన మొక్కలు, విత్తనాలు తీసుకొచ్చి ఒక వేదికగా ఇక్కడ అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. నర్సరీమేళా ఇన్‌చార్జి ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ.. ఈ మేళాలో దేశ విదేశాల నుంచి 150 స్టాళ్లలో అందమైన పూలమొక్కలు తక్కువ ధరతో పాటు లక్షల రూపాయల ఖరీదైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కిచెన్ గార్డెన్, ఆర్నమెంటల్ ప్లాంట్స్, మెడిసినల్ ప్లాంట్స్, చెట్లను పెంచడానికి కావాల్సిన మెటీరియల్‌ను ప్రమోట్ చేసే విధంగా ఎగ్జిబిట్ చేసినట్టు చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎగ్జిబిట్స్ వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ లాంగ్వేజ్ సబ్జెక్టులకూ అభ్యాస దీపికలు ఇవ్వాలి

- సమగ్ర శిక్ష ఏఎస్‌పీడీ రాధారెడ్డికి టీఎస్‌జీహెచ్‌ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన లాంగ్వేజ్ సబ్జెక్టులకూ అభ్యాస దీపికలను అందించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో సమగ్ర శిక్ష ఏఎస్‌పీడీ ఎం రాధారెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ గిరిధర్‌గౌడ్, కోశాధికారి బి తుకారాం కలిసి వినతిపత్రం సమర్పించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి భాషేతర (నాన్ లాంగ్వేజ్) సబ్జెక్టులకు అభ్యాసదీపికలను అందిస్తున్నారని తెలిపారు. వాటి వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం కలుగుతున్నదని వివరించారు. అదే విధంగా లాంగ్వేజ్ సబ్జెక్టులకు కూడా అభ్యాస దీపికలను అందించాలని కోరారు. దానివల్ల విద్యార్థులకు ఉపయోగం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ప్రయోజనం కలుగుతున్న దృష్ట్యా విద్యాశాఖ వాటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పథకాల పరేషాన్..!

(మొదటిపేజీ తరువాయి)

కోసం మెదక్ జిల్లాలో 1,91,100, సిద్దిపేట జిల్లాలో 2,30,483, సంగారెడ్డి జిల్లాలో 3,18,775 దరఖాస్తులొచ్చాయి. ప్రభుత్వం చెబుతున్నట్టు నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున ఉమ్మడి మెదక్ జిల్లాలోని 11 నియోజకవర్గాలు, పక్క జిల్లాల్లోని నియోజకవర్గాల పరిధిలోని ఐదారు మండలాలు సిద్దిపేట జిల్లాలో ఉన్నందున వాటికి కలిపి 40 వేల ఇండ్లు మాత్రమే మంజూరు కానున్నాయి. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన గ్రామ సభల్లో లబ్దిదారుల జాబితాల్ని ప్రకటిస్తామని చెప్పారు. అక్కడికి ఎంతో ఆశతో వెళ్లిన ప్రజలకు నిరాశ తప్పలేదు. కొత్తగా దరఖాస్తులు చేసుకోవాలని, నాలుగు పథకాల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని, లబ్దిదారుల జాబితాలో పేర్లు ఉన్నంత మాత్రాన మంజూరయినట్టు కాదని మంత్రులు, కలెక్టర్లు ప్రకటనలు చేయడంతో పేదల్లో తీవ్ర నిరాశ ఎదురైంది. అనేక గ్రామాల్లో అధికారుల్ని ప్రజలు నిలదీశారు.

అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల కోసం జనం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు దరఖాస్తులు చేసినా మంజూరు జాబితాల్లో తమ పేర్లు రానందున తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు మీ-సేవ, ఎంపీడీఓ కార్యాలయాల్లో జనం ఎగబడి దరఖాస్తు చేస్తున్నారు. గ్రామ సభల్లో కొందరి పేర్లు లబ్దిదారుల జాబితాలో వచ్చాయి. అయినా వాళ్లకు మంజూరైనట్టు కాదనే ప్రచారంతో వాళ్లు సైతం ప్రజా ప్రతినిధుల ఇండ్ల చుట్టూ తిరుగుతున్నారు. నాలుగు పథకాలకు లబ్దిదారుల్ని ప్రజా ప్రతినిధులే ఫైనల్ చేస్తారన్న ప్రచారంతో మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, గ్రామాల్లో అధికార పార్టీ నాయకులకు దరఖాస్తులిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల వద్దకెళ్లి కూడా దరఖాస్తు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నందున దాన్ని ఆసరా చేసుకుని కొందరు లంచాలు గుంజుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు పెట్టిస్తామని రూ.20 నుంచి రూ.50 వేల వరకు డిమాండ్ చేస్తున్నారని పలువురు లబ్దిదారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ ఇన్‌చార్జీలే లబ్దిదారుల్ని ఫైనల్ చేస్తారనే ప్రచారంతో పైరవీలు జోరందుకున్నాయి. గ్రామాలు, వార్డుల్లో వేసిన ఇందిరమ్మ కమిటీల నాయకులు సైతం ప్రతిదానికీ బేరసారాలు నడుపుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

పథకాలకు ఎన్నిక కోడ్ బ్రేక్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంగనర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దాంతో ఆయా ఉమ్మడి జిల్లాల్లో నాలుగు కొత్త పథకాల మంజూరు ప్రక్రియ ఆగిపోనుంది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ రానుంది. ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13న ఉపసంహరణ, పోలింగ్ 27, ఓట్ల లెక్కింపు మార్చి 3న జరగనుంది. 45 రోజులపైనే ఎన్నికల కోడ్ అమల్లో ఉండనున్నందున ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోసి పనులు ప్రారంభించడం, కొత్త రేషన్‌కార్డుల మంజూరు వంటి వాటికి బ్రేక్ తప్పదంటున్నారు.

పాఠశాల విద్యలో ఏఐ ఆధారిత డిజిటల్ విధానం

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

- నందన్ నీలేకని 'ఎక్ స్టెప్-ఫౌండేషన్' సేవలు
- విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా నేతృత్వంలో బెంగుళూరులో పర్యటన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డిజిటల్ విద్యను విద్యార్థులకు అందించాలని నిర్ణయించింది. ఏఐ వినియోగించడం ద్వారా పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో పాఠశాల విద్యను మరింత నాణ్యతా ప్రమాణాలతో అందించడానికి ఏఐ, డిజిటల్ ఇనీషియేటివ్‌లను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని భావిస్తున్నది. విద్యార్థుల్లో మరింత మెరుగైన అభ్యాస పద్ధతులను, సాంకేతిక ప్రమాణాలను పెంపొందించడం లాంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశ పెట్టాలని సమాలోచన చేస్తున్నది. దీనిలో భాగంగా బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న 'ఎక్ స్టెప్ -ఫౌండేషన్'ను తెలంగాణ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా నేతృత్వంలో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ ప్రతినిధి బృందంలో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ తదితరులున్నారు. విద్యారంగంలో డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచడంలో ఎక్ స్టెప్- ఫౌండేషన్ అగ్రగామిగా ఉన్నది. ఆ ఫౌండేషన్ - విజనరీ టెక్నోక్రాట్, ఫిలాంత్రపిస్ట్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ అయిన నందన్ నీలేకని ఈ ఎక్ స్టెప్-ఫౌండేషన్‌కు కో-ఫౌండర్‌గా కూడా ఉన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టి మరింత మెరుగైన సేవలను అందించడానికి ఈ ఎక్ స్టెప్- ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఇది ఇప్పటికే గుజరాత్, కర్నాటక, ఒడిశా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలలో ఆయా ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నది.

ఎక్ స్టెప్ ఫౌండేషన్ ప్రతినిధులతో విద్యాశాఖ బృందం భేటీ

గురువారం బెంగుళూర్‌లో ఎక్ స్టెప్-ఫౌండేషన్ ప్రతినిధులతో తెలంగాణా విద్యాశాఖ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. విద్యారంగంలో చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించింది. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), ప్రాథమిక విద్యా స్థాయిలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఆధారిత డిజిటల్ పద్ధతుల ద్వారా ప్రాథమిక స్థాయిలో రాయడం, చదవడం, సంఖ్యా పరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంపై మాట్లాడారు. ఏఐ ఆధారిత టూల్స్, ప్లాట్‌ఫామ్‌లను ప్రవేశ పెట్టడం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిగత స్థాయిలో విద్యా ప్రమాణాలు, అభ్యాస పద్ధతులను మరింతగా మెరుగుపర్చడంపై దృష్టిసారించాలని చర్చించారు. విద్యార్థుల్లో ఉన్న అభ్యసన లోపాలను గుర్తించి, వాటిని సవరించడానికి తగు ఇనిషియేటివ్‌లని ప్రవేశ పెట్టాలని మాట్లాడారు. ఉపాధ్యాయుల్లో వృత్తిపరమైన ప్రమాణాలను పెంపొందించడం, పాఠశాల గదుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించడానికి వారికి డిజిటల్ పద్ధతులపై పూర్తి స్థాయిలో శిక్షణ అందించాల్సిన అవసరముందని అభిప్రాయానికి వచ్చింది.


ఎక్ స్టెప్ -ఫౌండేషన్‌ను సందర్శించిన విద్యాశాఖ ప్రతినిధి బృందం గతేడాది కేరళను సందర్శించింది. అక్కడి విద్యారంగంలో చేపట్టిన ఆధునిక పద్ధతులను పరిశీలించింది. కేరళ ప్రభుత్వం కూడా విద్యాశాఖలో ఏఐ టూల్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకుని మెరుగైన విద్యా ప్రమాణాలను సాధించిందని ఈ బృందం పరిశీలనలో గుర్తించింది. ఈ ఉత్తమ పద్ధతులను కూడా తెలంగాణా విద్యాశాఖలో ప్రవేశపెట్టాలని అధికారులు నిర్ణయించారు. ఎక్ స్టెప్ -ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏఐ ఆధారిత విద్యను ప్రవేశ పెట్టడానికి తెలంగాణ సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నారు. డిజిటల్ ఇనీషియేటివ్స్, ప్రాథమిక స్థాయిలో అభ్యసన నైపుణ్యాల పెంపు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్నేహపూర్వక అభ్యసన పద్ధతుల్లో సహాయం అందించడం వంటి రంగాల్లో ఈ ప్రణాళికను అమలు చేయాలని భావిస్తున్నారు.

ప్రజా సమస్యలు చర్చించాలి

నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుంభమేళా తొక్కిసలాట పై ప్రతిపక్షాలు పట్టు

అన్ని పార్టీలూ సహకరించాలి : కిరణ్ రిజిజు

- సభలు సజావుగా జరిగేందుకు సిద్ధం : ప్రతిపక్షాలు
- ఆమోదం కోసం 16 బిల్లులు జాబితా
- నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- సభలను ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- రేపు కేంద్ర బడ్జెట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా సమస్యలపై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టు బట్టాయి. దేశంలో నిరుద్యోగం, ధరలు పెరుగుదలతోపాటు కుంభమేళా తొక్కిసలాటపై చర్చకు డిమాండ్ చేశాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు గురువారం పార్లమెంట్ అనెక్స్ భవనంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జె.పి నడ్డా, అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్, కాంగ్రెస్ నేతలు జైరామ్ రమేశ్, కె సురేష్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, టీఎంసీ ఎంపీలు సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఓబ్రెయిన్, డీఎంకే ఎంపీ టిఆర్ బాలు, ఎస్పీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీలు కె.రాధాకృష్ణన్, జాన్ బ్రిట్టాస్, జేఎంఎం ఎంపీ మహువా మాంఝీ, ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ ఫౌజియా ఖాన్, ఆర్ఎస్పీ ఎంపీ ఎన్.కె ప్రేమ్‌చంద్రన్, టీడీపీ ఎంపీలు బీదా మస్తాన్‌రావు, దగ్గుమల్ల ప్రసాదరావు, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, జనసేన ఎంపీ బాలశౌరి సహా వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ప్రభుత్వం సహకరిస్తే పార్లమెంటు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఇందుకు ప్రభుత్వం చొరవ చూపాలనీ, ఆర్థిక మందగమనం, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి అనేక సమస్యలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

వక్ఫ్ బిల్లును పరిగణనలోకి తీసుకున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) నిబంధనలు పాటించకుండా నివేదికను రూపొందించడాన్ని కూడా ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. జేపీసీ చైర్మెన్ ఏకపక్షంగా వ్యవహరించారని ఎత్తి చూపాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు కేటాయించిన రోజుల సంఖ్యపై పార్లమెంటరీ బులెటిన్‌ను ప్రచురించడంపై ప్రతిపక్ష నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) ప్రత్యేక హక్కు అని అన్నారు. ప్రభుత్వం పార్లమెంటరీ కమిటీలను రాజకీయం చేసిందనీ, తన మెజారిటీని ఉపయోగించి తన ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తోందని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి.

ప్రభుత్వం పార్లమెంటరీ ప్యానెల్స్‌లో తన ఎజెండాను అమలు చేస్తోందనీ, బీఏసీ సమావేశాల్లో హౌస్ బిజినెస్‌ను ఖరారు చేసే పార్లమెంటరీ విధానాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం కుంభమేళాను రాజకీయం చేసిందనీ, సామాన్యుడి ప్రాణాలను బలిగొంటు న్నదని విమర్శించాయి. ఈ కార్య క్రమంలో వీఐపీ సంస్కృతితో సామాన్యులకు ఇబ్బందులను సృష్టిస్తోందని అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా నిర్వహణలో జరిగిన తొక్కిసలాటపై చర్చించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేయనున్నాయి.

సమావేశాలు సజావుగా జరిగేలా అన్ని పార్టీలూ సహకరించాలి : కిరణ్ రిజిజు

సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. ఈ బడ్జెట్ సెషన్‌లో సభలు సజావుగా జరిగేలా అన్ని పార్టీలు సహకరించాలని మేము కోరామన్నారు. "ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలను మేము గమనించాం. బీఏసీ.. ఏ అంశాలను చర్చకు తీసుకోవాలో నిర్ణయిస్తుంది. సజావుగా, ఉత్పాదకంగా బడ్జెట్ సమావేశాలు జరగాలని మేము ఆశిస్తున్నాం. అర్థవంతమైన, నిర్మాణాత్మక పార్లమెంటరీ సమావేశాలకు అన్ని పార్టీల సహకారం అవసరం" అని అన్నారు. నేడు, రాజ్యసభ చైర్మెన్, లోక్‌సభ స్పీకర్‌తో పాటు బీఏసీ, రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై చర్చల వ్యవధిని నిర్ణయిస్తుందని రిజిజు తెలిపారు.

రాష్ట్రపతి ప్రసంగం.. అనంతరం ఆర్థిక సర్వే

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నేడు ప్రారంభమవుతాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేడు పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఆర్థిక సర్వేను ప్రవేశపెడతారు. ఫిబ్రవరి 1 (రేపు)న బడ్జెట్‌ను ప్రవేశపెట్ట నున్నారు. ఫిబ్రవరి 14 నుంచి పార్లమెంట్ సమావేశాలకు విరామం ఉంటుంది. మళ్లీ మార్చి 10న ఉభయ సభలు తిరిగి ప్రారంభమై, ఏప్రిల్ 4న ముగుస్తాయి.

కేంద్రం తీరుపై ప్రతిపక్ష నేతల ఆందోళన

కాంగ్రెస్ లోక్‌సభ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. పార్లమెంటు కార్యకలాపాల నిర్వహణలో పక్షపాత వైఖరిపై ఆందోళనలను వ్యక్తం చేశామన్నారు. ఒడిశాకు ప్రత్యేక హెూదా మంజూరు చేస్తామన్న హామీపై బీజేపీ వెనక్కి తగ్గిందని బీజేడీ ఎంపీ సస్మిత్ పాత్రా ఆరోపించారు. దేశంలో చట్టాన్ని రూపొందించే ప్రక్రియ బలహీనపడుతుందనే అంశాన్ని తాను లేవనెత్తానని ఐయూఎంఎల్ నేత ఈటి మహమ్మద్ బషీర్ అన్నారు. "వక్ఫ్‌పై జేపీసీని చర్చించడానికే ఏర్పాటు చేశారు. కానీ సభ్యులకు మాట్లాడటానికి తగినంత అవకాశం ఇవ్వలేదు" అని బషీర్ గుర్తు చేశారు. కచ్చతీవు ద్వీపంపై తిరిగి నియంత్రణ సాధించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలని అన్నాడీఎంకె ఎంపీ ఎం. తంబి దురై కోరారు.

16 బిల్లులను జాబితా చేసిన ప్రభుత్వం

జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం కోసం 16 బిల్లులను ప్రభుత్వం జాబితా చేసింది. ఇందులో వక్ఫ్ (సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) బిల్లు, రైల్వేలు (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు, చమురు క్షేత్రాలు (నియంత్రణ, అభివృద్ధి) సవరణ బిల్లు, విమాన వస్తువులపై ప్రయోజనాల రక్షణ బిల్లులు ఉన్నాయి.

రాష్ట్రాల అధికారాలు లాక్కుంటోంది

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సవరణ బిల్లు, ఇతర బిల్లులను ప్రవేశపెట్టడంతో కేంద్రం.. రాష్ట్రాల అధికారాలను ఒక్కొక్కటిగా లాక్కుంటోంది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్ ప్రాముఖ్యతను తగ్గిస్తోంది. బడ్జెట్ సమావేశాలు, ఇతర కార్యక్రమాలు గతంలో 40 రోజుల వరకు జరిగేవి. ఇప్పుడు దానిని 27 రోజులకు తగ్గించారు. అత్యవసర తీర్మానాలు, చిన్న చర్చలు మొదలైనవి పూర్తిగా అనుమతించటం లేదు.బీజేపీ ఎంపీలను స్టాండింగ్ కమిటీలు, ఇతర కమిటీలలో చేర్చడం పెరుగుతోంది. 29 మంది బీజేపీ ఎంపీలకు పార్లమెంటరీ కమిటీల్లో ద్వంద్వ సభ్యత్వం ఉన్నది.

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్



కేటీపీపీలో 'కేటుగాళ్లు' !?

- నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు
- జెన్కో విజిలెన్స్ అధికారుల విచారణ ?

నవతెలంగాణ-గణపురం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో నకిలీ సర్టిఫికెట్లతో కొందరు ఉద్యోగాలు చేస్తూ ప్రభుత్వాన్ని, జెన్కోను మోసం చేస్తున్న సంఘటన చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొందరు ఫిర్యాదు చేయడంతో హైదరాబాద్ జెన్కో విజిలెన్స్ అధికారులు బుధవారం, గురువారం విచారణ చేపట్టినట్టు సమాచారం. గణపురం మండలం చెల్పూర్ శివారు దుబ్బపల్లిలో మొదటి విడత 500, రెండో విడత 600 మెగావాట్ల ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్లాంట్ ప్రారంభంలో కేటీపీపీ అధికారులు దుబ్బపల్లి, చెల్పూల్, కొంపెల్లి, మహబూబ్‌పల్లి తదితర గ్రామాల రైతుల నుంచి 1100 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ మొత్తం భూమిని 400మంది రైతులు కేటీపీపీ ఏర్పాటుకు ఇచ్చారు. కేటీపీపీలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తున్నామని తెరపైకి రావడంతో 400నుంచి ఒక్కసారిగా 1000 మందికి చేరుకుంది. దాంతో జెన్కో అధికారులు అప్పుడున్న అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ఉద్యోగ అవకాశాలు ఇచ్చారు. దాంతో కొందరు కేటుగాళ్లు మొదటి విడత 500, రెండో విడత 600 మెగావాట్ల ప్లాంట్‌లో కొందరు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా లాభం లేకుండా పోయింది. కేటీపీపీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు ఆరుగురు ఉద్యోగులు పదోన్నతి కోసం ఫేక్ సర్టిఫికెట్లను సంస్థకు అప్పగించినట్టు తెలిసింది. ఈ విషయమై ఫిర్యాదులు అందడంతో దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణకు ఆదేశించినట్టు సమాచారం.

ఈ మేరకు విజిలెన్స్ బృందం బుధవారం, గురువారం రెండు రోజులపాటు భూపాలపల్లి ఎంఈఓ కార్యాలయంలో గంట పాటు విచారణ చేపట్టి పలు రికార్డులు పరిశీలించినట్టు తెలిసింది. ఈ విషయాన్ని జెన్కో ఉన్నతాధికారులు మాత్రం అధికారికంగా ధ్రువీకరించలేదు. విచారణ పూర్తయి నివేదిక అందిన తర్వాత పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉందని తెలిసింది. స్టేజ్ 1, స్టేజ్ 2 విద్యుత్ కేంద్రాల్లో చాలామంది నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరందరిని విజిలెన్స్ అధికారులు విచారణ చేపడితే నకిలీ కేటుగాళ్లు బయటపడే అవకాశం ఉంది. అంతేకాక నకిలీ కేటుగాళ్లకు గతంలో పనిచేసిన అధికారుల అండదండలతో ఈ ఉద్యోగాల్లో చేరి విధులు నిర్వహిస్తున్నారు. వీరి వద్ద అప్పుడున్న అధికారులు లంచాలు తీసుకొని ఉద్యోగాల్లోకి తీసుకున్నట్టు సమాచారం. గతంలో పనిచేసిన పెద్ద స్థాయి అధికారులు, వారి బంధువులు, స్నేహితుల పిల్లలు, వారి స్వగ్రామానికి చెందిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. బయటి వారికి ఉద్యోగాలు ఇవ్వడంతో స్థానికంగా ఉన్న వారికి ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది.

కులదురహంకార హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

పౌర సమాజం ఖండించాలి

- జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించాలి
- భార్గవికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- దుండగుల ఆస్తులు జప్తు చేసి భార్గవికి అప్పగించాలి : కేవీపీఎస్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి. స్కైలాబ్‌బాబు, మల్లు లక్ష్మి



నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రేమ వివాహం చేసుకున్న వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటిని ఈ నెల 26న అత్యంత కిరాతకంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.స్కైలాబ్‌బాబు, మల్లు లక్ష్మి అన్నారు. పౌర సమాజం మానవీయ కోణంలో ఈ హత్యను ఖండించాలని కోరారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో వడ్లకొండ కృష్ణ కుటుంబాన్ని సీపీఐ(ఎం) నాయకులతో కలిసి వారు పరామర్శించారు. హత్య గురించి కృష్ణ భార్య భార్గవి, తండ్రి డేవిడ్, సోదరి శ్వేతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేండ్లుగా ప్రేమించుకుంటున్న కృష్ణ, కోట్ల భార్గవి గతేడాది ఆగస్టు 7న నకిరేకల్ దేవస్థానంలో వివాహం చేసుకున్నారని అన్నారు. దీనిని జీర్ణించుకోలేని భార్గవి నాయనమ్మ బిక్షమమ్మ, సోదరులు నవీన్, వంశీ కత్తిగట్టి కృష్ణను హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వరుసగా కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ హత్యలను ఖండించకుండా ఉపేక్షిస్తుందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తక్షణమే స్పందించి కృష్ణ కుటుంబాన్ని పరామర్శించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం ప్రకారంగా నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు వంశీ, నవీన్ ఆస్తులను ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధిత కుటుంబానికి అప్పగించాలని కోరారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాలన్నారు. కులాంతర వివాహి తులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చూడాలన్నారు. కృష్ణ కుటుంబానికి రేకుల ఇల్లు తప్ప వేరే నివాసం లేదన్నారు. తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇల్లుగానీ, ఇందిరమ్మ ఇల్లుగానీ వారికి అందజే యాలని కోరారు. భార్గవికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకో వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాన్ని కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దెల దశరథ్, సామాజిక కార్యకర్త తెలంగాణ శ్యామ్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మత్రి నాగేశ్వరరావు, కోట గోపి, నాయకులు టేకుల సుధాకర్, పిండుగ నాగమణి దుర్గారావు, దేవరకొండ యాదగిరి, మద్దెల జ్యోతి, ఎం.సైదమ్మ త్రివేణి, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, పల్లా సుదర్శన్, పులుసు సత్యం పరామర్శించారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి



నవతెలంగాణ-మహబూబాబాద్

రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయ, అధ్యాపకులకు జీరో వన్, జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి డిమాండ్ చేశారు. గురువారం మహబూబాబాద్ జిల్లా మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలను ఒకే మేనేజ్‌మెంట్ కిందకు తీసుకురావాలని అన్నారు. అసంబద్ధమైన పనివేళలను మార్చాలని, ఆరోగ్య కార్డులు ఇచ్చి కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని తెలిపారు. ప్రిన్సిపల్, అధ్యాపకులకు గెజిటెడ్ హెూదా కల్పించాలని అన్నారు. మోడల్ స్కూల్స్‌లో రెండవ ఫేజ్‌లో నియామకమైన ఉపాధ్యాయులకు సర్వీసును నోషనల్‌గా పరిగణిస్తూ వేతన స్థిరీకరణ చేయాలన్నారు. పదోన్నతులు చేపట్టాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. కేర్ టేకర్లను నియమించి ఉపాధ్యాయులపై పని భారం తగ్గించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ చెల్లించాలని, వివిధ సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కుబేర్‌లో పెండింగ్ జీపీఎఫ్ రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు క్లియర్ చేయాలని అన్నారు. పెండింగ్ ఐదు డీఏలు ప్రకటించాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకొని 30శాతం ఫిట్మెంట్ తగ్గకుండా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేయొద్దని, ప్రీ ప్రైమరీ తరగతులను అంగన్‌వాడీలో కలపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎ.మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు

- సీఎంకు ముత్తినేని కృతజ్ఞతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉన్నత విద్యలో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. స్వయంగా సీఎం చేతుల మీదుగా వికలాంగురాలికి ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులు ఇవ్వటం అభినందనీయమన్నారు. దీంతో సీఎం వికలాంగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. అందుకే వికలాంగుల ఆత్మబంధువయ్యారని పేర్కొన్నారు. దావోస్ నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను ఆకర్షించారనీ, తద్వారా 49,500 ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రికార్డు స్థాయిలో గతేడాదితో పోలిస్తే నాలుగు రెట్లకు మించి పెట్టుబడులు తీసుకుని రావటం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

జోగులాంబ బ్రహ్మోత్సవాలకు రండి

- మంత్రి కొండా సురేఖకు ఆహ్వానపత్రం అందించిన ఆలయ కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జోగులాంబ బాల బ్రహ్మేశ్వరిస్వామి దేవస్థానంలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలు, ఫిబ్రవరి 25 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు రావాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి ఆలయ కమిటీ ఆహ్వానం అందించింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆలయ ఈవో పురేంద్ర కుమార్, అర్చకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. మంత్రికి తీర్థప్రసాదాలను, ఆహ్వానపత్రికను అందించారు. వరుస ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని ఈవోను మంత్రి సురేఖ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి, ఆలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి మంత్రి దామోదర నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం నివాళులు అర్పించారు. మహాత్ముడు చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను అందరూ ఆదర్శంగా తీ సుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు."ఆరోగ్యమే మహాభాగ్యం" అని గాంధీ చెప్పిన మాటలను మంత్రి గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యమైన జీవనశైలి అలవర్చుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి గుర్తు చేశారు. దేశ చరిత్రలో అత్యంత ప్రముఖమైన ఆస్పత్రుల్లో ఒకటిగా ఉన్న ఉస్మానియా హాస్పిటల్ కోసం కొత్త భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.ఈ నెల 31న (నేడు) కొత్త ఉస్మానియా భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోబోతున్నామని తెలిపారు.

మంత్రి దామోదరకు సత్కారం

ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపట్ల తెలంగాణ వైద్యుల సంఘం ఉస్మానియా విభాగము హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం నాయకులు సీఎం రేవంత్ రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ప్రత్యేకంగా అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. నూతన భవనం కోసం గత కొన్ని సంవత్సరాలుగా అవిశ్రాంతంగా కృషి చేసిన ప్రభుత్వ వైద్యులకు, వైద్యుల సంఘానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి పరిపాలన

- మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు పట్టించుకోం : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇది ప్రజాపాలన కాదనీ, పరిపాలన అంతా పోలీస్ కమాండ్ కంట్రోల్ నుంచి కొనసాగుతున్నదని బీఆర్ఎస్ రైతు అధ్యయన వేదిక చైర్మెన్, మాజీ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి విమర్శించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యలకు తాము స్పందిస్తామనీ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాటలను పట్టించుకోబోమని చెప్పారు.

గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనకు దూరమై 420 రోజులు అవుతున్నదన్నారు. క్షేత్రస్థాయిలో తాము పర్యటించగా.. వివిధ రకాల పంటలు పండించిన రైతులు, మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతు న్నారని తేలిందన్నారు. రైతు భరోసా రాక, రుణమాఫీ జరగక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. బాధిత కుటుంబాలను పరామర్శించి కొంత ఆర్థిక సహాయం అందించామన్నారు. తాము రైతులను పరామర్శిస్తుంటే కాంగ్రెస్ వాళ్లకు అక్కసు ఎందుకని ప్రశ్నిం చారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తా అని రేవంత్ రెడ్డి అంటుంటే రాష్ట్ర ప్రజలు ప్రతిరోజూ కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నారని చెప్పారు. రాజ్యాంగ విలువలు పట్టించుకోకుండా రాజ్యాంగాన్ని పట్టుకొని తిరుగుతున్న వ్యక్తి రాహుల్ గాంధీ అని విమర్శించారు. స్పీకర్ రాజకీయాల గురించి ఓపెన్‌గా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గాంధీ ఆశయాలకు వారసులమని చెప్పు కునే కాంగ్రెస్ నేతలు ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు.

టీవీవీపీ ఆస్పత్రుల కాంట్రాక్ట్ సిబ్బందికి జీతాలు చెల్లించకపోతే సమ్మె

- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఆస్పత్రుల కాంట్రాక్ట్ సిబ్బందికి జీతాలు చెల్లించకపోతే ఫిబ్రవరి మొదటివారం నుంచి సమ్మెలోకి వెళతామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 6 నెలలుగా జీతాలు లేక టీవీవీపీ ఆస్పత్రుల్లో పని చేయుచున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు విలవిలలాడుతున్న ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. జనవరి 23వ తేదీన కార్మికుల జీతాలు చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులకు వినతిపత్రం అందజేసి నిరసన కార్యక్రమాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని వారు విమర్శించారు. జనవరితో ఏడో నెల కూడా పూర్తవున్నా...జీతాలు రాలేదని తెలిపారు.



సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన జాన్‌వెస్లీకి ఎం.బీ.భవన్‌లో అభినందనలు తెలిపిన మెడికల్ రిప్రజెంటేటివ్ నాయకులు, కార్యకర్తలు



రాష్ట్రంలో భయంకరమైన రోజులు

- కాంగ్రెస్ దుష్పరిపాలనతో రాష్ట్రం వందేండ్లు వెనక్కు
- అబద్ధాలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారు : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత
- పథకాలు ఎవరికి అందుతున్నాయో తెలియడం లేదని ఎద్దేవా

నవతెలంగాణ-ధర్పల్లి

కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో భయంకరమైన రోజులు వచ్చాయని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలన వల్ల తెలంగాణ వందేండ్లు వెనక్కివెళ్లిన పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అబద్ధాలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువ కాలం పరిపాలించలేరని స్పష్టం చేశారు. అలవిగాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. గురవారం నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆమె.. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసీ తెలియక హామీలిచ్చామని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ అన్నారని గుర్తు చేశారు. 130 ఏండ్ల చరిత్ర ఉన్నదని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎలా మోసం చేస్తుందని ప్రశ్నించారు. చేతిలో ఎర్రబుక్కు పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసాల చరిత్ర, దగా చరిత్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా, రేషన్ కార్డులు ఎవరికి ఇస్తున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని, సచివాలయంలో ఏసీ గదుల్లో కూర్చొని తయారు చేసిన లబ్దిదారుల జాబితాను గ్రామాల్లోకి తీసుకొచ్చి చదువుతున్నారని వివరించారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీస్తే అది తుది జాబితా కాదని మాటమారుస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చే ఆలోచనతో ఉందని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ అర్హులైన అందరికీ పారదర్శకంగా పథకాలను అందించారని, కేసీఆర్ హయాంలో నేరుగా లబ్దిదారులకే కోట్లాది రూపాయలు వెళ్లాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులను తామే చేశామని చెప్పడమే తప్పా ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని విమర్శించారు. యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చిందని, కరెంటు ఎప్పుడొస్తుందా ఎప్పుడు పోతుందా అన్నది తెలియని దుస్థితి ఏర్పడిందని, చెరువులను ప్రభుత్వం పట్టించు కోవడం లేదని తెలిపారు. నిజామాబాద్ జిల్లా కు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 21 పనులు పూర్తి చేయని చేతగాని ప్రభుత్వం అని అన్నారు. పెన్షన్ మొత్తాన్ని పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, కేసీఆర్ హయాం లో ఇచ్చినంతనే ఇంకా ఇస్తున్నారని అన్నారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలను స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎల్లారెడ్డి పాఠశాలలో విషాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. కేసీఆర్ పెట్టిన గురుకులాలను కూడా నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని, ప్రభుత్వం తక్షణమే మొద్దు నిద్రవీడి ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పసుపు పంట మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో కనీస మద్దతు ధర ప్రకటించడానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిజామాబాద్ మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

అమెజాన్‌లో మరోమారు ఉద్వాసనలు..!

వాషింగ్టన్ : ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో మరోమారు ఉద్వాసనలు నెలకొనే అవకాశాలున్నాయి. ఈ దఫా కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ఉద్యోగులను ఇంటికి పంపించనుందని రిపోర్టులు వస్తోన్నాయి. ఇందుకోసం కార్యాచరణను ప్రారంభించినట్లు సమాచారం. సంస్థను సమర్థవంతంగా మార్చడంతో పాటు ఖర్చులను తగ్గించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. అమెజాన్ కార్యకలాపాల సమర్థతను పెంచేందుకు ఉద్యోగుల తొలగింపు సహాయపడుతుందని కంపెనీ భావించింది. వేటుకు గురైన ఉద్యోగులకు అవసరమైన సాయం చేస్తామని తెలిపింది. సంస్థ వ్యయ తగ్గింపు చర్యల్లో భాగంగా 2022లో ఏకంగా 27వేల మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. తాజా రౌండ్‌లో ఎందరు రోడ్డున పడేది తెలియరాలేదు.

జపాన్‌కు మారుతి సుజుకి జిమ్నీ ఎగుమతులు



న్యూఢిల్లీ : మారుతి సుజుకి ఇండియా దేశంలో తయారు చేసిన ఐదు డోర్ల జిమ్నీ వాహనాలను ఎగుమ తి చేస్తున్నట్లు తెలిపింది. గూర్‌గావ్‌లో తయారు చేసిన ఈ ఎస్‌యువి జపాన్ లో ఆవిష్కరించినట్లు గురువా రం వెల్ల డించింది. ఈ మేడ్ ఇన్ ఇండియా వాహనాన్ని గ్లోబల్ స్థాయిలో రూపొం దించినట్లు మారుతి సుజుకి ఇండియా ఎండి, సిఇఒ హిసషి టెకుచి తెలిపారు. కాగా.. భారత్ నుంచి జపాన్‌కు ఎగుమతి చేస్తున్న వాటిలో ఇది రెండో మోడల్ కావడం విశేషం. 2024 ఆగస్టులో ఫ్రాంక్స్‌ను ఎగుమతి చేసింది.

మార్చ్‌లో నథింగ్ ఫోన్ (3ఎ) సీరిస్ విడుదల



న్యూఢిల్లీ : లండన్ కేంద్రంగా పని చేస్తోన్న టెక్నాలజీ కంపెనీ నథింగ్ తన ఫోన్ (3ఎ) సీరీస్‌ను మార్చ్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. గొప్ప ఆకాంక్షలు, అత్యాధునిక ఆవిష్కరణలు, ప్రాసెసర్లు కోరుకునే వారికి ఇది మంచి అనుభవాన్ని ఇవ్వనుందని ఆ సంస్థ పేర్కొంది. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకునే కెమెరా, స్క్రీన్, ప్రాసెసర్, డిజైన్ అంశాల్లో కీలక దృష్టిని కేంద్రీకరించామని పేర్కొంది. 2020 అక్టోబర్‌లో ప్రారంభించిన తమ కంపెనీ నాలుగేళ్లలోనే బిలియన్ డాలర్ల సంస్థగా అవతరించిందని నథింగ్ పేర్కొంది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాలు 97 శాతం పతనం

న్యూఢిల్లీ : గౌతం అదానీకి చెందిన కీలక కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఏకంగా 97 శాతం పతనమై రూ.58 కోట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1,888 కోట్ల నికర లాభాలు సాధించింది. డాలర్‌తో ఆస్ట్రేలియం మారకం విలువ పడిపోవడంతో అక్కడి మైనింగ్‌లో రాబడులు తగ్గినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ పేర్కొంది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 9 శాతం తగ్గి రూ.22,848 కోట్లుగా చోటు చేసుకుంది. పేలవ ఫలితాలను ప్రకటించిన నేపథ్యంలో గురువారం ఓ దశలో ఆ కంపెనీ షేర్ 9 శాతం మేర పతనమయ్యింది. తుదకు 2.85 శాతం తగ్గి రూ.2,252.65 వద్ద ముగిసింది.

మూడ్రోజుల్లో రూ.2వేల ధర తగ్గింపు

ఆగ్రహంతో రోడ్డుపై బైటాయించిన పత్తి రైతులు



తగ్గడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి

నవతెలంగాణ - పెద్దపల్లి

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలంటూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయం మార్కెట్‌లో గురువారం పత్తి రైతులు ఆందోళనకు దిగారు. మూడ్రోజుల కిందట రూ.7వేల నుంచి రూ.7,500వరకు పత్తి ధర ఉండగా.. గురువారం ఒక్కసారిగా రూ.2000 తగ్గించి రూ.5,500 ధర పెట్టడంపై రైతులు వ్యవసాయం మార్కెట్ ఎదుట రాజీవ్ రహదారిపై బైటాయించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయా యి. సీసీఐ అధికారులు మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేసే వరకు రాస్తారోకో విరమించేది లేదని, మద్దతు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. పత్తి ధర తగ్గడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు, కూలీల ధరలు బాగా పెరిగాయని, అకాల వర్షాలతో దిగుబడులు తగ్గాయని, ధర తగ్గడంతో తమ పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని పలువురు రైతులు వాపోయారు.

సీసీఐ అధికారులు పత్తి ధర తగ్గించకుండా చూడాలని కోరారు. అధికారులు, వ్యాపారులు కలిసి తమ వద్ద తక్కువ ధరకు పత్తి కొని సీసీఐకి మద్దతు ధరకు విక్రయించే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సీఐ అనీల్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు.

రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు

11కు విచారణ వాయిదా



న్యూఢిల్లీలో జరిగిన 'వంచిత్ సమాజ్..
దశ ఔర్ దిశా' సమావేశంలో ఢిల్లీ దళిత ప్రభావశీలులను కలిసిన రాహుల్

సుల్తాన్‌పూర్: కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు విచారణ ఫిబ్రవరి 11కు వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో గురువారం ఈ కేసు విచారణ జరగాల్సి ఉంది. అయితే రాహుల్‌గాంధీ తరపు న్యాయవాది అస్వస్థతకు గురికావడంతో విచారణను ప్రత్యేక జడ్జి శుభం వర్మ వాయిదా వేశారు. 'రాహుల్ గాంధీ న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా అస్వస్థతతో ఉన్నారని, కోర్టు విచారణకు హాజరు కాలేకపోతున్నారని మెడికల్ సర్టిఫికేట్ సమర్పించారు. దీనికి స్పందించిన న్యాయమూర్తి విచారణకు కొత్త తేదీని నిర్ణయించారు' అని బిజెపి నాయకుడు విజయ్ మిశ్రా తరపు న్యాయవాది సంతోష్ కుమార్ పాండే తెలిపారు. హనుమాన్‌గంజ్‌కు చెందిన బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా ఈ కేసు వేసిన సంగతి తెలిసిందే. 2018 కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఈ పరువు నష్టం కేసు వేశారు. 2023 డిసెంబర్‌లో రాహుల్ గాంధీపై అరెస్టు వారెంట్ జారీ చేశారు. అయితే గత ఏడాది ఫిబ్రవరిలో రాహుల్ లొంగిపోవడంతో కోర్టు అతనికి బెయిల్ మంజూరు చేసింది.

సీఎం రేవంత్‌ను కలిసిన ఎంపీ రఘువీర్..

పెద్దగట్టు జాతరకు నిధులు కేటాయించాలని వినతి..

యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించే పెద్దగట్టు(గొల్లగట్టు) జాతరకు భారీగా నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విన్నవించారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 16 నుంచి పెద్దగట్టు జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లకు కావాల్సిన నిధుల ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జాతరకు దేశవ్యాప్తంగా భారీగా భక్తజనం తరలిరానున్న నేపథ్యంలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయనున్నారు. గత ప్రభుత్వాల హయాంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ ఈసారి శాశ్వత ప్రాతిపదికన పనులు చేయాలని సూచించారు. అవసరమైన చోట సీసీ రోడ్లు వేయాలని తెలిపారు. ఎంపీ రఘువీర్ రెడ్డి కి యాదవ సంఘం నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌని రాజారామ్ రమేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పెద్దగట్టు జాతరకు సౌకర్యాలు కల్పించేలా నిధులు విడుదల చేయాలని ఎంపీ గారిని కోరుతూ వినతి పత్రం సమర్పించడంతో వెంటనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పెద్దగట్టు జాతర కు నిధులు విడుదల చేయాలని కోరారు. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అధికారులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు......సంపత్ కుమార్...ఏఐసీసీ కార్యదర్శి కామెంట్స్

పీఏసీ మీటింగ్లో వర్గీకరణ అనేది కాంగ్రెస్ మూల సిద్ధాంతం అని నేను చెప్పాను.కాంగ్రెస్ కు విరుద్ధంగా వివేక్ కానీ,ఇంకెవరైన మాట్లాడితే కాంగ్రెస్ పార్టీకి విరుద్ధం. పార్టీ చర్యలు తీసుకుంటుందని అనుకుంటున్నఎస్సి వర్గీకరణను ఖచ్చితంగా సీఎం రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది. మంద కష్ణ మాదిగ ఎలాంటి ఆందోళన చేయొద్దు. మాదిగల కోసం సీఎం రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు లో వాదనలు వినిపించిన ఏకైక ముఖ్యమంత్రి ఏక పక్ష కమిషన్ రిపోర్ట్ రాగానే తెలంగాణ ప్రభుత్వం ఎస్సి వర్గీకరణ చేస్తోంది. మాదిగ సామాజిక వర్గానికి న్యాయం చేస్తాం అని హరీష్ రావు, కేటిఆర్ అంటున్నారు.నవ్వు వస్తుంది...వాళ్లకు సిగ్గు ఉండాలి.ఉషామెహ్రా కమిషన్ రిపోర్ట్ ను డిల్లికి తీసుకపోదాం అని నేను అసెంబ్లీలో అంటే పది ఏండ్లు బీఆర్ఎస్ నాయకులు సప్పుడు చేయలేదు.కేవలం అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ఒక్కడే మాదిగల కోసం అసెంబ్లీలో గొంతెత్తిండు.

రాధాకిషన్‌రావు, భుజంగరావులకు ఊరట

- ఫోన్‌ట్యాపింగ్ కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు
- ముందస్తు బెయిల్ కోసం మాజీ ఐజీ ప్రభాకర్‌రావు యత్నాలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితులైన నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీ భుజంగరావులకు రాష్ట్ర హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయిన ఈ ఇద్దరు అధికారులు గత 10 నెలలుగా చంచల్‌గూడ జైలులో ఉన్న విషయం విదితమే. వీరు గతంలో బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాజాగా, ఇదే కేసులో నిందితుడైన మరో అదనపు ఎస్పీ తిరుపతన్నకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో గత నెల క్రితం బెయిల్ కోసం హైకోర్టును రాధాకిషన్‌రావు, భుజంగరావులు ఆశ్రయించారు. వీరి పిటిషన్‌ను విచారించిన హైకోర్టు తాజాగా బెయిల్‌ను మంజూరు చేసింది. ఇద్దరు కూడా చెరి లక్ష రూపాయలను పూచీకత్తుగా చెల్లించాలనీ, విచారణ అధికారులకు సహకరించాలనీ, తమ పాస్‌పోర్ట్‌లను కోర్టులో జమ చేయాలని కూడా హైకోర్టు ఆదేశించింది. కాగా, ఈ కేసులో తొలుత అరెస్టయిన మరో డీఎస్పీ ప్రణీత్‌రావు కూడా బెయిల్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలిసింది.

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొనబడిన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు సైతం ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించనున్నట్టు సమాచారం. ఈ కేసు నమోదు కాకముందే అమెరికాకు వెళ్లిపోయిన ప్రభాకర్‌రావు.. అక్కడే తాను క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతున్నట్టు ఇక్కడి దర్యాప్తు అధికారులకు ఇదివరకే సమాచారమిచ్చారు. అయితే, ఆయనను అరెస్ట్ చేసి తీసుకురావటానికి దర్యాప్తు అధికారులు సీబీఐ ద్వారా ఇంటర్‌పోల్‌కు ఇప్పటికే రెడ్‌కార్నర్ నోటీసును అందించారు. ఆ ప్రక్రియ కొనసాగుతున్నట్టు రాష్ట్ర డీజీపీ జితేందర్ కూడా ఇటీవల ప్రకటించారు. ఇదంతా ఒకవైపు సాగుతుండగా.. తనకు ముందస్తు బెయిల్ కోసం తన న్యాయవాదుల ద్వారా ప్రభాకర్‌రావు ప్రయత్నాలను ముమ్మరం చేసినట్టు రాష్ట్ర దర్యాప్తు అధికారులకు సమాచారమున్నట్టు తెలుస్తున్నది. ఇదే కేసులో మరో నిందితుడైన ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్ కుమార్ విషయమై దర్యాప్తు అధికారుల ఆరా తీస్తున్నారు.

సుప్రీంకోర్టు కాన్సిట్యూషనల్ బెంచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లాలి

పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా రద్దుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన | **కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్**



నవతెలంగాణ - హైదరాబాద్

సుప్రీంకోర్టు కాన్సిట్యూషనల్ బెంచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లాలని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్ రావు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా రద్దు చేయడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. దీనిపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పీజీ మెడికల్ సీట్ల రిజర్వేషన్ల విషయంలో 50 శాతం లోకల్ రిజర్వేషన్ వర్తించదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణతో పాటు, దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకూ తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందని తెలిపారు. మెడికల్ కాలేజీల్లో అగ్రగామి ఉన్న తెలంగాణలో ఈ తీర్పుతో స్థానిక విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ వైద్యవిద్య అభివృద్ధి కోసం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడంతో 10 ఏళ్లలో వాటి సంఖ్య ఐదు నుంచి 34కు చేరాయని గుర్తుచేశారు. దీంతో ప్రతి లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో, పీజీ సీట్లలో రెండో స్థానంకు చేరిందని చెప్పారు. రాష్ట్రంలో 2,924 పీజీ సీట్లు ఉండగా, 50 శాతం లోకల్ రిజర్వేషన్ ప్రకారం, 1,462 పీజీ సీట్లు తెలంగాణ ప్రాంత విద్యార్థులకు మాత్రమే వచ్చేవనీ, అయితే తాజా తీర్పుతో ఆ 1,462 సీట్లు కూడా ఆల్ ఇండియా కోటాలోకి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంటే వంద శాతం సీట్లు నేషనల్ పూల్ కే తరలిపోతున్నాయని వివరించారు. ఒక్క తెలంగాణే కాక దక్షిణాది రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులదీ ఇదే పరిస్థితి అని చెప్పారు.

తెలంగాణలో ఒక పీజీ స్టుడెంట్ 12,799 మందికి వైద్య సేవలందిస్తే, కర్నాటకలో 10,573 మందికి, ఏపీలో 15,079 మందికి, తమిళనాడులో 15,123 మందికి, కేరళలో 18,662 మందికి సేవలు అందిస్తున్నారని చెప్పారు. అదే ఉత్తరాది రాష్ట్రాల్లో దీనికి రెండు, మూడు రెట్లున్నారన్నారు. దేశ సగటు 20,460గా ఉందని తెలిపారు. ఈ తీర్పుతో పీజీలో ఇన్‌సర్వీస్ కోటా అనేది ప్రశ్నార్థకం అవుతుందని చెప్పారు. 2019 జులై 19న లోక్‌సభలో ఎంపీ మనోజ్ కోటక్ అడిగిన ప్రశ్నకు 'హెల్త్ ఈజ్ ఎ స్టేట్ సబ్జెక్ట్' అని స్పష్టంగా చెప్పారనీ, రాష్ట్ర ప్రభుత్వంలోని మెడికల్ కాలేజీలు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నడుస్తాయి. పీజీ విద్యార్థులకు ఇచ్చే స్టైఫండ్స్ కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని గుర్తు చేశారు. స్థానిక రిజర్వేషన్ లేని పక్షంలో ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చులకు, వైద్య విద్యార్థుల సేవలు ఆయా రాష్ట్రాల్లో వినియోగించుకునే అవకాశం లేకుండా పోతుందని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుతో రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరిగే అవకాశం ఉందని భావించిన తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టు కానిస్టిట్యూషనల్ బెంచ్ కు పోవాలని నిర్ణయించిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వెళ్లాలని డిమాండ్ చేశారు. పీజీ సీట్లలో లోకల్ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై అవసరమయితే దక్షిణాది రాష్ట్రాలు అన్ని కలిసి రాజ్యాంగ సవరణకు పట్టుబట్టాలని విజ్ఞప్తి చేశారు.



ఎన్నికల కోడ్ చెప్పి రైతు భరోసాకు ఎగనామం

- ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మోసం : బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల కోడ్ చెప్పి రైతు భరోసాకు మరో ఆరు నెలల పాటు ఎగనామం పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రకు తెరలేపారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టకీ టకీ అని రైతు భరోసా డబ్బులు పడతాయని ఊరించి ఒక్క రోజులోనే డబ్బులు వేసి ఆపేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట పెడుతున్న గ్రామ సభలు మరో మోసమని విమర్శించారు. ఒక్క హుజురాబాద్ నియోజకవర్గంలోనే ఇందిరమ్మ ఇండ్లకు 40 వేల మంది అర్హులని అధికారులు తేల్చారనీ, ఈ లెక్కన రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు దాదాపు 50 లక్షల మంది అర్హులుంటారని గుర్తు చేశారు. ఇప్పుడు మంజూరు చేస్తున్న లెక్క ప్రకారం వెళితే వందేండ్లైనా అవి పూర్తి కావని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగి పోయిన ప్రజలు తిరగడే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గ్రామ సభలే ఇందుకు నిదర్శనమని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారనడానికి వారి అధికారిక ట్విట్టర్లో వచ్చిన అభిప్రాయాలే సాక్ష్యమని చెప్పారు. ఇప్పటికైనా ప్రజలను మోసం చేసే కుట్రలను రేవంత్ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్దన్‌రెడ్డి, తంగ బాలు పాల్గొన్నారు.

రెండో విడత స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్ గ్రాంట్ నిధులు రూ.48.36 కోట్లు విడుదల

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో స్కూల్ గ్రాంట్ కింద రూ.36.11 కోట్లు, స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ నిధులు రూ.12.25 కోట్లు కలిపి మొత్తం రూ.48.36 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు (ఎస్పీడీ) ఈవి నరసింహారెడ్డి గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ కింద 50 శాతం నిధులను గతంలో మొదటి విడతలో రూ.48.86 కోట్లు విడుదల చేశామని వివరించారు. ఇప్పుడు రెండో విడతలో రూ.48.36 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఇందులో ఎస్సీల (24 శాతం) కాంపొనెంట్ నిధులు రూ.11.60 కోట్లు, ఎస్టీల (14 శాతం) కాంపొనెంట్ నిధులు రూ.6.77 కోట్లు, జనరల్ కాంపొనెంట్ (62 శాతం) నిధులు రూ.29.98 కోట్లు కలిపి మొత్తం రూ.48.86 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 25,760 ప్రభుత్వ పాఠశాలలున్నాయని వివరించారు. వాటికి స్కూల్ గ్రాంట్ కింద వంద శాతం నిధులు రూ.72.22 కోట్లు విడుదల చేశామని తెలిపారు. స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ కింద 25,760 స్కూళ్లకు వంద శాతం నిధులు రూ.24.50 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు.

యూనివర్సిటీ అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 65ఏండ్లకు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఉన్నతవిద్య శాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 65ఏండ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఉన్నతవిద్యా శాఖ కార్యదర్శి డా. యోగితా రాణా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వర్సిటీల్లో యుజిసి వేతనాలు పొందే అధ్యాపకులకు ఈ నిర్ణయంవర్తించనుంది. గత బీఆర్ఎస్ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 ఏండ్ల నుంచి 61 ఏండ్లకు పెంచిన విషయం తెలిసిందే.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు కాల్

- ఫోన్ చేసిన వ్యక్తి మతిస్థిమితం లేని వానిగా గుర్తింపు



నవతెలంగాణ-శంషాబాద్

హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పేల్చి వేస్తామని గురువారం బెదిరింపు కాల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఎయిర్‌పోర్టును పేల్చి వేస్తామని బెదిరింపు కాల్ చేశాడు. దాంతో పోలీసు అధికారులు ఎయిర్‌పోర్టులోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో ఫేక్ కాల్‌గా పోలీసులు నిర్ధారించారు. ఫేక్ కాల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అతను కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని గుర్తించారు. అనంతరం నిందితుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద గల వాసుపూజ జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారి కార్తిక్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్‌లో షార్ట్ సర్క్యూట్ రావడంతో ఒక్కసారిగా మంటలు చిలరేగి వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశారు. రూ.5 లక్షల విలువ గల పత్తిని కాపాడినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఇందులో అగ్నిమాపక శాఖ సిబ్బంది మహేష్, ప్రవీణ్, శివకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుంటే పోరాటం

ఉద్యోగులను ఆవేదనకు గురిచేస్తున్న కాంగ్రెస్ : రాష్ట్ర ప్రభుత్వంపై మాజీమంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నదని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తున్నదని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. 30 ఏండ్లపాటు ప్రజలకు సేవలందించిన ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా?అని ప్రశ్నించారు. వారి ఆవేదన ప్రభుత్వానికి అర్థం కాదా?అని తెలిపారు. గతేడాది మార్చి తర్వాత ఉద్యోగ విరమణ పొందిన దాదాపు ఎనిమిది వేల మంది పీఎఫ్, గ్రాట్యూటీ, ఎల్ఐసీ, కమ్యూటేషన్, సరెండర్ లీవులు తదితర ప్రయోజనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే సమయంలో విశ్రాంత ఉద్యోగుల ఆనందాన్ని దూరం చేసిన దుర్మార్గ ప్రభుత్వమని విమర్శించారు. నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల కర్కశత్వానికి నిదర్శనమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరవాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఉద్యోగికి చెల్లించాల్సిన రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షలు వెంటనే చెల్లించాలని కోరారు. లేదంటే ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

అంతం పలకండి



- మ్యాన్యువల్ స్కావెంజింగ్‌పై సుప్రీంకోర్టు
- పూర్తి నిషేధం కోసం ఆరు మెట్రో నగరాల సీఈఓలకు ఆదేశాలు

న్యూఢిల్లీ : దేశంలోని ఆరు పెద్ద మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్‌లలో చేతులతో మలాన్ని ఎత్తే పని(మాన్యువల్ స్కావెంజింగ్), మనుషులతో మురుగు కాలువలు శుభ్రం చేయించటంపై పూర్తి నిషేధానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధులియా నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఆరు నగరాల ముఖ్య కార్యనిర్వాహఖ అధికారులు (సీఈఓ)లకు ఆదేశాలిచ్చింది. ఫిబ్రవరి 13లోగా సమగ్రంగా అఫిడవిట్లను సమర్పించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను అదే నెల 19కి వాయిదా వేసింది. మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిర్మూలించే ప్రయత్నాలపై రాష్ట్రాలతో సమన్వయం చేసుకొని అభిప్రాయాన్ని సేకరించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు 2023, డిసెంబర్‌లో ఆదేశించిన విషయం విదితమే. అయితే, భారత్‌లోని 775 జిల్లాలకు గానూ 456 జిల్లాల్లో మ్యాన్యువల్ స్కావెంజింగ్ కానీ, మనుషులతో మురుగు కాలువలను శుభ్రం చేసే కేసుల నమోదు కాలేదని తన తాజా అఫిడవిట్‌లో పేర్కొన్నది. దీనిపై కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ సమర్పించిన విషయాలను న్యాయస్థానం పరిశీలించింది. మెట్రోపాలిటన్ నగరాల్లో మ్యాన్యువల్ స్కావెంజింగ్, మురుగుకాలువల శుభ్రత పూర్తిగా నిర్మూలించబడిందా అన్న విషయంలో స్పష్టత లోపించిందని కోర్టు గుర్తించింది. స్పష్టమైన ఆదేశాలు జారీ చేసే సమయం ఆసన్నమైందని తాము భావిస్తున్నట్టు వెల్లడించింది. మ్యాన్యువల్ స్కావెంజింగ్‌ను పూర్తిగా నిర్మూ లించే చట్టపరమైన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదని 2023, అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశించింది.

సరస్వతి ఆలయంలో ఉత్సవాలు..

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్



చదువుల తల్లి సరస్వతి దేవి అని ఆర్కేపురం జ్ఞాన సరస్వతి దేవాలయం చైర్మెన్ వరప్రసాద్ అన్నారు. ఆర్కేపురం డివిజన్ జ్ఞాన సరస్వతి ఆలయాన్ని స్థాపించి పుష్కరకాలము పూర్తి అయిన సందర్భంగా గురువారం కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి రాములు, సంజీవ్ రెడ్డి, ఆనంద్ రావు, లక్ష్మయ్య దయానంద్, రాఘవేంద్ర సాయి, రమణయ్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై జీహెచ్ఎంసీ సమావేశంలో నిరసన

నవతెలంగాణ- నాగోల్

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో నాగోల్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని గురువారం కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీలలో సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. డివిజన్‌లోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఈ నిరసనలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం)
రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి అభినందనల వెల్లువ



నవతెలంగాణ - హస్తినాపురం

సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎన్నికైన కామ్రేడ్ జాన్ వెస్లీని గురువారం నందనవనం శాఖ ప్రతినిధులు ఎం.బి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ(ఎం)లో పలు ప్రజాసంఘాలలో కీలకంగా పనిచేసి ప్రజాపోరాటాలు నిర్వహించారని, రాష్ట్ర కార్యదర్శిగా ఆయన ఎదిగిన తీరు నేటి యువతరం కమ్యూనిస్టు నాయకులకు ఎంతో ఆదర్శమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో ప్రజా పోరాటాలను ఉధృతం చేసి సీపీఐ(ఎం), ప్రజాసంఘాల అభ్యున్నతికి ప్రతి కార్యకర్త ముందుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, నందనవనం పార్టీ శాఖ కార్యదర్శి మంథని యాదయ్య, మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలు కమర్, సర్కిల్ కమిటీ సభ్యులు రామస్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

డీసీసీబీ ప్రధాన కార్యాలయానికి
భూమి కేటాయించడం హర్షణీయం
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య

నవతెలంగాణ-తుర్కయంజాల్

డీసీసీబీ ప్రధాన కార్యాల యం భవనం నిర్మాణానికి ఆది భట్ల లో ఒక ఎకరం భూమిని కేటాయించడం హర్షణీయం అని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (HDCCB) చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. గురువారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ ప్రభుత్వం డీసీసీబీకి భూమిని కేటాయించడం సంతోషదాయక మన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ భాస్కర సుబ్రహ్మణ్యం, జీఎం ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పలు చోట్ల గాంధీ వర్ధంతి

నవతెలంగాణ -నాగోల్



సత్యం, శాంతి, అహింసలే ఆయుధాలుగా చరిత్రపై చెరగని సంతకం చేసిన జాతిపిత మహాత్మా గాంధీ అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జమై ఉస్మానియా గాంధీ విగ్రహం వద్ద సికింద్రాబాద్ ఐవీఎఫ్ జోనల్ అధ్యక్షుడు బెల్దే రవికుమార్ గుప్త ఆధ్వర్యంలో ఆయన గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా అఖండ భారతావనికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించిన మన జాతిపిత మహాత్మా గాంధీ అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్, బిల్దే నరసింహారావు, గుండ శ్రీనివాస్, చింతగారి వెంకట్రాజయ్య, వెంకటేశ్వరరావు, దాచేపల్లి శ్రీనివాస్, బెల్దే ఈశ్వరయ్య, భూశెట్టి శ్రీనివాస్, ఉప్పల వేణుగోపాల్, చకిలం వేణు, కూరాకుల సుధాకర్, కాషనగట్టు రాజశేఖర్ పాల్గొన్నారు.



నవతెలంగాణ - ఎల్బీనగర్

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా డాక్టర్స్ కాలనీ రోడ్ నెంబర్ 1 లోని గాంధీ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు జిగిని రామ మూర్తి, ఉపాధ్యక్షులు జనార్ధనరెడ్డి, ఆంజనేయులు, అనంతరెడ్డి, రాజమౌళి, అన్నారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



'క్రీడలతో మానసిక ఉల్లాసం'

నవాతెలంగాణ-తుర్కయంజాల్

క్రీడలతో మానసికోల్లాసం, మనోధైర్యం కలుగుతుందని కోచ్ సంతోష్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు సెంట్ పాల్స్ తుర్కయంజాల్ స్కూల్లో గురువారం నిర్వహించిన అండర్ 14, అండర్ 17 క్రికెట్లో లక్ష్య స్కూల్ తొర్రూర్ విద్యార్థులు అండర్ 14 మొదటి బహుమతి, అండర్ 17 రెండో బహుమతి గెలిచారు. ఈ సందర్భంగా కోచ్ సంతోష్ మాట్లాడుతూ మొదటి, రెండవ బహుమతులు తమ పాఠశాల విద్యార్థులు గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని, పిల్లలందరూ క్రీడలలో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడలకు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం గెలిచిన వారికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా



హామీలను అమలు చేయాలని
మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతి



నవతెలంగాణ- బడంగ్ పేట్

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. బడంగ్‌పేట్‌లో మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తర్వాత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. మోసపూరిత హామీలతో సీఎం పదవి చేపట్టిన రేవంత్ రెడ్డి ప్రతినిత్యం ప్రజలను వంచిస్తూనే ఉన్నారని విమర్శించారు. ఎన్నికల్లో పంచిన గ్యారెంటీ కార్డుకు, ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా కాల యాపన చేస్తున్నారని మండిపడ్డారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన నేటికీ రైతుల అకౌంట్లల్లో డబ్బులు వేయలేదన్నారు. ఎరువులు, విత్తనాల కోసం మళ్లీ క్యూలైన్లు, వేళాపాళా లేని కరెంట్ కోతలు, వరికి రూ.500 బోనస్ పేరిట బోగస్ మాటలు, ఇవన్నీ కపట కాంగ్రెస్ పాలనలో రైతన్నకు ఈ 420 రోజుల్లో ఎదురైన చేదు అనుభవాలు అని వెల్లడించారు. ఓవైపు రుణమాఫీ మోసం.. మరోవైపు పెట్టుబడి భారం తట్టుకోలేక ఇప్పటికే 410 మందికి పైగా రైతుల బలవన్మరణాలకు కారణమైందన్నారు. మహిళలకు ప్రతి నెల రూ.2500 ఇస్తామని, కళ్యాణలక్ష్మీతోపాటు తులం బంగారం అందిస్తామని మోసం చేయడంతో ఆడబిడ్డలు రగిలిపోతున్నారని, వృద్ధులు, వితంతువుల పింఛన్లు రూ.4 వేలకు పెంచుతామని నమ్మబలికి ఏడాదైనా ఉలుకూ పలుకూ లేని సర్కారు తీరుపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారన్నారు. యువతకు 2 లక్షల ఉద్యోగాల హామీని, జాబ్ క్యాలెండర్ వాగ్దానాన్ని గంగలో కలిపేశారన్నారు.



ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సూర్ణగంటి అర్జున్,పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, యాతం పవన్ కుమార్ యాదవ్, నాయకులు పెద్దబావి ఆనంద్ రెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, జెనిగ శ్రీనివాస్ యాదవ్, డానియేలు మాజీ కో ఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేత

జల్‌పల్లి మున్సిపాలిటీ మాజీ కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు మహాత్మా గాంధీ విగ్రహానికి "ఓ మహాత్మా ఈ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించు, జ్ఞానం ప్రసాదించు, ఇచ్చిన హామీలు నెరవేర్చేలా చూడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సూరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటికీ 420 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జల్ పల్లి మున్సిపాలిటీ యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్, సీనియర్ నాయకులు పోలేమోని నాగేష్ ముదిరాజ్, జామ రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - దిల్ సుఖ్‌నగర్

కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు..ప్రజా వ్యతిరేక పాలన అని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ ఆయచితం శ్రీధర్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్కేపురం డివిజన్‌లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా గాంధీ విగ్రహానికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు పూర్తి అయిందని, హామీలు మాత్రం అమలు కావడం లేదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు అధికారమే ధ్యేయంగా అడ్డగోలుగా రేవంత్ రెడ్డి హామీలను ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై రోజు రోజుకు ప్రజల్లో వ్యతిరేకత తీవ్రం అవుతుందని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించాలని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ గాంధీ విగ్రహానికి విన్నవించారు. రైతు భరోసా, రైతు రుణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ పై నేటికీ ప్రభుత్వానికి క్లారిటీ లేదన్నారు. ఆర్కేపురం డివిజన్ లో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ అసంపూర్తిగా ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సాజిద్, వెంకటేష్ గౌడ్, గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, మహేందర్ రెడ్డి, కంచర్ల శేఖర్, కొండ్రు శ్రీనివాస్, అనురాధ, జగన్ మోహన్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, జాగృతి నవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - చంపాపేట్

గాంధీ వర్ధంతి సందర్భంగా చంపాపేట్ ఉద్యమకారులు రామ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చంపాపేట్ ఉద్యమకారులు నరసింహారెడ్డి, పైడిమర్రి నాగభూషణం, అభిభూ, మమ్మద్, ఆసిఫ్, శివ తదితరులు పాల్గొన్నారు.



విశ్వ బ్రాహ్మణ సంఘం
సమావేశానికి రావాలని సబితమ్మకు ఆహ్వానం



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలో ఆదివారం తోట జంగారెడ్డి గార్డెన్ లో జరుగనున్న విశ్వ బ్రాహ్మణ సంఘం ఆరవ వార్షికోత్సవ కార్యక్రమానికి రావాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం నాదర్ గుల్ గ్రామానికి చెందిన ముగ్గురు వికలాంగులకు బ్యాటరీ సైకిల్స్‌ను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అంద చేశారు. ఈ కార్యక్రమంలో నాదర్ గుల్ గ్రామ మాజీ సర్పంచ్ మమత సుదర్శన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కుమార్ గౌడ్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీసీ సెల్ అధ్యక్షులు కోటగిరి జంగయ్య, నాయకులు నరేష్ చారి, కుమార్ యాదవ్, దండు కొమురయ్య యాదవ్, జంగా చారి, రాజు చారి తదితరులు పాల్గొన్నారు.



'మైనర్లకు వాహనాలిస్తే కేసులే..'

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ హెచ్చరించారు. గురువారం ఖాజా గరీబ్ నవాజ్ అకాడమీ కన్వీనర్ షాకేర్ బేగ్ ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న షాహిన్ నగర్ నుంచి మైనర్ డ్రైవింగ్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలలో మైనర్‌లు ఎక్కువ మృతిచెందారని చెప్పారు. వారి మృతికి కుటుంబ సభ్యులే కారణం అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై, తల్లీదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని అన్నారు. బాలాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి.. మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్తఫా సుఫియాని, ఇక్రమ్ అలీ, అహ్మద్ బావజీర్, జిలాని, సాబెర్, ముబీన్ ఖాద్రి పాల్గొన్నారు.



డ్రయినేజీ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్,బాపునగర్ తదితర ప్రాంతాలలో డ్రయినేజీ సమ స్యను పరిష్కరించాలని అధికారులు ప్రభుత్వం దృష్టి సారించాలని బీజేపీ నగర నాయకులు నాగ భూషణం చారి, డివిజన్ అధ్యక్షులు నరేష్ గౌడ్ అన్నారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పరిధి లోని డ్రయిజేజీ సమస్యను పరిశీలించి వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని చాలాచోట్ల డ్రయినేజీ సమస్య ఉందని అదేవిధంగా స్ట్రీట్ లైట్ వెలగడం లేదని ప్రభుత్వం అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా అంబర్‌పేట అసెంబ్లీ కన్వీనర్ వెంకట్ స్వామి గౌడ్, రమేష్ కుమార్, ఓబీసీ డివిజన్ అధ్యక్షులు అయోధ్య రాములు, నాయకులు వేణు ముదిరాజ్, భాస్కర్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లెనెక్సిస్ ఫుడ్‌వర్క్స్ 200వ చైనీస్ వోక్ రెస్టారెంట్ ప్రారంభం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారతదేశంలోని ప్రముఖ ఆహార సేవా సంస్థలలో ఒకటైన లెనెక్సిస్ ఫుడ్‌వర్క్స్, బెంగళూరు లోని కోరమంగళలో తన 200వ చైనీస్ వోక్ రెస్టారెంట్ ను ప్రారంభించినట్లు గురువారం ఒక ప్రకటనలో ఆ సంస్థ డైరెక్టర్ ఆయుష్ మధుసూదన్ అగర్వాల్ ప్రకటించారు. ఈ విజయం కంపెనీ అద్భుతమైన వృద్ధిని, అసాధారణమైన దేశీ చైనీస్ భోజన అనుభవాలను అందించడంలో నిబద్ధతను హైలైట్ చేస్తుందని, ఈ కొత్త రెస్టారెంట్ బెంగళూరు ప్రాంతంలో చైనీస్ వోక్ 30వ రెస్టారెంట్, బ్రాండ్ పరిణామాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. తాము టైర్ 2, టైర్ 3 నగరాల్లోకి విస్తరిస్తున్నప్పుడు, మా హాల్మార్క్ నాణ్యతను కొనసాగిస్తూ స్థానిక అభిరుచులకు అనుగుణంగా ఉండే రుచులను అందించడం ద్వారా చైనీస్ వోకు ఇంటి పేరుగా మార్చడం, 2027 నాటికి 500 స్టోర్లకు విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- పాలక మండలిపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం కలిగేలా పనిచేయాలి
- ఎంపీ ఈటల రాజేందర్
- బల్దియా వార్షిక బడ్జెట్ రూ. 8,440 కోట్లకు ఆమోదం









నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన కార్పొరేషన్ సాధారణ సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ ఎంసీ అంచనా బడ్జెట్ రూ.8, 440 కోట్లకు ప్రవేశపెట్టారు. అయితే ఎలాంటి చర్చ లేకుండానే బల్దియా వార్షిక బడ్జెట్ రూ.8,440కోట్లకు ఆమోదించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి మేయర్ మాట్లాడారు. జీహెచ్ ఎంసీలో చేపట్టే మౌలిక సదుపాయాల అభివృద్ధికి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తామన్నా రు. ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తూ బల్దీయా అభి వృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావించారు. నగర ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేయర్ కోరా రు. నగర సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంలో అధికారులకు ప్రజాప్రతినిధులు పూర్తి సహకారాన్ని అందించాలన్నారు.

అనంతరం ఎంపీ, ఎక్స్ అఫిషియో మెంబర్ ఈటల రాజేందర్ మాట్లాడుతూ పాలక మండలి పై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండేలా పనిచేయాలని సూచించారు. నగర ప్రజల సమస్యల పరిష్కారంలో అందరూ సమన్వ యంతో పనిచేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వస తులు కల్పించాలన్నారు. నగరంలో సౌకర్యాలకు నోచుకొని ప్రాంతాలను గుర్తించి అభివద్ధి చేయాలని కోరారు. ప్రభు త్వం నుంచి నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని, నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించడంలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నగరంలోని అన్ని నీటి వనరులు దుర్గంధ పూరితం కాకుండా మురికిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

శానిటేషన్ నిర్వహణ, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు, నగర శివారు ప్రాంతాల అభివద్ధి పై చర్యలు తీసుకోవాలి: కార్పొరేటర్లు

పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ... నగర ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నగర అభివృద్ధిపై దృష్టి సారిస్తూ, నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించాలని కోరారు. ప్రధానంగా శానిటేషన్ నిర్వహణ, స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు, నగర శివారు ప్రాంతాల అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని, జీహెచ్ఎంసీకి అధిక ఆదాయ వనరులు సమకూర్చడంపై ప్రత్యేక దష్టి సారిం చాలని కార్పొరేటర్లు కోరారు. నగరంలోని పలు కార్పొరేట్ పాఠశాలలు ట్యాక్స్ కట్టడంలేదని, స్పెషల్ డ్రైవ్ చేపట్టి ట్యాక్స్ రికవరీ చేయాలని సూచించారు. క్షేత్ర పరిధిలో పనులు జరిగేలా అధికారుల సేవలను వినియోగించాలని కోరారు. క్రీడా ప్రాంగణాలు/ మైదానాల పట్ల నిర్లక్ష్యం వహి స్తున్నారని, వాటిని అభివృద్ధి చేయాలని, పార్కులలో మౌలిక వసతులను కల్పించాలని కోరారు. సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయా విభాగాల అధికారులు వివరణ ఇచ్చారు.

పార్కులు, క్రీడా మైదానాలలో వసతుల కల్పనకు ప్రాధాన్యత - జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

నగరంలోని పార్కులు, క్రీడా మైదానాలలో అవస రమైన ఫెసిలిటీస్ కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. క్రీడా మైదానాలలో అవసరమైన ఆయా వసతులను సమకూర్చ డానికి చర్యలు తీసుకుంటున్నామని, ఆయా వసతులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. స్ట్రీట్ లైట్లకు సంబంధించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని, లైటింగ్ కు సంబంధించిన కాంట్రాక్టర్లను నియమించామని, త్వరితగతిన పూర్తి చేస్తారని తెలిపారు. అనంతరం డిప్యూటీ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... సభ సాఫీగా జరిగినందుకు సంతోషం వ్యక్తం చేశారు. నగర అభివద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. బల్దియా అభివద్ధికి ప్రభు త్వం అన్ని విధాలు అండగా ఉందని తెలిపారు. సమస్యలను పరిష్కరించడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. శానిటేషన్ నిర్వహణలో సిబ్బందిని మరింతగా పెంచాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ్ చౌహాన్, ఉపేందర్ రెడ్డి, రవి కిరణ్, అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, గీత రాధిక, పంకజ, నళిని పద్మావతి, యాదగిరి రావు, సుభద్రాదేవి, సెక్రటరీ సత్యనారాయణ, ఈ.ఎన్.సి భాస్కర్ రెడ్డి, సీ.సీ.పీ శ్రీనివాస్, ఆయా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే లు, కార్పొరేటర్లు, వాటర్‌బోర్డు నుంచి డైరెక్టర్లు సుదర్శన్, స్వామీత తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ ప్రజాసమస్యలపై కౌన్సిల్‌లో ధ్వజమెత్తిన కార్పొరేటర్



నవతెలంగాణ-ముషీరాబాద్

స్ట్రీట్ లైట్, పార్కుల సుందరీకరణ, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి నెల రోజుల గడువు కోరిన మేయర్, కమిషనర్- కార్పొరేటర్ గాంధీనగర్ డివిజన్‌లో ప్రజా సమస్యలపై డివిజన్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం లో ధ్వజమెత్తారు. డివిజన్ లోని ప్రజా సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకున్న పాపానపోవడంలేదని మండిపడ్డారు. ఏడాదికాలంగా డివిజన్‌లోని ఏ ఒక్క కాలనీ, బస్తీ, ప్రధానరోడ్లపై స్ట్రీట్లు వెలగడం లేదని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయిన క్రమంలో సమస్య పరిష్కారం కావడంలేదని పేర్కొన్నారు. కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన స్ట్రీట్ బల్బులు ఏర్పాటు చేసిన రెండోరోజే కాలిపోతున్నాయని కౌన్సిల్‌లో ప్రస్తావించారు. కొత్త పోల్స్ ఏర్పాటు చేయడంలేదని కార్పొరేటర్ స్వయంగా తిరిగి పర్యటించి స్ట్రీట్ల విషయంలో అధికారుల దృష్టికి తెచ్చినా కూడా పట్టించు కునేవారే లేకుండా పోయారన్నారు. డివిజన్‌లో పారిశుధ్య సమస్య కూడా తీవ్రంగా ఉందని ఏ రోడ్డులో కూడా పరిశుభ్రత పాటించడంలేదని కౌన్సిల్‌లో ప్రస్తావించినట్లు కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా డివిజన్‌లోని పార్కులను సుందరీకరించాలనే అంశాన్ని ప్రస్తావించారు . నెల రోజుల్లో సమస్యలు పరిష్కారదిశగా చర్యలు తీసుకుంటామని మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి హామీనిచ్చారని ఆమె వివరించారు.

ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్/ ధూల్‌పేట్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో రంగారెడ్డి రీజియన్ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు-2025 ముగింపు కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్ -1 డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ శ్రీలత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్ హాజరై రంగారెడ్డి రీజియన్‌లో అత్యంత సుదీర్ఘ ప్రమాద రహిత సర్వీస్ కలిగివున్న 20మంది డ్రైవర్స్‌కు ప్రశంస పత్రాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఆర్టీసీ అతి తక్కువ ప్రమాద రేటును నమోదు చేస్తున్నారని, ప్రమాద రేటును జీరోకి తీసుకురావాలని సూచించారు. రీజినల్ మేనేజర్ మాట్లాడు తూ.. ప్రమాద రహిత సర్వీసు నమోదు చేసిన డ్రైవర్స్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, రంగారెడ్డి రీజియన్ అన్ని డిపో ల డిపో మేనేజర్స్, పర్సనల్ ఆఫీసర్, సిఆర్ఎం,ఎంజీబీఎస్ , హైదరాబాద్ వన్ డిపో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి సత్యాగ్రహం నేర్పిన తాత్వికుడు గాంధీ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

మానవాళికి సత్యాగ్రహం నేర్పిన తాత్వికుడు మహాత్మా గాంధీ అని బహ దూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పులిపాటి కుమార్ అన్నారు. మహా త్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన నియోజక వర్గం కాంగ్రెస్ నాయకులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. 'అమరవీరుల సంస్మరణ దినాన్ని' పురస్కరించుకుని త్యాగమూర్తులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళికి సత్యాగ్రహం నేర్పిన తాత్వికుడు, అహింసాయుత స్వరాజ్య పోరాటాన్ని నడిపిన జాతిపిత మహాత్మా గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులూ జి. కన్నయ్య లాల్, అబేద్ అలీ, భాను చందర్ యాదవ్, హమీద్ ఉద్దీన్, నసీర్, ప్రవీణ్, బారి ఖాన్, బిలాల్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి మాజీ మంత్రి కేవీ కేశవులు

- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేష్ ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

మాజీ మంత్రి కేవీ కేశవులు ఉన్నత విలువలు కలిగిన వ్యక్తిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేష్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా గురు వారం కేవీ కేశవులు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకు న్నారు. ఈ కార్యక్రమంలో మేర కుల వృత్తి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాడపల్లి మాధవ్ మేర, రాష్ట్ర నాయకులు మాడిశెట్టి లక్ష్మీనారాయణ, కొత్తపల్లి వినోద్ కుమార్, కర్నే శ్రీనివాస్, దీకొండ కవిత, తక్ల శ్రీధర్, పోడిశెట్టి రమేష్, రాపర్తి అఖిల్ , సోమఅనిల్ మేర, తదితర నాయకులు హాజరయ్యారు.

మహాత్మాగాంధీ వర్ధంతి



నవతెలంగాణ-అంబర్‌పేట

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్‌లు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయ నిరాకరణతో ప్రజలను ఉద్యమం వైపు నడిపించి బ్రిటీష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించారని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు డివిజన్ అధ్యక్షులు గడ్డం శ్రీధర్ గౌడ్ సీనియర్ నాయకులు గడ్డం లక్ష్మణ్ గౌడ్, రామ్మోహన్, సందీప్ గౌడ్, రాజ్ కిరణ్, జమీల్, చేగూరి రఘు, మహేందర్, సాయి, తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- సీపీఐ(ఎం) డిమాండ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత్ మాత మహా హారతి కార్యక్రమం లో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్క రికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఐ(ఎం) నగర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడా రు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్ మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ పీపుల్స్ ప్లాజా వద్ద భారత్‌మాత మహాహారతిని నిర్వహిం చారని చెప్పారు. బాణ సంచాపేలి రెండు బోట్లు దగ్ధమ య్యాయని, ఈ సంఘటనలో ఇద్దరు మృతి చెందారని తెలిపారు. మృతి చెందిన నాగారం కు చెందిన అజయ్, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గణపతి కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషి యా చెల్లించాలన్నారు. ఈ ఘటనకు పూర్తి బాధ్య త కేంద్రమంత్రి జీ.కిషన్ రెడ్డి వహించాల న్నారు. ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా కార్యక్రమాన్ని నిర్వహించిన భారతమాత ఫౌండేషన్ నిర్వాకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు, ప్రభుత్వ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలోకి ఎం.వెంకటేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీలోకి ఎం.వెంకటేష్ ఎన్నికయ్యారు. ఇటీవలే జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభలోకి ఎం.వెంకటేష్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా తొలిసారిగా ఎన్నిక య్యారు. నల్గొండ జిల్లా భువనగిరి దగ్గర మన్నేరు పంపు గ్రామంలో రాములు-చంద్రమ్మ దంపతుల కుమారుడు ఎం.వెంకటేష్. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయనకు భార్య, ఒక కూతురు ఉన్నారు. నాచారం పారిశ్రామిక ప్రాంతంలో సిద్ధార్థ ప్యాక్ ఎయిడ్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో వెంకటేష్ పనిచేశారు. ఆ సమయంలో 1995లో కంపెనీలో యూనియన్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. టీఎన్‌టీయుసీకి అనుబంధంగా ఉన్న యూనియన్‌లో కమిటీ సభ్యుడు, కోశాధికారి, ప్రధాన కార్యదర్శి వంటి పదవీనీ చేపట్టారు. టీఎన్‌టీయుసీ యూనియన్‌లో ఉంటూనే 1995 పీఎఫ్ పెన్షన్స్ స్కీంకు వ్యతిరేకంగా సీఐటీయు చేపట్టిన పోరాటం లో వెంకటేష్ భాగస్వాములయ్యారు. కార్మికుల పట్ల టీఎన్‌టీయుసీ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నాచారం పారిశ్రామిక ప్రాంతానికి అప్పుడు సీఐటీయు బాధ్యులుగా ఉన్న కోమటి రవి ప్రోత్సాహంతో 1999 ఏప్రిల్ 30న సీఐటీయుకి అనుబంధం చేశారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో పాల్గొన్నారు. బషీర్‌బాగ్‌లో జరిగిన పోరాటంలో పాల్గొన్నారు. అదే సంవత్సరంలో సీపీఐ(ఎం) మెంబర్ అయ్యారు. 2002లో పార్టీ పిలుపు మేరకు ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి కాలం కార్యకర్త గా పనిచేశారు. 2002 నుంచి 2006 వరకు డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడుగా 2006 నుంచి 2007 వరకు నగర కార్యదర్శిగా పనిచేశారు. యువత ఎదు ర్కొంటున్న సమస్యలు, స్థానిక సమస్యలపై అనేక పోరాటాలు చేస్తూ డీవైఎఫ్ఐ విస్తరణకు కృషి చేశారు. 2006లో ఇంజినీరింగ్ ఫీజులు తగ్గిం చాలని మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజ్ వద్ద జరిగిన పోరాటం సంద ర్భంగా పోలీసులు జరిపిన లాఠి చార్జీలో ఆయన తీవ్రంగా గాయప డ్డారు. మైనార్టీలు, కార్మికులు బస్తీలలో విస్తరణకు కృషి చేశారు. 2014లో జరిగిన అంగన్‌వాడీ ఉద్యోగుల సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడి సందర్భంగా పోలీస్ కేసులు ఎదుర్కొన్నారు. 2014 నుంచి నేటి వరకు సీఐటీయు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ జిల్లా కార్యదర్శిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై పనిచేస్తు న్నారు. కార్మికవర్గంలో రైల్వే కాంట్రాక్ట్ కార్మికులలో విస్తరణ కు కృషి చేశారు. ఆశా రంగంలో జరిగిన అనేక పోరాటాల కు నాయ కత్వం వహించారు. నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి 56 రోజులు పోరాటం నిర్వహించారు. సీడబ్ల్యూసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి 71రోజుల సమ్మె నిర్వ హించారు. ప్రస్తుతం రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, నిమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్, నిమ్స్ సెక్యూరిటీ గార్డ్, అపోలో సింధూరి, అపోలో ఫైబర్ సింధూరి, డీఆర్‌డీఎల్ అపోలో హాస్పిటల్, తెలంగాణ టెక్స్ బుక్ ప్రెస్ యూనియన్లకు అధ్యక్షులుగా ఉన్నారు. 2024 నవంబర్ 30, డిసెంబర్ 1 తేదీల్లో జరిగి న పార్టీ నగర 23వ మహాసభల సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2025 జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగిన పార్టీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

'స్నేహ చికెన్ పరిశ్రమను మూసి వేయాలి'



- బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ భూ కబ్జాలు, జల దోపిడీతో దౌర్జన్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న స్నేహ చికెన్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్ నగర్, వనపర్తి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో కొన్నేండ్ల క్రితమే స్నేహ చికెన్ పౌల్ట్రీ పరిశ్రమను స్థాపించారని, చిన్నగా ప్రారంభమైన ఈ కంపెనీ ఇప్పుడు తన పరిధిని విస్తృతం చేసుకుందన్నారు. పెద్దమందడి మండలం వెల్టూ రు శివారులోని 22/1లో ప్రభుత్వ భూమిని స్నేహ చికెన్ పరిశ్రమ ఆక్రమించి, అక్కడ కొన్ని నిర్మాణాలు చేప ట్టిందని గతంలో ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసిన పట్టించు కోలేద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బీసీ పొలి టికల్ జేఏసీ ఫిర్యాదు మేరకు అధికారులు సర్వే నిర్వహి ంచి, రికార్డులు పరిశీలించిన తర్వాత వెల్టూరు శివారులోని సర్వే నెంబర్ 22/1లో 1.25 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని నిర్ధారించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని స్నేహ చికెన్ కంపెనీ ఎండీ రాంరెడ్డికి నోటీసులు జారీ చేశారన్నారు. గత ప్రజా ప్రతినిధుల అండదండలతో స్నేహ ఫార్మ్స్ యాజమాన్యం రెచ్చిపోయిందని, పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడుస్తూ స్నేహ ఫార్మ్స్ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు పొలాలలో వదలడంతో అవి అడ్డాకుల మండలం బలీదుపల్లి చెరువులో కలిసి అక్కడి నుండి పెద్దవాగులో కలుషితమై సరళసాగర్ మీదుగా రామన్ పాడు డ్యామ్‌లోకి వెళ్తున్నాయన్నారు. ప్రభుత్వ నిభందన లకు తూట్లు పొడుస్తూ ప్రజల జీవితాలలో చెలగాటమాడు తున్న స్నేహ కంపెనీని మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న గౌడ్, దేవర శివ, రామన్ గౌడ్, గౌతమ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- హైదరాబాద్ ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ సి.రమేష్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైదరాబాద్ ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ సి.రమేష్ అన్నారు. గురువారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో దర్బార్ హాల్ వద్ద నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థి నీ లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబం ధనలు పాటిస్తూ వ్యక్తి గత భద్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటిం చడం ద్వారా ప్రమాదాలు జరగకుండా వాహనాదారులు సహకరించాలన్నారు. పోలీస్ సిబ్బంది, రవాణా శాఖ సిబ్బంది వెళ్లి మోటార్ వాహనాల చట్టాల గురించి అవగాహన కల్పించడం కోసం ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. నేడు రోడ్డు భద్రత మాసో త్సవాల్లో భాగంగా ఉదయం నెక్లెస్ రోడ్డులో నడక నిర్వహిస్తున్నట్టు రవాణా శాఖ నాగోల్ మోటార్ వెకిల్ ఇన్‌స్పెక్టర్ శీతల్ చౌహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవి ద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, డాక్టర్ లోక పావని, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దీపికారావు, నాగోల్ రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శీతల్ చౌహన్, అనిత, కార్తీక్, అభిలాష్, ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జిందాబాద్ కల్చరల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

- ఆవిష్కరించిన ప్రముఖ సినీ నటుడు మాదాల రవి



నవతెలంగాణ-ముషీరాబాద్

గణతంత్ర దినోత్సవం వజ్రోత్సవాల సందర్భంగా హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న రవీంద్ర భారతి మెయిన్ హాల్‌లో కల్చరల్ ఫెస్టివల్ - 2025 జరగబోతుంది. ఈ కల్చరల్ ఫెస్టివల్ ప్రచార పోస్టర్‌ను ప్రముఖ సినీ నటుడు మాదాల రవి ఆవిష్కరించారు. ఈ ప్రచార పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రముఖ కళాకారులు కళారత్న మల్లం రమేష్, హైదరాబాద్ జిందాబాద్ నగర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ నటులు మాదాల రవి మాట్లాడుతూ హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో సమా జాన్ని కాపాడే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, సమా జంలో పేదలకు ఉపయోగపడే ఉచిత మెడికల్ క్యాంపుల ను నిర్వహించటం ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలతో పాటుగా హైదరాబా ద్ సంస్కృతిని చాటి చెప్పేలా కళారూపాలతో కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ జిం దాబాద్ సంస్థకు ఒక వైద్యునిగా వారి మెడికల్ క్యాంపులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ఏర్పడిన దగ్గర నుంచి ప్రతి సంవత్సరం కల్చరల్ ఫెస్ట్ నిర్వహణ ద్వారా అభ్యుదయ కళారూపాలను, హైదరాబాదు సంస్కృతి, సంప్రదాయాల ను ప్రదర్శిస్తుందని 2న జరిగే ఈ కల్చరల్ ఫెస్ట్‌లో కూడా అందరికీ విజ్ఞానాన్ని, వినోదాన్ని, గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను వివరించేలా కళారూపాలు ప్రదర్శిస్తామ న్నారు. హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె. వీరయ్య మాట్లాడుతూ కల్చరల్ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాల కళారూపాలను ప్రదర్శి స్తామని, ముఖ్య అతిథిగా పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, అనేకమంది ప్రముఖులు, పాల్గొంటారని, నగర వాసులం దరూ పెద్ద సంఖ్యలో హాజరై కల్చరల్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ నగర నాయకులు కళారత్న మల్లం రమేష్, పి.శ్రీనివాసరావు, మోహన్ నాయుడు, శివాజీ, సంగీత, హర్షిత, మాధవి, కె.రమేష్ పాల్గొన్నారు.



మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు ఎదెల్లి భాను ప్రకాష్, సత్యనారాయణ నివాళులర్పించారు.
నవతెలంగాణ-అంబర్‌పేట



నెహ్రూ జూ లాజికల్ పార్క్‌లో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళ్లు అర్పించిన క్యురేటర్ వసంత, తదితరులు..
నవతెలంగాణ - ధూల్‌పేట్

మోడీ ప్రభుత్వ కార్పొరేట్, ఫాసిస్టు విధానాలపై పోరాడుదాం

ఐఎఫ్‌టీయు జాతీయ ఉపాధ్యక్షులు బి. ప్రదీప్, రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

మోడీ ప్రభుత్వ కార్పొరేట్, ఫాసిస్టు విధానాలపై సమరశీల పోరాటాలతో తిప్పికొట్టాలని ఐఎఫ్‌టీయు జాతీయ ఉపాధ్యక్షులు బి. ప్రదీప్, రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు అరుణ అధ్యక్షతన హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా ఐఎఫ్‌టీయు విలీన సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1991లో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలను ప్రారంభించిందని దేశభక్తి జపం చేస్తూ ఏటా 2 కోట్ల ఉద్యో గాలు, మెకిన్ ఇండియా తదితర హామీలతో 2014లో అధికారంలోకి వచ్చిన ఆర్ఎస్ఎస్ ఆధీనంలోని మోడీ ప్రభుత్వం కోట్లాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిం చారని తెలిపారు. ప్రభుత్వ రంగంలో ఉన్న పరిశ్రమలను బడా కార్పోరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని వివరించారు. అనంతరం నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అరుణ, ప్రధాన కార్యదర్శిగా జి.అనురాధ, ఉపాధ్యక్షులుగా పి.శివ బాబు, మల్లయ్య పి రామ్ రెడ్డి, మంగ్ల, సహాయ కార్యదర్శులుగా యాద య్య, పద్మ, మణెమ్మ, శ్రీ శైలం, కోశాధికారి కుమార్‌తో పాటు 16 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, రాంరెడ్డి, యాదయ్య మంగ్ల, పద్మ, మణెమ్మ, శ్రీశైలం, కుమార్ తదతరులు పాల్గొన్నారు.

11
నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శుక్రవారం | జనవరి 31, 2025 | www.navatelangana.com

సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గురువారం అల్లాపూర్ డివిజన్‌కు సంభందించిన ముస్లింలు అందరూ, స్థానికంగా ఉన్న స్మశాన వాటికలు ఇతర పలు సమస్యలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే శనివారం రోజు అల్లాపూర్ డివిజన్ శ్మశాన వాటికలు పరిశీలిస్తాం అని తెలియజేశారు.

కలెక్టరేట్‌లో గాంధీ వర్ధంతి



నవతెలంగాన-సీటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశం మందిరంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి, అమర వీరుల స్మారక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా అధికారులు, సిబ్బంది రెండు నిముషాల పాటు అమర వీరులకు మౌనం పాటించారు.

రహదారి భద్రత కార్యక్రమాలకు శ్రీకారం



నవతెలంగాన-సీటీబ్యూరో

జనవరి మాసాన్ని జాతీయ రోడ్డు భద్రత మాసంగా ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రయివేటు లిమిటెడ్ పాటించింది. భారతదేశంలోనే రహదారులు, జాతీయ రహదారుల రంగంలో అతి పెద్ద ప్రైవేటు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టుగా పేరొందిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారి స్పెషల్ పర్పస్ వెహికిల్‌గా ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే వ్యవహరిస్తోంది. నానక్‌రాంగూడ టోల్ ప్లాజా వద్ద కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత మాసం ముగింపు కార్యక్రమానికి హెచ్‌జీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రయాణంలో రహదారి భద్రతా నియమాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. లేన్ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని, అలాగే కార్లు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్టులు పెట్టుకోవాలని ఆమె సూచించారు. లేన్ క్రమశిక్షణను పాటించడం అంతరాయాలను నివారించడానికి సహాయపడుతుందని, ఓవర్ టేకింగ్, హై-స్పీడ్ ప్రయాణాన్ని సురక్షితంగా మారుస్తుందని, డ్రైవర్లందరూ ఈ నిబంధనల గురించి పూర్తిగా తెలుసుకోవడం వల్ల అన్ని రహదారులు సురక్షితంగా మారుతాయని ఆమె వివరించారు. పోలీస్ డీప్యూటీ కమిషనర్ శ్రీ సాయి మనోహర్ మాట్లాడుతూ "రోడ్డు భద్రత అందరి బాధ్యత. ఐ ఆర్ బి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే నిర్వహించిన నేషనల్ రోడ్ సేఫ్టీ మంత్ వంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. లేన్ డిసిప్లిన్ పాటించడం, సీటుబెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించి రహదారులను మరింత భద్రంగా మార్చుకోవచ్చు" అని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బాలాజీ మాట్లాడుతూ "రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు మోటారిస్టులలో క్రమశిక్షణను పెంపొందించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఈ క్రమంలో ఐఆర్‌బి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే చేపట్టిన ప్రయత్నాలను అభినందిస్తున్నాం. డ్రైవర్లకు అవగాహన కల్పించడం ద్వారా బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను ప్రోత్సహించి, రహదారులను మరింత సురక్షితంగా మార్చుకోవచ్చు" అని తెలిపారు. నార్సింగ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

స్పర్శ కుష్టు రోగ అవగాహన కార్యక్రమం..



నవతెలంగాన-సీటీబ్యూరో

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ అండ్ కుష్టు, ఎన్‌వీబీడీసీపీ జిల్లా ప్రో గ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి సమక్షంలో స్పర్శ కుష్టు రోగ అవగాహన కార్యక్రమం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం "ఇకపై, కుష్టు రోగ బాధితులెవరు వెనుకబడరాదు - అవగాహన పెంచుదాం, అపోహలను తొలగించుదాం" అనే థీమ్‌తో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ వరకు రెండు వారాల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా.. చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమి షాల మౌనం పాటించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాథస్వామి మాట్లాడుతూ ఈ రెండు వారాల ప్రచారం ద్వారా ప్రజలకు కుష్టు రో గం గురించి అవగాహన పెంచడం, ముందస్తు గుర్తింపుతో చికిత్స అందించడం ద్వారా ప్రతికూల పరిణామాలను నివారించడం ప్రధాన లక్ష్యమని చెప్పారు. కుష్టు రోగానికి సంబంధించి ఉన్న అపో హలను తొలగించేందుకు సమాజంలో అవగాహన పెంచడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటా ప్రచారంలో చురుకుగా పాల్గొని ప్రజలకు కుష్టు రోగ లక్షణాల గురించి వివరించాలని సూచించారు. ఇందులో భాగంగా తెల్ల మచ్చల గుర్తింపుపై ప్రత్యేక నిఘా పెట్టే కార్య క్రమాన్ని కూడా అమలు చేయనున్నట్టు తెలిపారు. అన్ని మండల స్థాయిల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వ హించాలని, జిల్లాను కుష్టు రోగ విముక్త జిల్లాగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని వైద్య ఆరో గ్య శాఖ సిబ్బందిని కోరారు. కుష్టు రోగాన్ని తొందరగా గుర్తించడం, చికిత్స అందించడంద్వారా అంగవై కల్యాలను నివారించవచ్చని తెలిపారు. గ్రేడ్-2 దివ్యాంగత కలగకుండా ముందుగానే కేసులను గుర్తించి తగిన చికిత్స అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కుష్టు రోగ నిర్మూలన కోసం అవసరమైన అన్ని ఔషధాలు, వైద్య సదు పాయాలను ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి వైద్య సిబ్బంది ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం నియమితంగా చికిత్స తీసుకుంటున్న ఒక రోగిని సన్మాని ంచి, కుష్టు రోగంపై అపోహలను తొలగించే ప్రతి జ్ఞను కార్యక్రమంలో పాల్గొన్న అందరితో చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సత్యవతి, శోభా రాణి, సరస్వతి, గీత, పద్మావతి, మల్లీశ్వరి, మైకేల్, వెంకట్ నరేశ్, శౌషీల్య, సింహ రాజు, బోగే ప్రకాష్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



- బాపూజీ పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహనీయుల అడుగుజాడల్లో నడిచినప్పుడే వారికి నిజమైన నివాళులర్పించిన వారమవుతామని బాపూజీ ఉన్నత పాఠశాల చైర్మెన్ కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు అన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని జగద్గిరిగుట్ట పరిధి, వెంకటేశ్వర నగర్ లోని బాపూజీ పాఠశాలలో చిన్నారి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం కోసం పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గాలను అనుసరించాలి : శ్రీ.ఎస్.పి.ఆర్ గ్లోబల్ పాఠశాల చైర్మెన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి..

స్వాతంత్రోద్యమంలో కీలక భూమిక పోషించిన జాతిపిత మహాత్మ గాంధీజీ చూపిన మార్గాలను నేటి బాలలు, యువత అనుసరించాలని శ్రీ.ఎస్.పి.ఆర్ గ్లోబల్ పాఠశాల సొంటి రెడ్డి పున్నారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస మార్గంలో నడుస్తూ సత్యాన్ని పలకాలని విద్యార్థులకు హిత బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సొంటిరెడ్డి చైతన్య పునారెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ జోన్ డివిజన్ పరిధిలోని జింకలవాడలో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైన ఘటన గురువారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాలానగర్ సీఐ నర్సింహా రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జింకలవాడ పరిధిలో దాదాపు 45 ఏండ్ల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని పరిసరాలను పరిశీలించారు. అతని వద్ద ఊరు, పేరుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం సాంకేతిక ఆధారాలను సేకరించి.. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారన్నారు. బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. తలపై బండరాయితో కొట్టి చంపినట్టు ఆనవాళ్లు, ముఖంపై రక్తపు గాయాలు ఉన్నాయన్నారు. ఎక్కడో హతమార్చి ఇక్కడ పడేసినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఎవరికైనా మృతుని ఆచూకీ తెలిస్తే బాలానగర్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ నర్సింహా రాజు కోరారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును బలోపేతం చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యూసుఫ్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

భవన నిర్మాణ కార్మికుల మొదటి మహాసభ పొట్లూరి నాగేశ్వరరావు భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎండీయూసుఫ్ హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కోసం ఏఐటీయూసీ, సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించడం వల్ల సీపీఐ నాయకులు ఇంద్రజిత్ గుప్తా, చతురనంద్ మిశ్రాలు గుజ్రాల్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రులుగా ఉన్న సమయంలో భవననిర్మాణ సంక్షేమ సంఘం బోర్డును తీసుకోచ్చారు. నేడు కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులకు రావాల్సినటువంటి బీమా పథకాలు రాకుండా పోతున్నాయన్నారు. అదేవిధంగా గతంలో భవననిర్మాణ కార్మికులను వేలిముద్రలు లేకుండానే గుర్తింపు కార్డులు ఇచ్చేవారని కానీ, నేడు వేలిముద్రలు ఖచ్చితమని నిబంధన పెట్టడం వల్ల అనేక మంది భవన నిర్మాణ కార్మికులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అటు పనులు చేయకుండా ఇటు కార్డులు పొందకుండా ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే వేలిముద్రలు అనే నిబంధనను తొలగించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికుల కోసం చట్టం రూపొందించడానికి, చట్టాలు భవననిర్మాణ కార్మికులు అందడానికైనా పోరాటం చేసేది కేవలం సీపీఐ, ఏఐటీయూసీ ఎర్రజెండాలు మాత్రమే అన్నారు. నేడు అనేకమంది నాయకులు వ్యక్తిగతంగా సంఘాలు పెట్టుకొని వ్యక్తిగతంగా లాభం పొందడానికే ఉన్నారు కానీ, వాళ్ల ఉద్దేశంలో వాళ్ళ నాయకులుగా ఉండి, మిగతా అందరూ కార్మికులుగా ఉండడమే వాళ్లకు కావాలని తెలిపారు. కానీ సీపీఐ, ఏఐటీయూసీ మాత్రం కార్మికులే దేశాన్ని ఏలాలని కోరేటువంటి పార్టీలు కాబట్టి భవనిర్మాణ కార్మికులందరూ ఏఐటీయూసీ, సీపీఐ జెండా కింద పనిచేస్తూ ఈ దేశంలో కార్మికుల రాజ్యాన్ని తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరిగింది. భవననిర్మాణ కార్మిక సంఘానికి గౌరవ అధ్యక్షులుగా కామ్రేడ్ ఉమామహేష్, అధ్యక్షులుగా హరినాథ్, కార్యదర్శిగా సాయిలు, ఉపాధ్యక్షులుగా బాలాజీ, సాయం కార్యదర్శిగా ఓ. రాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తౌరియా, కోశాధికారిగా ఆగం రెడ్డిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు స్వామి అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలాజీ, పరమేశ్వర్ భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు సామేల్, రవి, యాదగిరి, శివారెడ్డి, ప్రవీణ్ స్వామి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా..?



- కార్పొరేటర్ మాధవరం రోజదేవి రంగారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి, సమస్యలపై మేయర్‌ను ప్రశ్నించినందుకు, బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్టు చేయించి.. రాంగోపాల్ పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మాట్లాడుతూ మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీఆర్ఎస్ పార్టీ ద్వారా ఎన్నికై, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. ఈరోజు మమ్మల్ని సస్పెండ్ చేయడం ఆమెకు తగదని.. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత.. మీరు మేయర్‌గా పార్టీ మారి, ఈ 14 నెలల కాలంలో జీహెచ్ఎంసీ అభివృద్ధి గురించి ఎన్ని రూపాయలు మంజూరు చేశారని అడిగారు. గత 14 నెలల కాలంలో స్ట్రీట్ లైట్స్ రాకపోవడం, శానిటేషన్ సక్రమంగా పని చేయకపోవడం, కొత్తగా అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఇలాంటి దారుణ పరిస్థితులు, జీహెచ్ఎంసీ ఏర్పడినప్పటి నుంచి ఎప్పుడు లేవని బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జీహెచ్ఎంసీకి శానిటేషన్ విషయంలో ఎన్నో అవార్డులు వచ్చాయన్నారు. నాళాలు, వంతెనలు గాని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు ఇప్పటికైనా సమస్యలపై చర్చించి.. బడ్జెట్ మీటింగ్ పెట్టాలని అడిగినందుకు సస్పెండ్ చేసి అరెస్టు చేయడం, కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు.

కేపీహెచ్‌బీ: పాలన చేతగాని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తమను దౌర్జన్యంగా అరెస్ట్ చేసిందని అల్లాపూర్ బీఆర్ఎస్ కార్పొరేటర్ సబిహా గౌసొద్దీన్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్ఎంసీ సమావేశంలో తమ గొంతు నొక్కారని ఆరోపించారు. కౌన్సిల్ సమావేశం నుంచి తమను బలవంతంగా తీసుకురావడం దారుణమన్నారు. 10 మంది కార్పొరేటర్ల బలం లేని విజయ లక్ష్మికి మేయర్‌గా ఉండే అర్హత లేదన్నారు. ఆమె వెంటనే రాజీనామా చేయాల ని సబిహా గౌసొద్దీన్ డిమాండ్ చేశారు.



నూతన కమిషనర్‌గా వెంకటేశ్వర్ నాయక్



నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ కార్యాలయానికి నూతన మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.వెంకట్రావు నాయక్ బాధ్యతలు చేపట్టారు. గతంలో భూదాన్ పోచంపల్లి కార్యాలయం నుంచి బదిలీ పై దుండిగల్‌కు నియమితులయ్యారు. ఇప్పటివరకు దుండిగల్ మున్సిపాలిటీలో విధులు నిర్వహించిన కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ రావు జీహెచ్ఎంసీకి బదిలీ అయ్యారు. నూతన బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌ను కే.సత్యనారాయణ రావు, స్వాగతించిశాలువాతో సన్మానించారు.

పేదలకు సీఎం సహాయ నిధి వరం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన వై.సుశాంత్‌కి, నానమ్మ సుగణ సీనియర్ బీజేపీ నాయకురాలికి మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా భాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బండి రమేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, ఎక్స్ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ పుష్ప రెడ్డి, డివి జన్ అధ్యక్షులు కుక్కల రమేష్, సీనియర్ నాయకులు మగ్దూం, మార్కెట్ కమి టీ డైరెక్టర్ ప్రకాష్, సుధాకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ఎండీ విజయలక్ష్మి అరెస్ట్





నవతెలంగాణ-దుండిగల్

అక్రమ నిర్మాణాలపై ఆరోపణలు ఎదుర్కొం టు న్న లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ఎండీ గుర్రం విజయలక్ష్మిని దుండిగల్ పోలీసులు గురువారం శంషా బాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. ప్రభు త్వ భూమిలో విల్లాలు కట్టి అమ్మారని ఆమెపై అభియో గాలు ఉన్నాయి. వివరాల్లోకెళ్తే.. మేడ్చల్ జిల్లా మల్లంపేటలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి విజయలక్ష్మి విల్లాలు నిర్మించారు. లక్ష్మీ శ్రీనివాస నిర్మాణం పేరుతో మల్లంపేట సర్వేనెంబర్ 170/3, 170/4, 170/5 లో గ్రూప్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కింద సుమారు 325 విల్లాలు స్విమ్మింగ్ పూల్, యోగా రూమ్, ఇండోర్, అవుట్‌డోర్ వంటి సౌకర్యాలతో నిర్మించారు. నిర్మించిన విల్లా ఒక్కో దానికి కోట్ల రూపాయల్లో వసూలు చేసినట్టు సమాచారం. అయితే ప్రభుత్వ భూమిలో 8 విల్లాలను నిర్మించినట్లు తేలడంతో గతేడాది హైడ్రా ఆ విల్లాలను కూల్చేసింది. దీనితో విల్లాలు కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు ఆమెను పోలీసులు అరెస్టు చేసి దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గాంధీనగర్ చెత్తకుండీలో పేలుడు..



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చెత్తకుండీలో పేలుడు సంభవించిన ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంతంలో చోటుచేసుకుంది. సీఐ నరసింహ రాజు తెలిపిన వివరాల ప్రకారం గురువారం పారిశుద్ధ విధులు నిర్వహిస్తున్న ఈ ఘటనలో చెత్త ఎత్తుతున్న జీహెచ్ఎంసీ మహిళా కార్మికురాలి కాలి వేలుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి బాలానగర్ పోలీసులు చేరుకున్నారు. బాధితురాలిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఫిబ్రవరి 2న ముదిరాజ్ సంఘం సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి నెల 2న ఆదివారం చింతల్ పరిధి హెచ్ఎంటీ కాలనీలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షులు సారా శంకర్ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలు సహకరించిన కమిటీ సభ్యులకు, కుల బంధువులకు వారు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నుకోవడంతోపాటు మహిళా సంఘం కమిటీ, యూత్ సంఘం కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ, సభ్యులు పాటించాల్సిన నియమనిబంధనలపై చర్చ కొనసాగుతుందన్నారు. ఈ సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో వార్షికోత్సవం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 - జీడిమెట్ల డివిజన్ హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు, బంగారం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ... ఎంతో శక్తివంతమైన ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని, అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ రాఘవేంద్ర వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కుంట సిద్ధిరాములు,



ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి, కోశాధికారి సిహెచ్. రాజు, గౌరవాధ్యక్షులు ఐ. ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి రాజు, ఆలయ కమిటీ చైర్మెన్ టి. రాజేశ్వర్, కోశాధికారి డి. బాల్ రాజ్, సంక్షేమ సంఘం మరియు దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణకు సన్మానం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రముఖ భారతీయ పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణని గురువారం జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో యూనివర్సిటీ రెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.వి.నరసింహ రెడ్డి, డైరెక్టర్లు డా.వసుమతి, డా.మాధవి కుమారి, డా.సుష్మా, డా. అరుణకూమారి, డా. శోభారాణి, డా.గిరిధర్ డా.సాహు చత్రపతిలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాలవత్ పూర్ణ మాట్లాడుతూ పర్వతారోహణ, ట్రెక్కింగ్, అడ్వెంచర్ చేయాలనుకునే ఔత్సాహిక విద్యార్థిని, విద్యార్థులకు తానే స్వయంగా శిక్షణ ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, యూనివర్సిటీ పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా..



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో, బస్తీల్లో పెండింగ్‌లో న్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని స్థానిక కార్పొరేటర్ గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. గురువారం డివిజన్ పరిధి ఉషోదయ కాలనీలోని పార్కులో బోరు పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడ రాజీ పడకుండా ప్రజల సహాయ సహకారాలతో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పేరారెడ్డి, రవికాంత్, కాలనీవాసులు తదితర నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడ్‌పల్లికి చెందిన రాజమ్మ అనే మహిళ అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఉండడం ఎమ్మెల్యే శ్రీ గణేష్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు మంజూరు చేయించారు. ఈ మేరకు గురువారం చెక్కును వారి బంధువులకు అందజేశారు.

జాన్ వెస్లీకి ఓయూ విద్యార్థుల శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఓయూ

సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా, సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం ఎంబి భవన్‌లో గురువారం ఓయు విద్యార్థి నాయకులు ఆర్ఎల్ మూర్తి, వలిగొండ నరసింహ, హబీబ్ ఖాద్రి, నకేరేకంటి నాగరాజు మాదిగ, సీఐటీయూ నాయకులు మహేందర్, సీనియర్ నాయకులు మస్కు రమేష్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు

గోర్ బోలిని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలి



- మాజీ మంత్రి రవీంద్రనాయాక్

నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాల భాష గోర్ బోలిని రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని మాజీ మంత్రి రవీంద్ర నాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ (ఏబీఎస్ఎస్) 72వ వ్యవస్థాపక దినోత్సవం అని ఘనంగా నిర్వహించారు. జాతీయ అధ్యక్షులు అమర్ సింగ్ తిలావత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రవీంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బంజారాల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడం బంజారాల అభివృద్ధికి బాటలు వేసేందుకే సంఘం ఏర్పడిందని అన్నారు. ఎప్పటికప్పుడు బంజారా సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సంగం కృషి చేసిందని తెలిపారు. కాగా ఇప్పటికీ అనేక సమస్యలతో బంజారాలు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఒకే జాబితాలో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి 78 ఏండ్లు పూర్తయినా బంజారాల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. బంజారాలకు ఇచ్చిన హామీద్ మేరకు దేశ రాజధాని ఢిల్లీలో గాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో గాని 150 ఎకరాల భూమిని ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో కూడా తమ సంఘం సామాజిక వర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాదవత్ తారాచంద్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, రామ్ రావ్ మెహద్ భాత్యా నాయక్, బోడాఫోన్యా నాయక్, డాక్టర్ రాథోడ్, బీకే నాయక్, ఇస్లావత్ నాయక్, ధనుంజయ్ రమేష్ నాయక్‌లు పాల్గొన్నారు.

కార్డియా అరెస్టులు ఎంతో ప్రమాదకరం

- ప్రతి క్షణం గోల్డెన్ హ.వేరే
- సీపీఆర్‌తో పునరుద్దరించే అవకాశం
- సీపీఆర్‌పై పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

వయస్సుతో సంబంధంలేకుండా కార్డియాక్ అరెస్ట్ (గుండె పోటులు) వస్తున్నాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. క్షణాలల్లో వచ్చే హార్ట్‌టాక్‌లను గుర్తించకపోవడం, అధికసంఖ్యలో సీపీఆర్‌పై అవగాహన లేకపోవడంతో ఎంతో మంది తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని, సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తే ప్రమాదం నుంచి తప్పించే అవకాశాలుంటాయని సీపీ అభిప్రాయపడ్డారు. గురువారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో సీపీఆర్ (హృదయ శ్వసకోశ పునరుజ్జీవన చర్య) పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సీపీఆర్ అనేది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు ఇది చాల కీలకమైన చర్యని సీపీ తెలిపారు. అమెరికా, జపాన్, సింగపూర్‌తోపాటు యూరోపియన్ దేశాల వంటి ఇతర దేశాలు తమ విద్యా విధానంలో సీపీఆర్ బోధించడాన్ని తప్పనిసరి చేశాయన్నారు. సీపీఆర్‌పై అవగాహన లేకపోవడంతో మరణాలు రేటు పెరుగుతోందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థల లెక్కల ప్రకారం గుండె ఆగిపోవడం వల్లా ప్రపంచంలో ప్రతిఏటా దాదాపు 5.8కోట్ల మంది మృతిచెందుతున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీపీఆర్‌పై నాలుగు రోజుల శిక్షణ అందిస్తున్నామని, 1409 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొంటారన్నారు. 15 బ్యాంచ్‌లుగా ఏర్పాటుచేశామని, వారికి మైత్రీ ఆస్పత్రి ఆధ్వర్యంలో 90 నిమిషాలపాటు అవగాహన అందిస్తారన్నారు. నిది పోలీస్ కుటుంబాలతోపాటు సామాన్య ప్రజానీకానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగా శరీరంలో ఆగిపోయిన రక్తం, ఆక్సిజన్ సరఫరాను సీపీఆర్ చేయడంతో పునరుద్ధరించవచ్చన్నారు. సీపీఆర్‌లో గుండె మళ్లీ కొట్టుకోవడం మొదలవుతుందన్నారు. సీపీఆర్‌లో చేయడంలో ఏదైనా ఆలస్యం అయితే మొదడుకు కోలుకోలేని విధంగా నష్టం జరుగుతుందన్నారు. ఎవరైనా గుండెపోటుతో కిందపడిపోతే ప్రతి క్షణం గోల్డెన్ అవేరేనని, సీపీఆర్ చేయడానికి వెనుకాడొద్దన్నారు. సీపీఆర్‌తోపాటు అత్యవసర వైద్య సహాయం కోసం కాల్ చేయడం మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీపీతోపాటు పలువురు పోలీస్ అధికారులు సీపీఆర్ ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రక్షిత కృష్ణ మూర్తి, సీటీసీ ప్రిన్సిపల్ అనుప్ జైన్‌కుమార్‌తోపాటు మైత్రీ ఆస్పత్రి డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీహెచ్ఎంసీ సర్కిల్ 19 పరిధిలోని, బోరబండలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, ఏఎంఓహెచ్ డా.సల్మాన్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ పరిశీలించారు. నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మాల, మాదిగ ఉద్యమాన్ని నాగ, కుకీ కొట్లాటగా మార్చే కుట్ర

- మాదిగ జేపీసీ వ్యవస్థాపకులు డా.పిడమర్తి రవి



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో వర్గీకరణ ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించే విధంగా గడ్డం వివేక్, మందకృష్ణ మాదిగ ప్రయత్నిస్తున్నారని ఈ ఉద్యమాన్ని మరో నాగ, కుకీ కొట్లాటగా మారనుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, మాదిగ జేపీసీ వ్యవస్థాపకులు డా. పిడమర్తి రవి అన్నారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో మాదిగ విద్యార్థి యువగర్జన గోడ పత్రిక విడుదల కార్యక్రమంలో అయిన ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ చేయడం మందకృష్ణ మాదిగకు ఇష్టం లేదని అందుకే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. గడ్డం వివేక్, మందకృష్ణ మాదిగ స్వార్థ ఉద్యమాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో నాగ, కుకీ గొడవ వలె మరో వర్గ భేదాలు వచ్చి రాష్ట్రం అగ్నిగుండంగా మారే అవకాశం ఉందని తెలిపారు. గడ్డం వివేక్, మందకృష్ణ మాదిగ రెచ్చగొట్టే ప్రసంగాల వల్ల తెలంగాణ రాష్ట్రంలోని మాల, మాదిగలు అశాంతియుతంగా ఉంటారని ఎలాంటి విభేదాలకు వెళ్లకుండా ఉన్నారని అన్నారు. వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టకుండా మాదిగలను అణచివేసిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన పద్మశ్రీ అవార్డును కృష్ణ మాదిగ వెంటనే తిరస్కరించాలని అన్నారు. లక్ష డప్పులు కార్యక్రమం పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించాలని పబ్లిక్ ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఈ కార్యక్రమం పెట్టడం వల్ల జరగరానిది జరిగితే దానికి నైతిక బాధ్యత మందకృష్ణ మాదిగ వహించాలని అన్నారు. ఫిబ్రవరి రెండున ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో మాదిగ విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థి యువగర్జన బహిరంగ సభకు వేలాదిగా మాదిగలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు డా. మల్లేశం, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తిరుపతి, తెలంగాణ దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షులు డా.బొమ్మెర స్టాలిన్, డా. నంద్రు నరసింహ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మారపాక సాయిలు, తెలంగాణ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రింగు రాంబాబు, మాదిగ జేపీసీ ఓయూ అధ్యక్షుల జోగు గణేష్, శివ, దేవరకొండ నరేష్, కొమ్ము ప్రవీణ్, మీసాల మహేష్, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కాదాసీ రాహుల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌లను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

అక్రమంగా బీఆర్ఎస్ కార్పొరేటర్‌లను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశంలో సమస్యలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్‌లను అరెస్ట్ చేసి రాంగోపాల్ పేట పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పోలీస్ స్టేషన్‌కు చేరుకొని కార్పొరేటర్‌లు నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశాలలో ప్రశ్నించారనే కారణంగానే మా కార్పొరేటర్‌లను అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తమ కార్పొరేటర్‌లను బయటకు పంపి బడ్జెట్‌ను ఆమోదించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఎలాంటి చర్చ జరగకుండా బడ్జెట్ ఆమోదించడం సరికాదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టి హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారిందని విమర్శించారు. గత ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధులలో ఎంత మేరకు ఖర్చు చేశారో చర్చించాలని ప్రశ్నించినందుకే కార్పొరేటర్‌లను అరెస్ట్ చేశారన ఆరోపించారు. బడ్జెట్ సమావేశ మందిరంలో మార్షల్స్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్‌లు వ్యవహరించిన విధానం సరైనది కాదన్నారు. భయానక వాతావరణం కల్పించే ప్రయత్నాలు చేశారని, మేయర్ కార్పొరేటర్‌ల పట్ల ఎంతో దురుసుగా మాట్లాడారని, బెదిరించే ప్రయత్నం చేశారని కార్పొరేటర్‌లు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో జీహెచ్ఎంసీని ఎంతో హుందాగా నిర్వహించామని చెప్పారు. నగరంలోని ప్రజలు సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా వ్యవహరిస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిపై ప్రజాస్వామ్య యుతంగా ప్రజాక్షేత్రంలో పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరి వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, శేఖర్, ఆరీఫ్, కిషోర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిపై అసత్య ప్రచారాలు మానుకోండి

- వీఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ నందకిషోర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

వీఆర్ మల్టీస్పెషలిటీ హాస్పిటల్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని వీఆర్ హాస్పిటల్ ఎండీ నందకిశోర్ అన్నారు. గురువారం హాస్పిటల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోయిన్ పల్లి ప్రాంతంలో ఉండే వారంతా పేద ప్రజలు, దిగువ మధ్య తరగతికి చెందిన వారేనని తెలిపారు. గత ఎనిమిదేండ్లుగా సేవా దృక్పథంతో వైద్యం అందిస్తు ప్రజల మన్ననలను పొందుతున్నట్లు పేర్కొన్నారు. గత శుక్రవారం అర్ధరాత్రి ఆరోగ్యం క్షీణించి విషమ పరిస్థితుల్లో ఉన్న మధుసూదన్ గౌడ్ అనే వ్యక్తిని హాస్పిటల్‌లో కుటుంబ సభ్యులు చేర్చారని తెలిపారు. అతడు వీఆర్ హాస్పిటల్‌కు తరచుగా వచ్చే వ్యక్తి అని వారి ఆర్థిక పరిస్తితి తెలిసి కేవలం 4వేలు తీసుకొని చికిత్స ప్రారంభించినట్టు నందకిషోర్ పేర్కొన్నారు. ఈసీజీ తీసి గుండె పని తీరు అసాధారణ స్థితిలో ఉన్నట్టు గుర్తించి, పెద్దాస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించాలని అతడి భార్యకు తెలిపినట్లు తెలిపారు. కాగా మృతుడి భార్య కూతురు తమ దగ్గర అన్ని డబ్బులు లేవని, ఇక్కడే ఉండి డబ్బుల కోసం చాలా మందికి ఫోన్ చేశారని ఎవరూ కూడా సహాయం చేయడానికి ముందుకు రాలేదని, అంతా కూడా సీసీ కెమెరాలలో రికార్డ్ అయి ఉన్నాయని వివరించారు. కాని అతడు ఉదయం 10గంటల సమయంలో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించి, విషయం కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు మృతదేహాన్ని తీసుకు వెళ్లిపోయారని చెప్పారు. రెండు గంటల అనంతరం ఒక వ్యక్తి డబ్బులు ఆశించి మృతుడి కుటుంబ సభ్యులను రెచ్చగొట్టి హాస్పిటల్ పైకి ఎగధోయడం జరిగిందని అన్నారు. ఈ ప్రత్యక్ష సాక్షులు చెప్పడం కాకుండా, అదే వ్యక్తి తనకు ఫోన్ చేసి బెదిరించినట్టు వెల్లడించారు. వారిచే డీఎంహెచ్ఓకు, పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయించాడని తెలిపారు. ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు కూడా వచ్చారని, తమ దగ్గర ఉన్న ఆధారాలన్నీ వారికి ఇచ్చామన్నారు. 2017లోనే కేంద్ర ప్రభుత్వం వారిని కూడా వైద్యులుగా పరిగణించాలని, అనుభవజ్ఞుడైన వైద్యుడి పర్యవేక్షణలో వైద్యం అందించవచ్చని ఆదేశాలునిచ్చిందని వివరించారు. ఈ హాస్పిటల్‌లోని వైద్యులంతా కూడా రాష్ట్ర ప్రభుత్వం తరపున గుర్తింపు పొందినవారేనని, కేవలం అటువంటి వారిచే మాత్రమే వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఇది కార్పోరేట్ హాస్పిటల్ కాకపోయినా అదే స్థాయిలో తక్కువ ధరలకే నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఎవరూ కూడా అసత్య ప్రచారాలను నమ్మరని ధీమా వ్యక్తం చేశారు.

ఓయూలో బంజారా సేవా సంఘ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట సంఘ్ విద్యార్థులు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ వ్యవస్థాపకులు వసంతరావు ఫుల్ సింగ్ నాయక్ ఈ సంఘాన్ని స్థాపించి మహారాష్ట్రలో ముఖ్యమంత్రిగా పదేండ్లు పరిపాలించాడ న్నారు. భారత దేశంలోని బంజారాలం దరినీ ఏకతాటి మీదికి తీసుకోరావడానికి ఒక సంఘం అవసరమని ఆనాడే వసంతరావు ఫుల్ సింగ్ నాయక్ గ్రహించి సంఘం స్థాపించడం గొప్ప విషయమని రవీందర్ నాయక్ వారి సేవలను కొనియాడారు. ప్రస్తుత జాతీయ అధ్యక్షులు శంకర్ పవర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సభావట్ రాములు నాయక్ మొత్తం దేశంలో ఉన్న బంజారాలందరినీ ఏకతాటి మీదికి తీసుకురావడానికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఓయూ విద్యార్థులు నిరుద్యోగులు యావత్ తెలంగాణ బంజారా ప్రజలందరూ కూడా వారి మార్గంలో మనమందరం కూడా నడవవలసిన అవసరం ఉందని వారి ఆశయ సాధనకు మన యొక్క అభివృద్ధికి మనమందరం కూడా ఒకే సంఘం, ఒకే జాతి, ఒకే మార్గం అనుసరించాలని రవీందర్ నాయక్ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాయక్, నాగా నాయక్, భాస్కర్ నాయక్, వినోద్ నాయక్, తెలంగాణ, ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మెన్ మాందాల భాస్కర్, రీసెర్చ్ స్కాలర్స్ సునీల్ శెట్టి, ఉదయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్లు అరెస్ట్



నవతెలంగాణ-బంజారాహిల్స్

బీఆర్ఎస్ భవన్‌లో మహాత్మ గాంధీ వర్ధంతి వేడుకల అనంతరం జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశంలో ప్రశ్నించినందుకు ఖైరతాబాద్ నియోజకవ ర్గంలోని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, వెంకటేశ్వర నగర్ డివిజన్ కాలనీ కార్పొరేటర్ మన్నే కవితా రెడ్డి, బీఆర్ఎస్ నాయకులనూ అరెస్టు చేసి రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ క్రమంలో కార్పొరేటర్లు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టును ఖండిస్తూనమన్నారు. నియంత పాలన కొన సాగిస్తున్న ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వం ఎలా అవుతుందో సమాధానం చెప్పాలన్నారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మురుగు నీటి పైపులైన్ పనులు చేపట్టాలి



- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ డివిజన్‌లోని నవనిర్మాణ నగర్‌లో ఉన్న సీఎం వర్కర్స్ క్వాటర్స్ వద్ద వాటర్ వార్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులుతో కలిసి బుధవారం స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సమస్యల పరిష్కారానికి మార్గం కోసం పర్యటించారు. అనంతరం కార్పొరేటర్ అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో ప్రస్తుతం డ్రయినేజీ వ్యవస్థ బాలేదని, డ్రయినేజీ వాటర్ నిండిపోయి నిరంతరం రహదారులపై ప్రవహిస్తూ దుర్గంధాన్నీ వెదజల్లుతుందన్ని వెంటనే నూతన డ్రయినేజీ పైపు లైన్ నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరారు. సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సివరేజ్ పైపు లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు మేనేజర్ రాంబాబు, సివరేజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వాటర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, స్థానిక ప్రజలు శ్రీనివాస్, మూర్తి, వెంకటేష్, జ్ఞానేష్, పండు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం అభినందనీయం



- ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫ్రీడం సంస్థ ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని ప్రముఖ నటుడు రచయిత తనికెళ్ల భరణి అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ఫ్రీడం సంస్థ ఇటీవల నిర్వహించిన బంపర్ డ్రాలో ఎంపికైన విజేతలకు బంగారు నాణాలను జెమినీ ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డిలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా భరణి మాట్లాడుతూ.. ప్రత్యేక ప్రాసెసింగ్ విధానంతో నాణ్యమైన వంట నూనెలను ఫ్రీడం సంస్థ అందిస్తుందని చెప్పారు. గత ఏడాది వినియోదారులకు ఇచ్చిన హామీ మేరకు ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్‌ను సమర్థవంతంగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి నమ్మకాన్ని నిలబెట్టుకుందని అన్నారు. వైస్ ప్రెసిడెంట్, జెమినీ ఎడిబుల్స్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు వినియోగదారుల నమ్మకన్నీ చోరగుణాలనే లక్ష్యంతో తాము గతంలోనే అనేక బహుమతులను ఉదాహరణకి కార్లు, ద్విచక్ర వాహనాలతో పాటు వివిధ రకాల బహుమతులు అందించామన్నారు. ఎక్కడా నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమాజ సేవలో సైతం తాము భాగస్వాములమవుతూ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.



సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా సికింద్రాబాద్‌లోని ఎంజీ రోడ్‌లో గల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాకులర్పించారు.
నవతెలంగాణ-బేగంపేట్



మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం బోరబండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బోరబండ కార్పొరేటర్, నగర మాజీ డిప్యూటీ మేయర్ బాబా పసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా ఆయన చిత్ర పఠానికి నివాళులు అర్పించారు.
నవతెలంగాణ-జూబ్లీహిల్స్



వెంగళరావునగర్ యూసుఫ్ గూడా డివిజన్ల కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్ కుమార్ పటేల్ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పించారు. పత్రాలలో వారి ఆవేదనను వివరిస్తూ, మీ అడుగుజాడల్లో స్వరాష్ట్రాన్ని సాధించి, మీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణను ప్రగతిపథంలో నడిపించాం, సబ్బండ వర్ణాల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టాం, తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రాన్ని, తెలంగాణ ప్రజల బతుకు చిత్రాన్ని, సమూలంగా మార్చి దేశంలోనే ఒక ఆదర్శ రాష్ట్రంగా, అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు.
నవతెలంగాణ-జూబ్లీహిల్స్



సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం రామగోపాల్‌పేట్ డివిజన్‌లోని ఎంజీ రోడ్‌లో గల గాంధీ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.
నవతెలంగాణ-బేగంపేట్



ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షుడు మేడ శ్రీను గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ కొండ నాగేశ్వర్ పాల్గొని మాట్లాడారు. భారత జాతిపిత మహాత్మా గాంధీ భారతదేశ స్వతంత్ర కోసం సత్యం అహింస సిద్ధాంతాలను ఆయుధాలుగా మార్చుకొని దేశానికి స్వతంత్రం తెచ్చిన మహాత్ముడు అని కొనియాడారు.
నవతెలంగాణ-ఓయూ

కానిస్టేబుల్ ఆత్మహత్య



నవతెలంగాణ-అంబర్‌పేట

మాదన్నపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ. వెంకటేశ్వర్లు(42) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళ్తే.. అంబర్‌పేట దుర్గా నగర్‌లో నివసించే 2007 బ్యాచ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తన ఇంట్లో ఫ్యాన్ కి చున్నితో ఉరివేసుకొని చనిపోయాడు. వెంకటేశ్వర్లు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది. వెంకటేశ్వర్లుకు భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు.మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈయనది స్వస్థలం సూర్యాపేట



అబిడ్స్ లోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో ప్రెస్ వింగ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రగతి టౌన్ షిప్ ఎండీ వి సుబ్బారెడ్డి, పిగిన్ ఐడీఎల్ ప్రయివేటు లిమిటెడ్ ఎండీ మహ్మద్ ఇలియాస్ ఖాన్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని కాంగ్రెస్ కూకట్ పల్లి యువనేత గాది శివ చౌదరి అందుకున్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విడుదల కాని నిధులు



- **ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**
- **రత్నానగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల కావడం లేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆరోపించారు. అంబర్‌పేట నియోజకవర్గం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో రూ.44 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో నూతన రోడ్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గత ఐదేండ్ల కాలంలో ప్రతి బస్తీ, కాలనీలో ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల కాక అభివృద్ధి కుంటుపడిం దన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, నిధులు విడుదల చేయమంటే ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. అనంతరం బస్తీలో తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసు కున్నారు. ఈ కొత్త రోడ్డు నిర్మాణంతో బస్తీ ప్రజలకు అబ్బందులు తప్పుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి 5 ఏండ్ల జైలు శిక్ష

- **రూ. 5 వేల జరిమానా**

నవతెలంగాణ-నేరేడ్ మెట్

బాలికపై లైంగికవేధింపులకు పాల్పడిన వ్యక్తికి కోర్టు ఐదేండ్ల జైలు శిక్ష విధించింది. వివరాల్లోకెళ్తే.. నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే టీ. దనరాజ్ గ్యాస్ టెక్నీషియన్ గా పనిచేస్తున్నాడు. అతను 22 ఆగస్టు 2020 సంవత్సరంలో ఓ బాలిక పై లైంగిక వేదింపులకు పాల్ప డ్డాడు. దాంతో అతనిపై క్రైమ్ నెం:554/2020 యూ/ఎస్ 354 ఐపీసీ,సెక్షన్ 11 ఆర్/ డబ్ల్యూ 12 ఆఫ్ పోక్సో యాక్ట్‌గా కేసు నమో దైంది.

ఈ కేసుకు సంబంధించి మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ పై కోర్ట్ నందు ఛార్జ్ షీట్ ఫైల్ చేయగా గురువారం ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి అతన్ని దోషిగా నిర్ధారిం చి 5 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు 5 వేల రూపాయలను జరి మానా విధించారు. ఈ కేసు నందు సమర్ధంగా పనిచేసిన కోర్టు కానిస్టేబుల్స్ అన్వర్, కవితలను న్యాయమూర్తి అభినందించారు.

CHANGE OF NAME

I **Jaypratap Reddy Gnan Katakam, S/o, K .G Reddy** aged about 49 yrs Pvt Employee R/o H.No.1-5-1039/2, Father Balaiah Nagar,Old Alwal Hyderabad do hereby inform as public notice that my son, previously mentioned as **Katakam Shaun Jaypratap Reddy** in his earlier passport, has now been correctly named as **Shaun Katakam** as per his 10th-grade Certificate and Aadhar card.I request all concerned authorities to update the necessary records accordingly.

In The Court Of: Principal Junior Civil Judge-Cum-Judicial Magistrate Of First Class At Malkajgiri

O.S. No. 850 OF 2024

Between:

1.MR. SINGI REDDY CHANDRA REDDY S/O. LATE SINGI REDDY RAGHAVA REDDY Aged 76 years, Occ: Private Employee, H.No. 1-24-717, Plot No. 13, Dwaraka Nagar, Venkatapuram, VTC: Secunderabad, District Telangana. Aadhaar No. 2066 1785 4364

2. MR. SINGI REDDY MAHESHWAR REDDY S/O. SINGI REDDY CHANDRA REDDY Aged 51 years, Occ: Private Employee, H.No. 1-24-717, Plot No. 13, Dwaraka Nagar, Venkatapuram, VTC: Secunderabad, District Telangana. Aadhaar No. 6673 6530 8438

3. MR. SINGI REDDY RAGHAVENDER REDDY S/O. SINGI REDDY CHANDRA REDDY Aged 45 years, Occ: Private Employee, H.No. 1-24-717, Plot No.13, Dwaraka Nagar,Venkatapuram, VTC: Secunderabad, District Telangana. Aadhaar No. 8079 2359 6797 ...Plaintiff

AND

1. The Tahsildar, Keesara Mandal, Medchal-Malkajgiri District, State of Telangana.
2. All Concerned ....Defendants

To
All Concerned

TO WHOM SO EVER IT MAY CONCERN

Please take notice, that the above named Plaintiffs filed the above suit to declare the plaintiff No.1 to 3 as the only legal heirs of Late Singi Reddy Raghava Reddy, The above suit is posted on 11-03-2025 at 10.30 AM in the above said court, if anybody having any claim or objection may approach this Hon'ble Court with valid documents either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

//BY ORDER OF THE COURT//
Sd/-MOMIN MOHAMMED RAFIQ,
ADVOCATE
Flat No.103, First Floor, 1-1-694/103, M.G. Castle, Gandhi Nagar, Hyderabad-500080.

IN THE COURT OF VII ADDL JUNIOR CIVIL JUDGE -CUM-VII ADDL METROPOLITAN MAGISTRATE,RANGA REDDY DISTRICT AT HAYATHNAGAR.

O.S.NO.187/2023

BETWEEN:
Indian Overseas Bank, Vanasthalipuram Branch, Rep. by Branch Manager, Dhanavath Krishna, S/o. Jairam, Plot No.11, GF, HIG Phase-I, Hill Colony, Guru Dwara Lane, Vanasthalipuram, Hyderabad - 500 070.

AND

1.M/s Shakshi Tent House, Rep. by its Partners
1.K.Motilal Naik, S/o Korra Lakpathi, 2. Smt. Ramavath Jani, W/o Ramavath Pandu, Plot No.A/503/1, Road No.4, Greenpark Colony, Karmanghat, Saroornagar Mandal, Hyderabad-500 079.
2.K.Motilal Naik, S/o Korra Lakpathi, Aged about 40 years, Occ: Business,H.No.17-1-391/g/p/70, Singareni Colony, Saidabad, Hyderabad-500059, Mob: 9390333222
3.Smt. Ramavath Jani, W/o Ramavath Pandu, Aged about 37 years, Occ: Business, H.No.391/G/P/74, Singareni Colony, Saidabad, Hyderabad-500 059.
...Defendant No 1 to 3

Take Notice that the Plaintiff Bank have filed the said suit against Defendant No.1 to 3 for recovery of Rs.6,61,311/- with Interest at 10.90% per annum thereon from 01-02-2023.The suit is posted to 05-02-2025 for your appearance before the Hon'ble VII ADDL JUNIOR CIVIL JUDGE - CUM-VII ADDL METROPOLITAN MAGISTRATE, Ranga Reddy District at Hayathnagar. If you fail to appear in person or through an Advocate on 05-02-2025 at 10.30 am before the above court, you will be set ex-party and the suit may be decided by the Court in your absence.

//BY ORDER OF THE COURT//
Y.M. KANTAIAH
V.RAVI KUMAR
S. SWAPNA
Advocates,
H.No.8-1-18/49/2,
Kranthinagar, Karmanghat,
Hyderabad - 500 0079

IN THE COURT OF THE HON'BLE VII ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT CUM SPECIAL SESSIONS JUDGE FOR THE TRIAL OF CASES UNDER SC/STS (POA)ACT, 1989, RANGA REDDY DISTRICT AT:L.B.Nagar

O.S.No. 365 Of 2023

Between:
Mr Mohammed Sabet Zaheer Siddiqui Rep.by Mohd. Hassan Azhar Siddiqui ...Plaintiff

AND

Legend Estates Private Limited & 2 Ors. ...Defendants

To,
3) Nitisha Malacheruvu W/o. Kandadi Pramodh Reddy Aged about:40 years Occupation: Housewife R/o.Flat No.3, MIG-II, Block-20, Baghlingampally, Near Sundarayya Park, Hyderabad, PIN:500044.

Whereas the Plaintiff has instituted a suit against you for Declaration, Possession & Consequential Injunction you are hereby summoned to appear in this Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **02nd day of April, 2025** at 10-30 O' Clocks in the forenoon to answer the claim, and further you are hereby directed to file within 30 days of service of this Summon a Written Statement of your defence and to produce on the said day all documents in our possession or power upon which you base your defence.

Take Notice that in default of your appearance and to file your written statement within 30 days the suit will be heard and determined in your absence.

By Order
M.K.ANEES
M.B.A., LL.B.,
ADVOCATE
PLOT NO. 28-HIG ,TANASHA NAGAR ,MANIKONDA
R.R.District, T.S.-89.
Mob:9849682859

CHANGE OF NAME

I, **PUPPALA MANI TEJA, S/O P.KUMARASWAMY,** aged about 22 years, Occupation: Student, R/o. Plot No.26, Road No.4, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyd-500068, Telangana State, My actual name is **PUPPALA MANI TEJA, S/O P.KUMARASWAMY,** as recorded/mentioned in all my ID Proofs and educational certificates, However, my name changed to **PUPPALA MANI TEJA REDDY,**

IN THE COURT OF THE IInd ADDL CHIEF JUDGE CITY CIVIL COURTS, AT: HYDERABAD

I.A.No.3558/2024
In
I.A.No.224 / 2019
In
O.S.No.530/2009

Between:
N.Mahender & Ors., ...Petitioners /Plaintiffs
AND
Smt.Lalitha @ Lalithabai & Ors., ...Respondents /Defendants

Notice to Show Cause in I.A No. 3558/2024 to D-3, D-4 & D-5 and Proposed 15th & 16th Defendants

1.N.Geeta Rani W/o N.Prakash, Aged. 52 Yrs, R/o H.No.13-1-754/3/1, 1st Floor, Mangalhat, Upper Dhoolpet, Hyderabad.
2.Shiva Rani W/o M.Sadashiva, Aged. 50 Yrs, R/o H.No.13-3-600/A, 4th Floor, Venkateshwara Nagar, Jiyaguda, Hyderabad, Occ. Housewife.
3.I.Jyothi W/o.I.Rajender, Aged. 48 Yrs, R/o H.No.21-5-362, Kokarwadi, Puranapul, Hyderabad, Occ. Housewife.
4.Phoolmati Bai W/o.Sunder Singh & D/o Mohan Singh, Aged. 43 Yrs, Occ.Household.
5.Sunitha Bai D/o Mohan Singh, Aged. 40 Yrs, Occ. Household. (Both R/o H.No.14-11-454, Machlipura, Hyderabad)
...D-3, D-4, D-5, R-15 & R-16

The 3rd, 4th and 5th Defendants and the proposed 15th and 16th Defendants in I.A.No.3558/2024 may please take notice that I.A No. 3558/2024 in O.S.No.530/2009 stands posted to 18.02.2025 at 10.30 A.M on the file of the Hon'ble IInd Additional Chief Judge, City Civil Courts, Hyderabad for your appearance in person or, through pleader duly instructed failing which the matter shall proceed Ex-parte.

// By Order //
Place: Hyderabad
Date : 31.01.2025
M/s.Rakesh Sanghi
Advocates
C-308, 3rd Floor, UPASANA
#4-1-970, Ahuja Estate, Abids
Hyderabad-500 001, T.S.
Tel: 24758810 (O), 23325797 (R)

ఘనంగా శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ప్రభుత్వం కలలను, సంగీత, నృత్య కళాశాలలను ప్రోత్సహించడానికి అభినందిస్తున్నానని పద్మశ్రీ అవార్డు గ్రహీత , ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు డాక్టర్ యల్లా వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల 72వ వార్షికోత్సవం గురువారం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ నేతృత్వంలో కళాశాలలు అభివృద్ధి చెందుతున్నాయని ఆయనను అభినందించారు. సంగీత, నృత్య కళాశాలలో పోస్టులను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారు నేర్చుకున్న కలను ప్రదర్శించడం ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా పలువురుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో , కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ్ ముతాలిక్,కళాశాల అధ్యాపకులు పీవీ రమణశాస్త్రి, పి జయలక్ష్మి టీవీ రవికాంత్, జి లావణ్య లత, కే రాజగోపాల్ చార్య, రవిచంద్ర, పవన్ కుమార్ రెడ్డి, బి శ్వేత, భాగ్యలత, ఇందిర, రవీందర్ రాజు, కృష్ణా, నాగరాజు, పెద్ద ఎత్తున కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు



టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో గాంధీకి నివాళ్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) అధ్యక్షతన గురువారం జాతిపిత మహాత్మా గాంధీ 77 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అసోసి యేట్ అధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్, కోశాధికారి బాలరాజ్, ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, సభ్యులు శ్రీధర్ నాయుడు, ప్రత్యేక ఆహ్వానితులు సిటీ అధ్య క్షులు శ్రీకాంత్, మాజీ కార్యదర్శి ప్రభాకర్, జిల్లా యూనిట్ సభ్యులు సత్యనారా యణ జాఫర్, పిఆర్‌టి మొహమ్మద్ వహీద్ మరియు ముస్తఫా షరీఫ్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం అన్ని సమస్యలకు సమాధానం అని తెలియజేశారు. ఉద్యో గులు ఆందోళన చెందవద్దని, కేంద్ర సంఘ నాయకులతో కలిసి ప్రభుత్వం అతి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గాంధీకి నివాళి

నవతెలంగాణ- సిటీబ్యూరో

మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని డీఈవో హైదరాబాద్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసరెడ్డి, టి.ఎన్.జి.ఓ. యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ , స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లా అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్, కోశాధికారి ప్రేమ్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫిరోజ్, ఈసీ ముజాహిద్ అలీ, శ్రీ ప్రియదేవ్ ఠాకూర్ వారి కార్యవర్గం ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఎమ్., అరుణ, లావణ్య, జి.రాజ్‌కుమార్, విజయలక్ష్మి, ప్రవీణ, డి.శ్రీకాంత్, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, అర్చన, రాజేందర్, బబ్లూ, బషీర్ అహ్మద్ ఒవైసి, యోగేందర్, జేమ్స్, శ్రీధర్ , శశిరత్న, రేణుక, ఇమ్రాన్, ఖాజా సోహైల్ అహ్మద్, ఫయాజ్ అలీ, అల్తాఫ్, సిపి రెడ్డి, నర్సింహ, గిరిజ, అజామత్, మధుకర్ శిల్ప, మంజు, హేమావతి, రాణి, శ్రీకాంత్, సంతోష్, సజ్జిద్, వెంకటేష్, జాకీర్, దర్శన, లక్ష్మీపతి, విజయ్ కుమార్ , జంబయ్య, చైతన్య, అనిల్, గౌసియా,, థాయర్, సునీల్, ఐజాజ్, రవి, దామోదర్ రవి, మహేందర్, సునీత, పూర్ణిమ, లత, కృష్ణారావు, సర్పరాజ్, సౌజన్య, శంకర్, ప్రవీణ్, శ్రీదేవి, పాల్గొన్నారు .



మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూరు గ్రామంలో ఎంపీ ఈటల రాజేందర్ నివాసానికి గురువారం రాష్ట్ర సంస్కృతిక సారథి మాజీ అధ్యక్షులు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రావడం చర్చనీయాంశంగా మారింది.ఈ సందర్భంగా ఎంపీ నివాసానికి వచ్చిన పలువురు నాయకులతో ఫోటోలు దిగడం ఆసక్తిగా మారింది. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బీజేపీలో చేరడానికి చర్చించడానికి వచ్చారా?? లేదా ఏదైనా వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చారనేది తెలియాల్సి ఉంది. నవతెలంగాణ- మేడ్చల్

అమరవీరుల త్యాగాలను గౌరవించాలి



- **నవభారత్, వనితా భారత్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు జి.కృష్ణ వేణి, డా.హిప్నో పద్మా కమలాకర్, డా.శ్రీలు**

నవతెలంగాణ- సిటీబ్యూరో

దేశానికి ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ గురువారం అమరవీరుల దినోత్సవం (షహీద్ దివస్) సందర్భంగా భోలక్ పూర్ బాలికల వసతి గృహంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అనేకమంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, దేశ భక్తిని వ్యక్తీకరించడంతో పాటు మహాత్మా గాంధీ సహా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గురించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖులు నవభారత్, వనితా భారత్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు జి.కృష్ణ వేణి, డా.హిప్నో పద్మా కమలాకర్, డా.శ్రీలు, పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ, "మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు ప్రతి భారత పౌరుడు గౌరవించాలన్నారు. యువతలో దేశభక్తి, సమాజ సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వసతి గృహం వార్డెన్ భాను ప్రియ, బాలికలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి'

నవతెలంగాణ- మేడ్చల్

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలని బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీని నేరవేర్చక ప్రతిపక్షాల గొంతునొక్కుతూ రాక్షస పాలన కొనసాగిస్తున్నదని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టే విధంగా మహత్మ గాంధీ వారి మనస్సు మార్చేవిదంగా చూడాలని కోరారు.



IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD

O.S.No.3845 OF 2023

BETWEEN:
MOHAMMED ABDUL NAYEEM S/O MOHAMMED ABDUL RAHEEM R/o. H.no 22-6-1010, Irani Galli, Hyderabad, T.S ...Plaintiffs

AND

1.Ome Kulsum D/o.Late Ziaul RashidAged about: 20 years, Occ: Student, R/o.H.No.9-4-86/83, Salarjung Colony, Hyderabad.
2. Zia Ul Mazeed S/o. Late Abdul Waheed, Aged about: 68 years, Occ: Retd. Employee, R/o.H.No. 8-10-27, Abdul Razzak Street, Wichipeta, Vijaywada (Urban), Krishna District.
3.Zia Ul Hameed S/o.Late Abdul Waheed, Aged about: 55 years, Occ: NRI, R/o.H.No.8-10-27, Abdul Razzak Street, Wichipeta, Vijaywada (Urban), Krishna District. Def. No. 2 & 3 are presently R/o. H. No. 9-4-86/83, Salarjung Colony, Golkonda, Hyderabad. ...Defendants

Take notice that,
The plaintiff has filed the above Suit against the defendant for Perpetual Injunction over the suit property. The said suit is posted for the appearance of defendant on 10-02-2025. Hence this notice for defendants' appearance.

JALIB HASAN
ADVOCATE
#21-6-593, Opp: High Court Lan, Hyderabad 500 029.
Cell No. 8074965050

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: HAYATH NAGAR.

O.S.No.188 OF 2024

Between:
A.Srinivas Reddy ...Plaintiff
AND
Srihari. R. Rajole and 3 others ...Defendants

To,
(1) Srihari. R. Rajole, S/o R.Ramam, Aged 51 years, Occ: Private Service, R/o LIG "B" 285, Dr.A.S. Rao Nagar, Hyderabad – 500 062.
(2) Chinthoju Raghuveer, S/o Ch.Chandra Sekhara Chary, Aged 40 years, Occ: Business, R/o H.No.8-1-77/3/C, Jagadamba Colony, Mahaboob Nagar – 509 002.
(3) K.Manoj Reddy, S/o Sai Reddy, Aged 56 years, Occ:Business, R/o Dwarakapuram Colony, near High Court Colony, Vanasthalipuram, Ranga Reddy District-500 070.
(4) Pidugu Ramulu, S/o Pidugu Mysaiah, Aged 79 years, Occ: Agriculture, R/o Hayathnagar, Ranga Reddy District-500 070.

NOTICE

Please take notice that the above named Plaintiff had filed above suit against you for declaration to declare him as absolute owner and possessor of the below mentioned Schedule Property; Perpetual Injunction; and Cancellation of Sale Deeds;

The above suit is posted for your appearance on 11-02-2025, at 10:30 A.M. before the above said Hon'ble Court either in person or through an Advocate, failing which, the Hon'ble Court shall proceed further in your absence in accordance with the law.

SCHEDULE PROPERTY: All that the Plot of land admeasuring 300 Sq.yds or 250.8 Sq. Mts bearing Plot No.74, forming part of Sy.No.97, in Ward No.4, Block No.9, situated at Bagh Hayath Nagar Village, Hayath Nagar Mandal, Ranga Reddy District, under L.B.Nagar Municipality, Telangana State and the same is bounded by North: Road; South: Plot No.55; East: Plot No.75; and West: Plot No.73;

(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/-
A.VENKATESWARLU
A.RAMMOHAN , ADVOCATES
Plot No.34, Sri Krishna Nagar, L.B.Nagar, Hyderabad – 74.

IN THE COURT OF THE HON'BLE VI ADDITIONAL JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI AT: L.B NAGAR

O.S.No.293 OF 2024

BETWEEN:
Chirra Mallesh ...Petitioner/Plaintiff
AND
Gorukanti Prakesh ...Respondent/Defendant

NOTICE TO DEFENDANT

By name Gorukanti Prakesh, S/o Late G. Laxman, Age:38, Occ:Pvt Employee, R/o: 5-86, Ankushapur(V), Ghatkesar(M), Medchal -Malkajgiri Dist.

Please take Notice that the Hon'ble court was pleased to ordered to issue notice to you in the above case, as the plaintiff herein filed a suit for eviction and recovery of possession of house bearing No 5-86 in survey No199 admeasuring 220 square yards situated at Ankushapur(V) of Ghatkesar (M), Medchal-Malkajgiri Dist.

The said Matter is stands posted on 24-02-2025 at 10:30 am for your appearance by person or through advocate.

Failing which the matter will be decided in favour of plaintiff.

BY ORDER
VI ADDITIONAL JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI DIST AT:L.B NAGAR JUDGES QUARTARS

మహారాజశ్రీ 25వ అదనపు చీఫ్ జడ్జి, సిటీ సివిల్ కోర్టు హైదరాబాద్ గారి కోర్టు నందు

O.S. NO. 139/2024

Between:
దుర్గం @ గుంటూరి రాజమణి మరియు ఇతరులు ....వాదులు
మరియు
దుర్గం జయంత్ కుమార్ మరియు ఇతరులు ....ప్రతివాదులు

To,
ప్రతివాది నెం.1) దుర్గం జయంత్ కుమార్, S/O. కీ॥శే॥ దుర్గం నర్సింహులు,వయస్సు 73సం॥లు, వృత్తి వ్యాపారం,R/o: A21 A type,డిడి కాలనీ, హైదరాబాద్
ప్రతివాది నెం 3) దుర్గం శ్రీకాంత్, S/O.- కీ॥శే॥ మోహన్ కృష్ణ, వయస్సు 42 సం॥లు, వృత్తి వ్యాపారం.
ప్రతివాది నెం:4) దర్గం రోహిణి, D/O.కీ॥శే॥ మోహన్ కృష్ణ, వయస్సు 39 సం॥లు వృత్తి : వ్యాపారం,
ప్రతివాది నెం.5) దుర్గం శశికాంత్,S/O.కీ॥శే॥, మోహన్ కృష్ణ, వయస్సు 32 సం॥లు,వృత్తి :వ్యాపారం
Above Defendants : 3 To 5, R/o SCB 5-14-212, First Floor, MG Sabitha Raj Residancy, ఇంద్రప్రస్థ రైల్వే కాలని, వెస్ట్ మారేడ్ పల్లి, సికింద్రాబాద్.
ప్రతివాది నెం. 6) దుర్గం అనూష, D/O,కీ॥శే॥, మోహన్ కృష్ణ, వయస్సు 30 సం॥లు,వృత్తి వ్యాపారం
ప్రతివాది నెం. 7) దుర్గం సరహరి, S/o.కీ॥శే॥, మోహన్ కృష్ణ, వయస్సు 25 సం॥లు,వృత్తి వ్యాపారం
ప్రతివాది నెం. 8), దుర్గా శ్రీనివాస్,కీ॥శే॥ దుర్గం నర్సింహులు,వయస్సు 61 సం॥లు, వృత్తి వ్యాపారం
Above Defendants : 6 To 8, R/o H.No. 5-3-829,గోషామహల్, హైదరాబాద్.

పైన తెలిపిన వాదులు ఆస్తుల పంపకం దావాను పైన తెలిపిన ప్రతివాదులపై పైన తెలిపిన కోర్టులో వేసినారు. అట్టి దావాలో పైన తెలిపిన ప్రతివాదుల హాజరుకొరకు తేది: 11-2-2025 రోజున వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాదులందరు ఉ॥గం.10-30 నిమిషాలకు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని కోర్టులో హాజరు కాగలరు. లేనియెడల కోర్టు వారు మిమ్ముల్ని exparte చేసి కేసు విచారణ చేయబడును .

"కోర్టు వారి అనుమతితో"
[illegible] సురేందర్,
[illegible] ప్రకాష్,
న్యాయవాదులు, హైదరాబాద్
PH: 98665 73431.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM VII ADDL.JUDICIAL MAGISTRATE OF FIRST CLASS RANGA REDDY DISTRICT : AT HAYAT NAGAR

O.S.NO.68 OF 2025

Between:
1. Smt. S.Jhansi Laxmi W/o Late S. Sai Suresh Kumar, aged 54 years, Occ: House Wife, R/o H.No. 2-4-763, Road No.3, New Nagole Colony, UPPAL, Mandal, Medchal Malkajigiri District-500039.
2. Sashank Sunkara, S/o Late S. Sai Suresh Kumar, aged 34 years, Occ: Private employee, R/o H.No. 2-4-763, Road No.3, New Nagole Colony, UPPAL, Mandal, Medchal Malkajigiri District-500039
3. Sunkara Jyothi Priyanka D/o Late S.Sai Suresh Kumar, aged 32 years, Occ: House Wife, Address: H.No. 2-4-763, Road No.3, New Nagole Colony, UPPAL, Mandal, Medchal Malkajigiri District-500039 ...Plaintiffs

AND

1. Tahasildar/MRO, Abdullapurmet Mandal, Ranga Reddy District-505 501
2. All concerned ....Defendants

To
All Concerned ...Defendant No.2

The above named plaintiffs filed the above SUIT for grant of legal heirs status and declaration in respect of the properties mentioned below, left by Late Sunkara Sai Suresh Kumar@ S.Sai Suresh Kumar husband of 1st plaintiff, and father of 2nd and 3rd plaintiffs, who died on 17-01-2016. The said suit stands posted to 28-02-2025. There fore any person (s) having any objection for the same, they may appear before the Hon'ble court on 28-02-2025 at 10.30 A.M personally or instructed by their counsel, otherwise the matter will be decided as per law.

PLAINT SCHEDULE 'A'

All that the Southern part of open plot bearing No.21, admeasuring 205 sq.yds out of 270 sq.yds, in Survey Nos. 58,59,& 60 situated at Thattiannaram Village and (Hayat Nagar Mandal), now under Abdulla purmet mandal, Ranga Reddy District, under Saroor Nagar SRO, and bounded by:
NORTH: NORTHERN PART OF PLOT NO.21, SOUTH: 25 feet wide road, EAST: 25 feet wide road, WEST: Plot No.20

PLAINT SCHEDULE 'B'

All that the open plot bearing No. 8, admeasuring 207 sq.yds, in Survey Nos. 255, 256, & 259 situated at VARASIDDI ENCLAVE, Mangal pally Village and Ibrahimpatan Mandal, Ranga Reddy District District, under Ibrahimpatan SRO, covered by Ward and Block number 4, and bounded by:
NORTH: Plot No.9,
SOUTH: Plot No.7
EAST: Neighbours Land
WEST: 40 feet vide Road

//BY ORDER OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM VII ADDL.JUDICIAL MAGISTRATE OF FIRST CLASS RANGA REDDY DISTRICT : AT HAYAT NAGAR//
Sd/-
MOVVA SRINIVAS
K.N.V.SUBRAMANIAM,
K.ARUNA
ADVOCATES
Flat No.101, Mahalakshmi Sri Nilayam,HMDA Layout UPPAL, Hyderabad-39. T.G,
Mobile.No.9247429050

IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE MEDCHAL – MALKAJGIRI DISTRICT AT: UPPAL / L.B.NAGAR

O.S.NO: 736 OF: 2023

Between :
B.Deven ...Plaintiff
AND
M.Siddaiah & others ...Defendants

To,
(D3).K.Rama Murthy, S/o. Kodiyagowder, Aged about: 50yrs, Occ: Business R/o H.No. 44-431/1/2/1, New Sri Nagar Colony, Near Masjid, Moulali, Secunderabad – 500040.
(D.5).Cheekoti Venkateswarlu, S/o.Ch.Janardhan, Aged about: 48 years, Occ: Business, R/o. H.No. 42-627, Bodabanda, Near Govt.School, Moulali, Secunderabad – 500040.
(D.7).Poojari Shiva Raj, S/o. P.Sailu, Aged about: 42 years, Occ.Business, R/o. H.No.9-160/56/3, Bajrang Nagar colony, Near Hanuman Temple, Jawahar Nagar, Hyderabad – 500 087.
(D.16).Tota Ravinder, S/o. T.Pandu, Aged about: 52 years, Occ. Business, R/o H.No. 1-53, Meerpet Mallapur, Kapra, Medchal – Malkajgiri District-40.
(D.18).Peeraram Bishnoi , S/o. Javata Ram, Aged about: 60 yrs, Occ. Business, R/o.Unit No.6, Premises No. 4-4-43, 1st Floor, Debbadi Complex,Mahankali Street, Ranigunj, Secunderabad.
(D19).Smt.Sama Vijaya Laxmi, W/o.S.Soma Reddy, Aged about: 46 years, Occ. Housewife, R/o H.No. 3-108/3/2/86, Plot No.86, Ganesh Nagar, Chengicherla Village, Medipally Mandal, Medchal – Malkajgiri Dist

Please take notice that the above mentioned suit vide O.S. NO. 736 OF 2023 has been filed by the Plaintiff seeking relief of Suit For Perpetual; injunction and to declare the regd sale deeds are null & void and not binding on the plaintiff, in respect Schedule property which is specifically mentioned in the plaint against you, in this suit you have been arrayed as Defendants No. 3,5,7,16,18 & 19. Therefore in the above said suit if you have any objections, you are hereby directed to appear before the Hon'ble II Addl Junior Civil Judge,Medchal–Malkajgiri District, at L.B.Nagar, in person or through your counsel on 24-02-2025, at 10.30.Am. failing which the matter shall be decided in your absence.

Y. SRINATH RAO
B. RADHA KRISHNA
Advocates
R/O.Flat.No.403, Lahari Susheela App, Beerappagadda Road, Uppal Vill & Mandal,
Ph. No. 9347474715.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శుక్రవారం | జనవరి 31, 2025 | www.navatelangana.com

కార్మికులకు కేంద్ర బడ్జెట్ అనుగుణంగా ఉండాలి

సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసులు



నవతెలంగాణ - చర్లపల్లి

రేపు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కార్మికులకు అనుగుణంగా ఉండాలని మేడ్చల్ జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.." కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 01 అనగా శనివారం దేశ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్ కార్మికులకు, మధ్యతరగతి వేతన జీవులు.. ప్రతీసారి బడ్జెట్ పై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. కానీ చివరకు నిరాశే మిగులుతూ వస్తోంది. ఈసారైనా కార్మికులు, మధ్యతరగతి వాళ్ళను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ లో ప్రాధాన్యత ఉండాలని ముఖ్యంగా కార్మికులకు ప్రయోజనం చేకూరి విధంగా ఉండాలని కోరారు."

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి



నవతెలంగాణ -శామీర్‌పేట

చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కొంగ బాల నర్సింహా (66) ఈ నెల 30న మధ్యాహ్నం 2:30గంటలకు అలియాబాద్ చౌరస్తాలో పిస్తాహౌజ్ వెనక ఉన్న చెరువులో ఒక మగ వ్యక్తి చేపల వలలో చిక్కుకొని నీటిపై తెలియాడుతున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని బయటకు తీశారు. మృతుడు బుధవారం ఇంట్లో నుండి బయటికి వెళ్లి ఇంటికి తిరిగిరాకపోవడంతో అతని కొడుకు బాలకృష్ణకు అనుమానం వచ్చి తరుచూ అతను చేపలు పట్టే స్థలానికి వెళ్లి చూడగా అతని బట్టలు బయట ఉండి అతను వలలో చిక్కుకొ పైకి తేలి కనిపించాడని తెలిపారు. చేపలు పడుతూ ప్రమాదవశాత్తు చనిపోయినట్లుగా తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్కారు జాగా వేసేయ్ పాగా

•రెవెన్యూ అధికారులను ఇరకాటంలో పెడుతున్న కబ్జాదారులు •చర్యలు తీసుకోవడంలో రాజకీయ 'వత్తిళ్లు'





నవతెలంగాణ-బోడుప్పల్

ప్రజా వినియోగం కోసం ఉపయోగించే సర్కార్ భూముల సంరక్షణ రెవెన్యూ అధికారులకు కత్తి మీద సాము లాగా మారింది. దీంతో భూ అక్రమ మార్కులు సర్కారు జాగా వేసేయ్ పాగా అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల బోడుప్పల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 63/26 నుండి 63/36 వరకు గల సర్కారు భూమిలో సుమారు 60 ఎకరాలకు పైగా భూమి ఉంటుందని రెవెన్యూ అధికారుల రికార్డులలో ఉంది. కానీ ఫిజికల్‌గా మాత్రం సదరు భూమి ఎక్కడ కనిపించడం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా రెవెన్యూ అధికారుల లెక్కలేని తనం, రాజకీయ నాయకుల పలుకుబడి కారణంగా ఏడాదికింత చొప్పున సర్కారు భూమి అన్యాక్రాంతం అవుతూ వస్తుంది.

అక్రమార్కులకు ఆదాయం కురిపిస్తున్న సర్కారు భూమి

మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 63/26 నుండి 63/36 వరకు ఉన్న సర్కారు భూమి అక్రమార్కులకు కాసులు కురిపిస్తుందన డంలో ఎలాంటి సందేహం లేదు. సర్కారు భూమిలో తప్పుడు ధృవీకరణ పట్టాలు సృష్టించి రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టి తెల్లారేసరికి సున్నాలు వేయడం పరిపాటిగా మారిందనే చెప్పవచ్చు. సర్కారు భూమిలో అక్రమంగా పట్టాలు సృష్టించడం అలా సృష్టించిన పట్టాలను అమాయక పేద ప్రజలకు కట్టబెట్టి ఖద్దరు నేతలు కోట్లాది రూపాయలు తమ జేబులో వేసుకుంటున్నారు. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులు సదరు ఇండ్లను కూల్చివేస్తే మాకేమి సంబంధం లేదన్నట్లుగా సదరు స్థలాన్ని విక్రయించిన నేతలు సైడై పోతారు. దీంతో అప్పో సప్పో తెచ్చుకుని ఇంటి నిర్మాణం చేసుకున్న పేదలు రోడ్డు మీద పడుతున్నారు.

దొంగ డబుల్ పట్టాలు..

వాళ్లు చేసేదే దొంగతనం అందులోనూ మళ్ళీ డబుల్ పట్టాలు సృష్టించడం ఇలా ఒకే స్థలానికి ఇద్దరు ముగ్గురు పోటీ పడడం ఈ స్థలం నాదంటే నాదంటూ దౌర్జన్యాలకు దిగడం కేసులపాలు కావడం ఈ ప్రాంతంలో తరుచూ జరిగేదేది అందరికీ తెలిసిందే. ఒక నాయకుడు సృష్టించిన పట్టాతో అక్కడ కనిపించే లేదా తనకు అనుకూలమైన స్థలాన్ని ఎంచుకోవడంతో పాటు అటు వైపు రెవెన్యూ సిబ్బంది రాకుండా చూసుకోవడం లాంటి కార్యక్రమాలన్నీ సదరు ఖద్దరు నేతలకనుసైగల్లోనే జరిగిపోతున్నాయి.

రెవెన్యూ అధికారులకు చుక్కలు చూపిస్తూ...

అన్ని సార్లు కాకపోయినా కొన్ని సార్లు (ప్రభుత్వం నుండి జీతం తీసుకుంటున్న నిజాయితీ కలిగిన అధికారులు) సర్కారు భూమిలో చేపట్టిన నిర్మాణాలను తొలగించడం కోసం వెళ్ళే రెవెన్యూ సిబ్బందికి కబ్జాదారులు చుక్కలు చూపిస్తున్నారు. ఎప్పటివో ఈ భూమికి సంబంధం లేని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అంటూ న్యాయస్థానం నుండి రెవెన్యూ అధికారులు రాకుండా కోర్టు ఆర్డర్ తీసుకురావడం లాంటి చర్యలతో రెవెన్యూ సిబ్బందిని నిలువరించే పనులు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో రెవెన్యూ సిబ్బంది వెనకడుగు వేస్తున్నారని తెలుస్తుంది. సర్కారు భూమిగా రికార్డుల్లో ఉన్న భూమికి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఎలా చెల్లుబాటు అవుతాయనేది అర్థం కానీ ప్రశ్నగా మిగిలింది.

రాజకీయ వత్తిళ్లు

సర్కారు భూముల్లో కబ్జాదారులు చేసే కబ్జాలకు రాజకీయ నాయకుల అండదండలతో పాటు చర్యలు తీసుకునే అధికారులపై రాజకీయ వత్తిళ్లు కూడా ఉంటాయి. అక్కడ చేపట్టిన నిర్మాణం మన వాళ్లదే, మా పార్టీ నాయకుడే చేపట్టాడు జెర అటు సైడు వెళ్లకు అంటూ అధికారులపై వత్తిళ్లు ఉంటుండడంతో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారని సమాచారం.

సంరక్షణ ఎవరి బాధ్యత..?

సర్కారు భూమి సంరక్షణ అనేది ముఖ్యంగా రెవెన్యూ శాఖ బాధ్యత. కానీ కొన్ని సార్లు రెవెన్యూ సిబ్బంది రాకుండా కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతాయి. అలాంటి సమయంలో టీజీ బీపాస్ అనుమతులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలపై కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారుల యాక్షన్ ఉండడం లేదు. ఇరు వర్గాల శాఖలు రెండు సమన్వయంతో ముందుకు సాగితే సర్కారు భూముల సంరక్షణ సాధ్యమే అవుతుంది.

సర్కారు భూముల కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకోవాలి



ప్రజా అవసరాలకు సంబంధించిన సర్కారు భూమిని కబ్జా చేసే వారిపై రెవెన్యూ అధికారులు, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకు ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఎమేమి చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాలి. కబ్జాదారులకు అండగా ఉంటూ వారికి సహకరించే రెవెన్యూ సిబ్బందిపై ఉన్నతాధికారులు కఠినంగా ఉండాలి. అప్పుడే సర్కారు భూముల సంరక్షణ సాధ్యమవుతుంది.

-ఎన్.సృజన, సీపీఐ(ఎం) మేడిపల్లి మండల కార్యదర్శి

కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం



మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్ రెవెన్యూలో ఉన్న సర్కారు భూముల సంరక్షణ కు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సర్కారు భూముల్లో చేపట్టిన నిర్మాణాలను పూర్తి స్థాయిలో నేలమట్టం చేశాం. ఇంకా కొన్ని చోట్ల చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తాం. ప్రభుత్వ భూములను ఎవరూ క్రయ విక్రయాలు చేయకూడదు. ప్రజలు ఇంటి నిర్మాణానికి స్థలాన్ని కొనుగోలు చేసే ముందు ఒకటికి పది సార్లు ఆలోచన చేసి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటేనే కొనుగోలు చేయాలి. మధ్యవర్తుల మాటలు నమ్మి డబ్బులు వృథా చేసుకోద్దు. ఇప్పటికే కొందరు కబ్జా దారులపై మేడిపల్లి పీఎస్ పరిధిలో కేసులు నమోదు చేశాం. భవిష్యత్తులో కబ్జాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తాం.

-ఎస్.ఎమ్.హసీనా,తహసీల్దారు మేడిపల్లి మండలం.

420 హామీలను వెంటనే నెరవేర్చాలి



- మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి
- కాంగ్రెస్ నేతలకు బుద్ధి ప్రసాదించాలని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-బోడుప్పల్

ఓ మహాత్మ కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచి ఆలోచన ప్రసాదించి ప్రజలకు వారిచ్చిన 420 హామీలను వెంటనే నెరవేర్చేలా బుద్ధి ప్రసాదించాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నగర పరిధిలో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి 420 రోజులు అయిన సందర్భంగా ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారెంటీలు, 420 హామీలు పూర్తి చేయనందుకు నిరసనగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి,జావీద్ ఖాన్, నిర్మల, ప్రభు, అంజనేయులు, బాలరాజు, యాసారం శ్రీనివాస్, కుమార్, వెంకన్న, శంకర్, కిరణ్ తదితరులున్నారు.

కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధిపై సమావేశం



నవతెలంగాణ-కాప్రా

కంటోన్మెంట్ మిలిటరీ ఏరియాలో రోడ్డు డివైడర్ సమస్యలు, కంటోన్మెంట్ బోర్డు సమస్యలు, అభివృద్ధి పనులపై కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్.వీ నంజుందేశ్వరతో బొల్లారంలోని కార్యాలయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ సర్వీస్ ఛార్జిల విషయం, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్డు విస్తరణ పనులు, డిఫెన్స్ లాండ్స్ బదిలీ, రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన రూ.300 కోట్ల పనుల గురించి చర్చించారు. కొన్ని టెంపుల్స్‌లో ఎంట్రీ ఇవ్వకపోవడంపైన ఆయా ఆలయాలకు సంబంధించిన విషయాలు చర్చించారు. ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా మెట్రో పొడిగింపు (జూబ్లీ బస్టాండ్ నుండి శామీర్ పేట్ వరకు) అలాగే (సికింద్రాబాద్ ప్యారడైజ్ నుండి మేడ్చల్ వరకు) జరిగే పనులపైన చర్చించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు నర్మద, మల్లికార్జున, తదితరులున్నారు.


స్ఫూర్తి గ్రూప్‌ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూపు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా కాప్రా సర్కిల్ ఆఫీసులో గాంధీ విగ్రహం దగ్గర స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు అధ్యక్షత నివాళి కార్యక్రమం వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి స్ఫూర్తి గ్రూపు నాయకులు జి.శివరామకృష్ణ, బి. రుక్కయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ రచయిత పి. జయప్రకాష్ మాట్లాడుతూ గాంధీ ప్రజలను చైతన్యపరిచి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. మత సామరస్యానికి కట్టుబడి జీవించారని చెప్పారు. దేశంలో 80 శాతం మంది హిందువులు, 20 శాతం మంది ముస్లింలు, ఇతర మతాలవారు జీవిస్తున్నారని అయినప్పటికీ ఆర్ఎస్ఎస్, బీజేపీ శక్తులు హిందూ మతానికి ప్రమాదం ఏర్పడిందని తప్పుడు సూత్రీకరణలతో ప్రజలను రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఇండియానేషియాలో 98శాతం ముస్లింలు, రెండు శాతం హిందువులు ఉన్నప్పటికీ అక్కడ ఎవరికీ ప్రమాదం అని భావించడం లేదన్నారు. అందరూ కలిసి జీవిస్తున్నారని చెప్పారు. భారతీయ సమాజంలో మతాలను రెచ్చగొట్టి అధికారం చేతబట్టి సంపన్న వర్గాలకు దోచిపెట్టడం ఒక పద్ధతిగా చేస్తున్నారని చెప్పారు. దానికి వ్యతిరేకంగా ప్రజలందరూ కలిసికట్టుగా పోరాడాలని చెప్పారు. రుక్కయ్య, జయరాజ్, కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ప్రజలలో ఐక్యమత్యాన్ని చెడగొట్టి మతోన్మాద శక్తులు విశృంకలంగా పనిచేస్తున్నాయని, దానిని తిప్పి కొట్టాలని చెప్పారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. మహాత్మాగాంధీని చంపిన గాడ్సే గొప్ప దేశభక్తుడిగా ఆర్ఎస్ఎస్, బీజేపీలు పొగుడుతున్నాయన్నారు. కొందరైతే అతని గుడి కట్టిన సందర్భాలు కనిపిస్తున్నాయని గుర్తు చేశారు.ఇటువంటి మతోన్మాద శక్తులు అధికారంలో ఉన్న సందర్భంలో ప్రజలు అర్థం చేసుకొని దేశ లౌకిక తత్వాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. అదే మహాత్మా గాంధీకి నిజమైన నివాళి అన్నారు. అనంతరం సభికులందరూ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శారద, జయప్రకాష్, కృష్ణమాచార్యులు, పార్థసారథి, శివరామకృష్ణ, ఫ్రాన్సిస్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా : కార్పొరేటర్ బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా అని చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత మండిపడ్డారు. పాలన చేతగాని ప్రభుత్వం ప్రశ్నించిన తమను దౌర్జన్యంగా అరెస్ట్ చేశారని వాపోయారు. గురువారం నిర్వహించిన జీహెచ్ఎంసీ సమావేశంలో తమ గొంతు నొక్కారని ఆరోపించారు. కౌన్సిల్ సమావేశం నుంచి తమను బలవంతంగా రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడం దారుణమన్నారు. పాలన చేతగాని ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్స్‌కు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి

- 'ఆశా'ల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ పోరాటం
- సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్, సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆశా వర్కర్స్‌కు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేల ఇచ్చేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తామని, ఆశా వర్కర్స్ సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) సీఐటీయూలు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తాయని సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ అన్నారు. ఆశా వర్కర్స్‌కు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ సమావేశంలో ఆశా వర్కర్స్‌కు జీతాల పెంపుకు, ఆరోగ్యం మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని మల్కాజిగిరి నియోజకవర్గం ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో ఆశా వర్కర్స్ నాయకురాలు రాణి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఉన్నికృష్ణ, గుంటి లక్ష్మణ్‌లు హాజరై మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ సమావేశంలోనే ఆరోగ్య రంగానికి అధిక నిధులు కేటాంచాలన్నారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు హేమలత మాట్లాడుతూ.. ఆశా వర్కర్స్‌కు టార్గెట్ లేదని గతంలో హెల్త్ సెక్రటరీ చెప్పారని గుర్తు చేశారు. పారితోషికాలు లేని పనులను ఆశాలతో చేయించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ వసంత, సుమలత, రాజ్యలక్ష్మి, నమ్రత, జిల్లా, మల్కాజిగిరి మండల కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



నవతెలంగాణ -శామీర్‌పేట

మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం అలియాబాద్ గ్రామానికి చెందిన భీమిరెడ్డి పావని (25) గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అలియాబాద్‌లోని వారి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని సమాచారంతో పోలీసులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతురాలికి భీమిరెడ్డి నాగిరెడ్డితో 8 ఏండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

థి' క్రీక్ ప్లానెట్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



- బీఆర్ఎస్వీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనాథ్ ముదిరాజ్

నవతెలంగాణ- మేడ్చల్

ఫీజు కట్టలేదని స్కూల్ సమయం ముగిసిన తర్వాత కూడా ఆఫీసులోనే విద్యార్థిని కూర్చోబెట్టిన థి క్రిక్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు కఠిన చర్యలకు తీసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీనాథ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి సదరు పాఠశాలకు వెళ్లి ఘటనకు సంబంధించిన వివరాలను యజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఫీజు కట్టకపోతే విద్యార్థిని సాయంత్రం 6గంటల ఆఫీసులో ఎలా కూర్చోబెడతారని ప్రశ్నించారు. విద్య హక్కు చట్టం ప్రకారం ఫీజులకు సంబంధించిన అంశాలు కేవలం తల్లిదండ్రులతో మాత్రమే స్కూల్ యజమాన్యం మాట్లాడాలని ఆ అంశాలను విద్యార్థులపై రుద్దకూడదని హెచ్చరించారు. రాష్ట్రంలో పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనాథ్ ముదిరాజ్,నాయకులు రఘు,సుశాంత్ రెడ్డి ,ఉప్పలాంచి నాని తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమమే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం



- జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం
- అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు కేటాయించాలి
- బసవ పున్నయ్య

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలో పనిచేస్తున్న పాత్రికేయుల సంక్షేమం కోసం టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపునయ్య అన్నారు. గురువారం ఉప్పల్ నియోజకవర్గ టీడబ్ల్యూజేఎఫ్ సమావేశాన్ని భవానీనగర్‌లో నియోజకవర్గ అధ్యక్షుడు గంగి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులకు ప్రభుత్వం నుంచి సహకారాలు లేవని, సంక్షేమ పథకాలు అందడం లేదని, పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ అక్రిడేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో అక్రిడేషన్ కోసం పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం పలువురు పాత్రికేయులు మాట్లాడుతూ కాప్రా సర్కిల్ ప్రెస్‌క్లబ్‌లో అన్యాయానికి గురైన తోటి మిత్రులకు టీడబ్ల్యూజేఎఫ్ అండగా నిలవాలని కోరారు. మాటలకు, చేతలకు పొంతన లేని కాప్రా ప్రెస్‌క్లబ్ తీరును ఎండగడుతూ కాప్రా సర్కిల్ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. మిత్రునికి మిత్రుడు శత్రువు అన్నట్టుగా కాప్రా ప్రెస్‌క్లబ్ పనితీరు ఉందన్నారు. కొందరు వ్యక్తుల స్వార్థానికి జిల్లా ప్రెస్ క్లబ్‌లో మెంబర్ షిప్ ఉన్న వాళ్లకి కాప్రా ప్రెస్‌క్లబ్‌లో మెంబర్ షిప్ ఎలా ఇస్తారని వారు నిలదీశారు. కాప్రా ప్రెస్‌క్లబ్ ఏర్పాటైనప్పుడు అందులో ఉన్న ప్రతి సభ్యుడికి అర్హత ఉంటుందని, అలాంటప్పుడు మెంబర్‌షిప్ రెన్యువల్‌ను ఎలా తిరస్కరిసారని నిలదీశారు. ప్రస్తుత సభ్యులందరికీ స్థానికంగా అక్రిడేషన్, వారి పత్రికలకు ఎం పానల్ మెంట్, ఆర్ఎన్ఐ, పేపర్ ప్రింటింగ్ ఉందా అని ప్రశ్నించారు. అన్యాయానికి గురైన పాత్రికేయులకు టీడబ్ల్యూజేఎఫ్ అండగా నిలవాలని వారు కోరారు. సర్కిల్ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసి వారందరికీ మేమున్నామంటూ రాష్ట్ర, జిల్లా నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపల్లి పద్మా రెడ్డి, జి హరి ప్రసాద్, పటేల్ నరసింహ, రవి, బెలిదే అశోక్, రామచంద్ర మూర్తి, కిరణ్, నరేష్, డి శ్రీనివాస్ రావు, జి రోజా రాణి, వాణి, గాయత్రి, శ్రీనివాస్ రెడ్డి, సురేష్ సాగర్ ఉన్నారు.

కీసర మండలంలో 324 మంది రైతులకు రుణమాఫీ బకాయి


- 699 మంది అర్హుల్లో 375 మందికే మాఫీ
- మిగిలిన రూ.1.29 కోట్లను ప్రభుత్వం విడుదల చేయాలి
- పీఏసీఎస్ చైర్మెన్ రామిడి ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

పంట రుణమాఫీ 2024లో భాగంగా మిగిలిన 324 మంది రైతులకు రూ.1.29 కోట్లు తక్షణమే విడుదల చేయాలని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి కీసర మండల పీఏసీఎస్ చైర్మెన్ రామిడి ప్రభాకర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీసర మండలంలోని 699 మంది రైతులు రుణమాఫీకి అర్హత సాధించినప్పటికీ, ఇప్పటివరకు 375 మంది రైతులకు మాత్రమే రూ. 2.22 కోట్లు మంజూరయ్యాయి. మిగిలిన 324 మంది రైతులకు రూ.1.29 కోట్లు ఇంకా విడుదల కావాల్సి ఉందని, రైతుల ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ బకాయిని వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం బకాయిని విడుదల చేయాలన్నారు. రుణమాఫీ పూర్తి అయితేనే రైతులు ఆర్థికంగా స్థిరపడతారని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని డబిల్‌పూర్ పీఏసీఎస్ చైర్మెన్ సద్ది సురేష్ రెడ్డి, మేడ్చల్ పీఏసీఎస్ చైర్మెన్ రణదీప్ రెడ్డి, పూడూరు పీఏసీఎస్ చైర్మెన్ సుధాకర్ రెడ్డిలతో కలిసి సమర్పించారు.

మాజీ కౌన్సిలర్ రమేష్ గౌడ్‌కు సన్మానం



నవతెలంగాణ-కీసర

ఐదేండ్లు ప్రజా క్షేత్రంలో మాజీ కౌన్సిలర్ వసూపతి రమేష్ గౌడ్ కష్టపడి పని చేశారని చీర్యాల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్‌గా ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా లక్ష్మీనారాయణ గౌడ్ శాలువాతో సన్మానించారు.

15 నవతెలంగాణ మానవి
హైదరాబాద్
శుక్రవారం 31 జనవరి 2025
www.navatelangana.com

కల్తీ కారాన్ని ఎలా గుర్తించాలంటే..

ప్రతి ఇంటి వంటగదిలో తప్పకుండా ఉండే వస్తువు కారం. ఈ కారం లేకపోతే ఏ వంటకమూ రుచికరంగా ఉండదు. అసలు తినలేం కూడా. నేడు మార్కెట్‌లో కల్తీ కారం విపరీతంగా అమ్మేస్తున్నారు.. రుచిని పక్కన పెడితే మన ఆరోగ్యానికి ఇవి హాని చేస్తాయి.

మార్కెట్‌లో ఉండే నకిలీ కారాన్ని ఎలా గుర్తించాలో చూద్దాం.

కారంలో ఎర్ర ఇటుక, ఎర్ర ఇసుక, కొన్ని రకాల చెక్కల పొడి, స్టార్చ్, సబ్బుపొడి కలుపుతున్నారు. ఇవి అచ్చం కారం రంగులోనే ఉంటాయి. దీంతో పాటు కారం పూర్తిగా ఎర్రగా నిగనిగలాడే రంగులో కనిపించడానికి కొని కృత్రిమ రంగులను కూడా కలుపుతున్నారు. ఇవి కారం ఎర్రగా, అద్భుతమైనదిగా కనిపిస్తుంటుంది.

నకిలీ కారాన్ని గుర్తించాలనుకుంటే.. ఒక గ్లాసులో నీరు పోసి, అందులో మార్కెట్ నుంచి తెచ్చిన కారాన్ని కలపండి. అది పూర్తిగా నీళ్లలో కరిగిపోతే అది ఒరిజినల్‌గా నిర్ధారించుకోవచ్చు. ఒకవేళ అది నీటిలో కరగకపోతే.. అది నకిలీదని అర్థం.

అందులో కలిపిన బియ్యం పొట్టు, ఇటుక, మరేదైనా



నకిలీవి ఉంటే అవి నీటిలో కరగవు.

అలాగే ఒక ప్లేట్‌లో కారం వేసి, ఆపై ఉప్పునీరు లేదా అయోడిన్ చుక్కలను చల్లండి. అపుడు కారం నీలం రంగులోకి మారితే, అది నకిలీదని అర్థం. అలాగే ఒక గ్లాసులో నీళ్ళు తీసుకుని అందులో ఉప్పు పొడి వేసి కలపాలి. తర్వాత ఆ నీటిని చేతులకు రుద్దినపుడు నురగ వస్తే అందులో సబ్బుపొడి కలిపినట్లు అర్థం చేసుకోవాలి. ఈ విధంగా మార్కెట్‌లో దొరికే నకిలీ పౌడర్లను గుర్తించొచ్చు. ■





లింగ వివక్షపై 'మన' పోరాటం

అక్కడ అమ్మాయిలు తమ అన్నదమ్ముల కోసం తిండి నుండి విద్య వరకు ప్రతిదీ త్యాగం చేస్తారు. లింగ వివక్షను అడుగడుగునా అనుభవిస్తూనే ఉంటారు. ఖర్చులు తగ్గించుకోవడం కోసం తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు అత్యంత చిన్న వయసులోనే పెండ్లి చేసి పంపుతారు. అలాంటి సమాజంలో పుట్టిన అమ్మాయే మన మాండ్లేకర్. కానీ ఆమె మాత్రం దీనికి భిన్నంగా ఉంది. తనతోటి అమ్మాయిలు నేడు పాఠశాల విద్య పూర్తి చేసి హింసకు వ్యతిరేకంగా పోరాడేలా తీర్చిదిద్దుతుంది. ఆమె స్ఫూర్తిదాయక పరిచయం నేటి మానవిలో...

ఆమె టీనేజ్‌లో ఉన్నప్పుడే 'మన మాండ్లేకర్‌కు' ఆమె పేరులోని సారాంశం ఏమిటో తెలుసుకుంది. హిందీలో 'మన' అంటే 'తిరస్కరణ' అని అర్థం. తల్లిదండ్రులు ఎక్కువ మంది ఆడపిల్లలను ఆమె కనకూడదని ఈమెకు ఈ పేరు పెట్టారు. తన తల్లిదండ్రులకు ఏడుగురు పిల్లలలో మన మాండ్లేకర్ ఐదవది. వారిలో ఇద్దరు మాత్రమే అబ్బాయిలు. ఆమె నివసించే మధ్యప్రదేశ్‌లోని అలంపూర్‌లో తన గ్రామం నుండి పట్టభద్రురాలైన మొదటి అమ్మాయి. అలాగే స్పోర్ట్స్ ఛాంపియన్‌గా నిలిచిన మొదటి అమ్మాయి కూడా.

తమలోని శక్తిని కనుగొని

గత ఏడేండ్లలో మాండ్లేకర్ తన సంస్థ టింకా సమాజిక్ సంస్థ ఆధ్వర్యంలో దాదాపు 76,000 మంది గ్రామీణ పిల్లలకు (వీరిలో ఎక్కువ మంది అమ్మాయిలే) కరాటేలో శిక్షణ ఇచ్చింది. వీరిలో కొందరు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని అవార్డులను గెలుచుకున్నారు. దీని వల్ల అమ్మాయిలు తనమలోని శక్తిని కనుగొనడంతో పాటు, పాఠశాలలకు వెళ్లే వారి సంఖ్య చాలా రెట్లు పెరిగింది. అంతేకాదు మాండ్లేకర్ ఇచ్చిన ఈ శిక్షణతో బాల్య వివాహాల సంఖ్య కూడా తగ్గిపోయింది. 'నేను ఎదుగుతున్నప్పుడు చేయలేనివన్నీ నా దగ్గర శిక్షణ పొందిన అమ్మాయిలు చేస్తారు' అని ఆమె హెర్‌స్టోరీ అనే వెబ్‌సైట్‌తో పంచుకున్నారు.

తరిమికొట్టాలని

ఆమె సమాజంలోని చాలా మంది చాలా మంది బాలికలు ఆ గాయాలతో ఒంటరితనంలోనే బతికేవారు. దీనికి భిన్నంగా మాండ్లేకర్ తనపై దాడి చేస్తున్న వారిని తరిమికొట్టాలని నిర్ణయించుకుంది. చాలా విజయాలు కూడా సాధించింది. అయితే ఈ విజయాలన్నీ ఎన్నో అగ్ని పరీక్ష తర్వాతనే వచ్చాయి.

భోజనాన్ని తగ్గించుకున్నాం

ఏడుగురు పిల్లలను పోషించడానికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్న కుటుంబంలో పుట్టి పెరిగింది మాండ్లేకర్. 'తిండి తినడానికి చాలా నోళ్లు ఉండేవి. అందుకే ఇంట్లోని మహిళలమైన నా తల్లి, నా అక్కచెల్లెళ్లు, నేను తినాల్సిన భోజనాన్ని తగ్గించుకున్నాం. ఆకలితో పడుకునేవాళ్లం. పాఠశాల కూడా మానేసి చిన్నవయసులోనే పెండ్లి చేసుకోవడం ద్వారా మా చదువుకు అయ్యే ఖర్చులను ఆదా చేసాము' అని ఆమె చెప్పింది. 9వ తరగతి పూర్తి చేసిన తర్వాత మాండ్లేకర్ బాలికలు 14 లేదా 15 ఏండ్ల వయసులోనే వివాహం చేసుకోవల్సి వచ్చింది. అమ్మాయిలందరూ ఆ ఒత్తిడికి లొంగిపోయేవారు. కానీ పెండ్లి విషయంలో తనను బలవంతం చేస్తే తన జీవితాన్ని ముగించుకుంటానని మాండ్లేకర్ బెదిరించింది. గ్రామస్తులు 8వ తరగతి తర్వాత బాలికల విద్యను నిలిపివేసినప్పుడు మాండ్లేకర్ మాత్రం తన ఉన్నత తరగతులు కొనసాగించడానికి 9 కిలోమీటర్లు నడిచేది. కుటుంబాలలో, గ్రామంలో లైంగిక వేధింపులు విపరీతంగా ఉండేవి. వాటికి అదుపు లేకుండా పోయింది.

కూడా బలవంతంగా ఒక యువకుడితో నిశ్చితార్థం చేసుకోవల్సి వచ్చింది. కానీ వివాహం చేసుకున్న స్నేహితుల బాధాకరమైన కథలను విన్న ఆమె తల్లిదండ్రులతో గొడవ పడింది.

వివాహం అంటేనే భయం

'గ్రామంలో 14 - 15 ఏండ్ల వయసు గల నా స్నేహితులు వారి అత్తమామల ఇంట్లో వారు ఎదుర్కొంటున్న భయానక పరిస్థితులను నాకు చెప్పేవారు.



చిన్న చిన్న అపార్థాలు, భోజనంలో కొంచెం ఉప్పు ఎక్కువయ్యిందని విపరీతంగా కొట్టేవారు. ఇవన్నీ విన్న తర్వాత వివాహం అంటేనే చాలా భయపడ్డాను. నాకు పెండ్లి చేస్తానంటే నిరాశకు గురయ్యాను. అంతేకాదు అధిక రక్తపోటు, మూర్ఛతో అనారోగ్యానికి గురయ్యాను. దాంతో నా తల్లిదండ్రులకు నా ఇష్టాన్ని అంగీకరించడం తప్ప వేరే మార్గం లేదు' అని ఆమె పంచుకుంది. పాఠశాల పూర్తి చేసిన తర్వాత మాండ్లేకర్ కాలేజీలో చేరింది. అక్కడ ఆమె మొదటిసారి కరాటే నేర్పుతున్న ఒక మహిళను కలిసింది. అప్పటి వరకు ఆమెకు స్త్రీ స్వతంత్రత గురించి పెద్దగా అవగాహన లేదు. అందుకే అదంతా ఆమెకు కొత్తగా అనిపించింది.

కోపం కట్టులు తెంచుకుంది

'మా గ్రామంలో అమ్మాయిలు ఎల్లప్పుడూ సల్వార్‌లు ధరించి, ఆభరణాలు అలంకరించుకుని, బయటకు అడుగు పెట్టే ముందు పై నుండి కాలి వరకు తమను తాము కప్పుకునేవారు. కానీ ఇక్కడ ట్రాక్ ప్యాంటులో ఉన్న ఒక మహిళ కళాశాలలో నడుస్తోంది. నేను ఆమెను చూసి మొదట విద్యార్థి అనుకున్నాను. తప్పుగా భావించి ఆమెను ఎగతాళి కూడా చేసాను' అని మాండ్లేకర్ గుర్తుచేసుకుంది. అప్పటి వరకు ఆమె సినిమాల్లో చూసిన దాన్ని బట్టి కరాటే అంటే పురుషులకు మాత్రమే పరిమితమైన చర్య అని భావించింది. అయితే కొన్ని తరగతులకు హాజరైన తర్వాత ఆమెతో పాటు ఆమె సమాజంలోని మహిళలు బస్సులలో, బహిరంగ ప్రదేశాలలో, వారి సొంత కుటుంబాల్లోనూ భరించిన లింగ ఆధారిత హింస గుర్తుకొచ్చి ఆమె కోపం కట్టులు తెంచుకుంది.

సంకల్పాన్ని రగిలించాయి

'కుటుంబ సభ్యుల నుండి, పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడి నుండి, రోడ్లపై నేను నిశ్శబ్దంగా లైంగిక వేధింపులను అనుభవించిన రోజులు చాలా ఉన్నాయి. ఈ విషయం గురించి మా అమ్మకు చెబితే దాని గురించి మాట్లాడవద్దని అనేది. కానీ నా కరాటే గురువు రితేష్ తివారీ సర్, లైంగిక వేధింపుల కారణంగా ఒక యువతి తన ప్రాణాలను కోల్పోయిన సంఘటనతో కరాటే నేర్పించడం ప్రారంభించానని మాతో చెప్పేవాడు. ఇటువంటి వాతావరణంలో మేము మా అనుభవాల గురించి వీలైనంత ఎక్కువగా మాట్లాడుకునేవాళ్లం' అని మాండ్లేకర్ పంచుకుంది. కరాటే నేర్చుకుంటున్న సమయం మాండ్లేకర్‌లో బలం, ఆత్మవిశ్వాసం కోరుకునే సంకల్పాన్ని రగిలించాయి. కరాటే నేర్చుకోవడం ఆమె జీవితంలో ఓ అద్భుతమైన మార్పుగా అవతరించింది. శారీరక పరాక్రమాన్ని మాత్రమే కాకుండా లోతైన సాధికారత భావాన్ని కూడా అందిస్తోంది. ఎనిమిది గంటలకు పైగా రోజువారీ సాధనలో పాల్గొని కరాటేలో ప్రావీణ్యం సంపాదించింది. అంతే కాకుండా తన గ్రామం నుండి ఆసియా క్రీడలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన మొదటి అమ్మాయిగా కూడా నిలిచింది. ■



గగనతలంలో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే అత్యంత రద్దీగా వుండే రీగన్ విమానాశ్రయంలో విమానాల రాకపోకలను రద్దు చేశారు.

అంతా 30 సెకన్ల లోనే...

ప్రమాదం జరగడానికి కొద్ది నిముషాల ముందుగా నిడివి తక్కువ గల రన్‌వే పై ల్యాండ్ అవగలరా అని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు విమాన పైలట్లను అడిగారు . అందుకు పైలట్లు అంగీకరించడంతో కంట్రోలర్లు విమానం ల్యాండింగ్‌కు అనుమతి ఇచ్చారు. కొత్త రన్‌వేపైకి రావడానికి విమానం సిద్ధమవుతుండగానే హఠాత్తుగా అదే మార్గంలోకి బ్లాక్ హాక్ హెలికాప్టర్ రావడాన్ని కంట్రోలర్లు చూశారు. ఎదురుగా వస్తున్న విమానం మీకు కనబడుతోందా అని వారు ప్రశ్నించారు. వెంటనే మరో రేడియో కాల్‌ను కూడా పంపారు. కానీ ఈలోగానే జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. సెకన్లు కూడా గడవలేదు. రెండు విమానాలు ఆకాశంలో ఢీ కొన్నాయి. ఆ సమయంలో విమానం రన్‌వేకు సరిగ్గా 2400 అడుగుల దూరంలో వుంది. అంటే పొటొమాక్ నది మధ్య భాగానికి పైన వుంది. కాగా బ్లాక్ హాక్ హెలికాప్టర్ శిక్షణా హెలికాప్టర్ అని అమెరికా ఆర్మీ ప్రకటించింది. ఆ సమయంలో అందులో ముగ్గురు సైనికులు వున్నారని తెలిపింది.

అదే మార్గంలోకి హెలికాప్టర్ ఎందుకు వచ్చింది ?

కాగా ఈ ప్రమాదం పట్ల అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అసలు హెలికాప్టర్ ఆ మార్గంలోకి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. విమానం సరైన దిశలోనే వుంది, కానీ కాస్త అటూ ఇటూగా కూడా కాకుండా సరిగ్గా విమానానికి, హెలికాప్టర్ ఎదురు వెళ్ళినట్లుగా కనిపిస్తోందని అన్నారు. పైగా ఆ సమయంలో ఆకాశమంతా కూడా క్లియర్‌గానే వుందన్నారు. హెలికాప్టర్ పైకి, కిందకు లేదా పక్కకు కూడా మళ్లకుండా సరిగ్గా సూటిగా వచ్చిందని అన్నారు. అయినా విమానం కనిపిస్తోందా అని ట్రాఫిక్ కంట్రోలర్లు ప్రశ్నించడానికి బదులుగా ఏం చేయాలో ఎందుకు చెప్పలేదని ఆయన ప్రశ్నించారు. ఇదంతా చూస్తుంటే ఇది నివారించదగిన ప్రమాదంగా భావించాల్సి వస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తానే స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తానని ట్రంప్ అధికారులకు చెప్పారు.

బతికే అవకాశాల్లేవు

ఈ ప్రమాదంలో ఎవరూ జీవించి వుండే అవకాశాలు కనిపించడం లేదని సంబంధిత అధికారులు భావిస్తున్నారు. విమాన శిధిలాలు పడిన నదిలో నీరు దాదాపు గడ్డ కట్టే ఉష్ణోగ్రతలు వున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అందులో పడినవారు గాయాలపాలైన వారు ఎక్కువసేపు ప్రాణాలతో వుండే అవకాశాలు తక్కువని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అధికారులు కొంతమంది తెలిపారు. వందలాదిమంది సహాయక సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారని చెప్పారు. పైగా శిధిలాలు పడిన ప్రాంతం కూడా చాలా

ఏఐలో భారత్ వెనుకబాటు

(మొదటిపేజీ తరువాయి)

లాంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. చైనాలోని కంపెనీలు ప్రధానంగా హార్డ్‌వేర్‌పైనే రాణించడంతో పాటుగా.. ప్రస్తుత ఏఐ వ్యూహం విజయానికి దోహద పడిందని ఇండ్కల్ టెక్నాలజీ సీఈఓ, ఫౌండర్ ఆనంద్ దేబే పేర్కొన్నారు.ఏఐ, క్వాంటిటేటివ్ ఫైనాన్స్‌లో నిపుణుడైన చైనా ఇంజినీర్ లియాంగ్ వెన్ ఫెంగ్ 2023లో డీప్‌సీక్‌ను ఏర్పాటు చేశారు. దీనికి డీప్‌సీక్ ఆర్1గా పేరు పెట్టారు. ఏఐ మోడల్స్‌ను అందిపుచ్చుకోవడానికి అమెరికన్ కంపెనీలు బిలియన్ డాలర్లు (వేల కోట్ల రూపాయలు) వ్యయం చేస్తుంటే.. డీప్‌సీక్ కేవలం 6 మిలియన్ డాలర్లు (రూ.52 కోట్లు) ఖర్చు చేయడం విశేషం. సాంకేతిక ఆధిపత్య పోటీలో చైనాను ముందుకు వెళ్లకుండా అమెరికా జీపీయూ సెమీకండక్టర్ల వంటి హైఎండ్ టెక్నాలజీలను ఆ దేశానికి ఎగుమతి చేయడాన్ని నిషేధించింది. యూఎస్ సవాళ్లను ఎదుర్కొని డీప్‌సీక్ రాణించడం విశేషం.

తక్కువ ఖర్చుతో ప్రకంపనలు : మంత్రి వైష్ణవ్

చైనాకు చెందిన డీప్‌సీక్ తక్కువ ఖర్చుతో ఏఐ రంగంలో ప్రకంపనలు సృష్టించిందని భారత ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ పేర్కొన్నారు. ఇక్కడ డేటా ప్రైవసీకి సంబంధించిన ఆందోళనల పరిష్కారం కోసం భారత సర్వర్ల నుంచే దీన్ని హోస్ట్ చేస్తామన్నారు. భారత్‌లో ఏఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్‌ను సైతం ప్రారంభిస్తామన్నారు. రాబోయే కొన్ని నెలల్లో భారత్ సొంత జనరేటివ్ ఏఐ మోడల్‌ను అభివృద్ధి చేసుకోబోతోందన్నారు. భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దేశీయ అవసరాల కోసం అతితక్కువ ఖర్చుతో ఏఐ మోడల్‌ను రూపొందించనున్నట్టు పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటివరకు ఆరుగురు డెవలపర్లను గుర్తించామన్నారు. వచ్చే ఎనిమిది, పది మాసాల్లో ఏఐ మోడల్‌ను ఆవిష్కరించే అవకాశం ఉందన్నారు.

జీహెచ్ఎంసీ కౌన్సిల్ రసాభాస

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, ఆరు గ్యారంటీల అమలుపై నిలదీశారు. కాంగ్రెస్ డౌన్‌డౌన్ అంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు నినాదాలు చేస్తూ మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. మరోవైపు బీజేపీ కార్పొరేటర్లు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య తోపులాట జరిగింది. బీఆర్ఎస్ కార్పొరేటర్ల వద్ద ఉన్న ఫ్లకార్డులను కాంగ్రెస్ సభ్యులు చించేశారు. మేయర్ మార్షల్స్‌ను పిలిపించి నలుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లను బయటకు పంపించారు. వారిని కౌన్సిల్‌లోకి అనుమతించాలని మిగతా బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాలు నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దాంతో తిరిగి కౌన్సిల్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. రెండు గంటల్లోనే ఐదుసార్లు కౌన్సిల్ వాయిదా పడింది. అడుగడుగునా మేయర్ ప్రసంగానికి బీఆర్ఎస్ కార్పొరేటర్లు అడ్డుపడటంతో వారిని జీహెచ్ఎంసీ సెక్షన్ 89/1 ప్రకారం మార్షల్స్‌తో బయటకు పంపించారు. సభ నుంచి బయటకు వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రభుత్వానికి, మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. దాంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని మహంకాళీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత కాంగ్రెస్, ఎంఐఎం, బీజేపీ సభ్యులతో కౌన్సిల్ సమావేశాన్ని సాయంత్రం వరకు కొనసాగించారు.



బడ్జెట్ సమావేశాన్ని అడ్డుకోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే
జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

జీహెచ్ఎంసీ బడ్జెట్ సమావేశాన్ని అడ్డుకోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే అవుతుందని హైదరాబాద్ ఇన్‌చార్జి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని బీఆర్ఎస్ కార్పొరేటర్లు అడ్డుకోవడంపై మంత్రి స్పందించారు. జీహెచ్ఎంసీ బడ్జెట్ హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన అంశమన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడటానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం శ్రద్ధతో పని చేస్తోందని చెప్పారు. అవిశ్వాసం పెట్టుకునే హక్కు అందరికీ ఉందని, దాన్ని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని అన్నారు. కానీ బడ్జెట్‌ను అడ్డుకోవడం అంటే హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకున్నట్టేనని, దీనికి బీఆర్ఎస్ నాయకత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 10 ఏండ్లుగా జరగని అభివృద్ధి ఇప్పుడు జరుగుతోందని, దానిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జీహెచ్ఎంసీ బీఆర్ఎస్ కార్పొరేటర్ల అక్రమ అరెస్టు దుర్మార్గం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీహెచ్ఎంసీ బీఆర్ఎస్ కార్పొరేటర్ల అక్రమ అరెస్టు దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీహెచ్ఎంసి పాలక మండలి సమావేశంలో హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినందుకు కార్పొరేటర్లను అరెస్టు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ నగరానికి నిధులు ఇవ్వడం లేదని కోటి మంది నగర ప్రజల తరపున ప్రశ్నిస్తే బయటకి గెంటెస్తారా? అని ప్రశ్నించారు. గత సంవత్సరం పెట్టిన బడ్జెట్ నిధులను కనీసం కూడా ఖర్చు చేయకుండా, మరోసారి అవే కాగితాల పైన అంకెలు మార్చి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ మోసాన్ని అడ్డుకున్నందుకు మా ప్రజా ప్రతినిధుల గొంతు నొక్కుతారా? అని నిలదీశారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి కనీస ప్రజా సౌకర్యాలను కూడా సరిగ్గా నిర్వహించలేని జీహెచ్ఎంసీ అసమర్థ తీరును ప్రశ్నిస్తే కూడా ఈ ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగర ప్రజల సమగ్ర అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అప్పటిదాకా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని, పురపాలక శాఖకు బాధ్యత వహిస్తున్న ముఖ్యమంత్రిని నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అరెస్టు చేసిన కార్పొరేటర్లను, పార్టీ నేతలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇచ్చిన హామీల అమలు చేయకుండా అరెస్టుల పేరుతో ప్రజా ప్రతినిధులను అణగదొక్కాలని చూస్తే ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

కూలీల మరణం దిగ్భ్రాంతికరం

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ఉపాధి హామీ కూలీలు మరణించడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటన వార్త తెలిసిన వెంటనే జిల్లా డీఆర్డీఓను ఘటనాస్థలికి పంపించారు. ప్రమాదంపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెప్పించుకున్నారు. ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ఆ ప్రాంతంలో పనులు చేయొద్దని జిల్లా అధికారులు వారం క్రితమే హెచ్చరించినా...పనులు కొనసాగడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై శాఖ అధికారులతో సమగ్ర విచారణకు ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మరణించిన, గాయపడిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇద్దరు కూలీలు మరణించడం బాధాకరం : మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట జిల్లా గోవర్ధనగిరిలో ఇద్దరు ఉపాధి హామీ కూలీలు పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటన పై సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి తో ఫోన్లో మాట్లాడి, దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఉపాధి హామీ చట్టం కింద నిబంధనల ప్రకారం కూలీలకు అందించాల్సిన ఆర్థిక సహాయం, ఇతర సహకారాలపై చర్చించారు. క్షతగాత్రుల కోరిక మేరకు వారికి ఇష్టమున్న చోటే వైద్య సౌకర్యం పొందేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తీవ్రంగా గాయపడి వరంగల్ జిల్లా ఎంజీఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న స్వరూప ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ కిశోర్‌తో ఫోన్లో మాట్లాడి ఆమెకు అందుతున్న వైద్యం పై గురించి అడిగి తెలుసుకున్నారు.

శాంతి , అహింసల ఆచరణే అసలైన నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాంధీజీ సూచించిన శాంతి, అహింసల ఆచరణే ఆయనకిచ్చే అసలైన నివాళి అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ లంగర్ హౌస్‌లోని బాపూఘాట్‌లో వారు గాంధీజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. మహాత్మాగాంధీ ఆశయాల సాధనలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,డీజీపీ జితేందర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న అసెంబ్లీ !

ఐదో తేదీన క్యాబినెట్

కులగణన, పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపైనే చర్చ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కులగణన, పంచాయతీ ఎన్నికల సంబంధించి రిజర్వేషన్లపై చర్చించేందుకు ఫిబ్రవరి ఏడో తేదీన అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. దీనికి సంబంధించి గవర్నర్‌కు కూడా సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దాని కంటే ముందు ఐదో తేదీన క్యాబినెట్ సమావేశమై ఈ అంశాలపై చర్చించి తీర్మానించనున్నట్టు, ఆన్ గోయింగ్ పథకాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు చేయనున్నట్టు సమాచారం. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడనప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది. అయితే, ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో రిజర్వేషన్లకు సంబంధించి కొత్త నిర్ణయాలు ప్రకటించే అవకాశాలుంటాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మినహా మిగతా రాష్ట్ర మంతటా ఎన్నికల కోడ్ ఉన్న విషయం విదితమే. ఈ క్రమంలో అసెంబ్లీని సమావేశపరచటం, రిజర్వేషన్లపై తీర్మానం చేయడం అనేది సాధ్యమవుతుందా? అని ప్రశ్నిస్తున్నారు.

బండరాళ్లు పడి.. ఇద్దరు ఉపాధి కూలీలు మృతి

(మొదటిపేజీ తరువాయి)

వల్లే ప్రమాదం జరిగిందని అన్నారు. గత కొంతకాలంగా మట్టిదిబ్బలు పడుతున్నాయని, అయినా అధికారులు అక్కడే పని చేయిస్తున్నారని తెలిపారు. ప్రమాదకర ప్రదేశంలో పనిచేస్తున్నా అధికారులు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవని, చివరికి ప్రాణాలు పోయిన తర్వాత హుటాహుటిన అక్కడికి చేరుకున్నారని ఆగ్రహించారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందించాలని, వారి కుటుంబాల్లో ఎవరికో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

స్పందించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు బండి, పొన్నం

ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని కలెక్టర్ మనుచౌదరికి ఆదేశాలు జారీ చేశారు. గాయపడ్డ కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మృతి చెందిన కుటుంబాల పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్ మను చౌదరిని ఫోన్‌లో సంప్రదించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో సర్వత్రా చర్చ

విద్యకు ప్రాధాన్యత దక్కేనా?

- సాధారణంగా భారత్ జరిపే కేటాయింపులు మూడు శాతంలోపే
- ఇది ప్రపంచవ్యాప్తంగా సిఫారసు చేయబడిన ఆరుశాతం కంటే తక్కువే
- ఈ రంగంపై 18 శాతం జీఎస్టీ కూడా..
- సవాళ్లు, సమస్యలను పరిష్కరించాలి : మేధావులు, ఆర్థిక నిపుణుల సూచనలు

ఒక దేశం అభివృద్ధికి విద్య చాలా కీలకం. ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా గుర్తింపు పొందాలన్నా విద్య అవసరం ముఖ్యం. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్షంగా భాగం కాకపోయినా.. ఆ రంగాన్ని శాసించే భవిష్యత్తు తరాన్ని రూపొందించేది విద్యే. అలాంటి, విద్యకు ఎంత ప్రాధాన్యతనిస్తే, ఆ దేశం అంత చక్కటి అభివృద్ధిని చూస్తుంది. కానీ, భారత్‌లో ప్రతీ కేంద్ర బడ్జెట్‌లోనూ విద్యా రంగానికి అన్యాయం జరుగుతున్నది. మోడీపాలనలో కేటాయింపులు తగినమొత్తంలో జరగటంలేవు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై అందరి దృష్టి ఉన్నది. ఈసారైనా విద్యారంగానికి మోడీ సర్కారు కేటాయింపులను పెంచుతుందా? లేదా అనే ప్రశ్నలు అందరిలోనూ నెలకొన్నాయి.



ఈసారి పద్దుల్లోనైనా లెక్క సరి చేయాలి

న్యూఢిల్లీ : కేంద్రంలో 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోడీ సర్కారు విద్యా రంగంపై చిన్న చూపే చూస్తున్నది. గత పదేండ్ల పాలనలో ఈ రంగానికి కావాల్సిన మొత్తంలో నిధుల కేటాయింపులు జరపకపోవటమే ఇందుకు నిదర్శనమని మేధావులు అంటున్నారు. తమ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని మోడీ సర్కారు చెప్పుకుంటున్నది. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెడతామని ఇప్పటికే హామీ ఇచ్చింది. దీంతో, ఈసారి కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై అంచనాలు పెరుగుతున్నాయి. విద్యా రంగం విషయంలో మోడీ సర్కారు ఏ విధంగా వ్యవహరించనున్నదోనని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యకు తగిన ప్రాధాన్యత లభిస్తుందా? నిధుల కేటాయింపులు పెరుగుతాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) భారత జీడీపీ వృద్ధిని 6.5 శాతంగా అంచనా వేసింది. అయితే, దీనిపై మోడీ సర్కారు తెగ ప్రచారం చేసుకున్నది. అయితే, దేశంలో పెరుగుతున్న అంతరాలు, అసమానతలను పరిష్కరించకపోతే ఈ వృద్ధికి అర్థం ఉండదని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు విద్య ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించాయి. నిరక్షరాస్యతలో కూరుకుపోయిన దేశాలు ఇప్పటికీ అనేక రంగాల్లో వెనకబడి ఇబ్బందులను అనుభవిస్తున్నాయి. భారత్‌కు విద్య అనేది కేవలం సుస్థిర వృద్ధికి వెన్నెముకగా నిలిచే రంగం మాత్రమే కాదనీ, పేదరికాన్ని పారదోలే, నూతన ఆవిష్కరణల ఇంజిన్ అని మేధావులు, ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

కృత్రిమ మేధ వినియోగం

ప్రస్తుతం ప్రపంచాన్ని కృత్రిమ మేధ(ఏఐ) ఆశ్చర్యపరుస్తున్నది. ఏఐని వాడే తీరును బట్టి దాని ఫలితాలు ఆధారపడి ఉంటున్నాయి. కాబట్టి, విద్యలోనూ ఒక నిర్ణీస్థాయి వరకు ఏఐ వాడేలా చర్యలు తీసుకోవాలని కొందరు సూచిస్తున్నారు. ఇందులో నూతన ఆవిష్కరణల కోసం బడ్జెట్‌లో కేటాయింపులు అవసరమని అంటున్నారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాధారిత పాఠాలను రూపొందించాలని విద్యావేత్తలు అంటున్నారు. "అలాంటప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుంటుంది. ఇందుకు ప్రభుత్వాల జోక్యం చాలా ముఖ్యం. కాబట్టి, భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలంటే విద్యకు మరింత ప్రాధాన్యత అవసరం. బడ్జెట్‌లో కేటాయింపులు పెరగాలి. వాటి ఖర్చులు కూడా పద్ధతి ప్రకారం జరగాలి. నూతన ఆవిష్కరణలు అవసరం. ఇందుకు ఒక సుదీర్ఘ వ్యూహం తప్పనిసరి" అని సూచిస్తున్నారు.

సవాళ్లను పరిష్కరించాలి

దేశంలో విద్యా రంగం ఇప్పటికీ క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. నాణ్యత, సమానత్వం వంటి విషయాల్లో ఈ సవాళ్లున్నాయి. అయితే, ఈ అంతర్జాతీయ సంస్థలు అంచనా వేసిన వృద్ధిని నిలబెట్టకోవాలన్నా, సమ్మిళితంగా ఉండేలా చూసుకోవాలన్నా.. మన విధాన ప్రాధాన్యతల్లో విద్యకు సముచిత స్థానం కల్పించాలని మేధావులు, ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను పరిష్కరించేలా కేంద్రం బడ్జెట్ కేటాయింపులు జరుపుతుందా? అని ప్రశ్నలను లేవనెత్తుతున్నారు.

స్మార్ట్‌గా ఖర్చు చేయాలి

విద్యపై ఎంత మొత్తం ఖర్చు చేస్తున్నామనేది కాకుండా ఎంత స్మార్ట్‌గా ఉపయోగించామన్నది ముఖ్యమని అంటున్నారు. విద్య సామాజిక ప్రభావం ఆధారంగా కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని అంటున్నారు. "దేశంలో విద్యను బడాపారిశ్రామికవేత్తలు, కార్పొరేటుశక్తులు వ్యాపారంగా మార్చాయి. ప్రభుత్వ పాఠశాలలపై సర్కార్లు తగిన దృష్టిని సారించకపోవటంతో విద్యారంగంలో ప్రయివేటుశక్తులకు ఇది ఆయుధంగా మారింది. భారీమొత్తంలో ఫీజులకు తెరలేపాయి. దీంతో దేశంలోని పేద, మధ్యతరగతి, అణగారిన వర్గాల పిల్లలు చదువుకు నోచుకోలేకపోతున్నారు" అని చెప్తున్నారు.

జీఎస్టీ నుంచి మినహాయించాలి

దేశంలో విద్యపై మోడీ సర్కారు విధించే 18 శాతం జీఎస్టీ పైనా మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్విట్జర్లాండ్ విద్యా సేవలను పన్నుల నుంచి మినహాయించింది. చైనాలో ఇది ఆరు నుంచి 9 శాతమే. కాబట్టి, విద్య అనేది ఒక 'విలాసవంతమైనది' కాదని కేంద్రం గుర్తించాలని అంటున్నారు. పేదలు, తక్కువ ఆదాయ కుటుంబాలను ఈ పన్ను నుంచి మినహాయించాలనీ, దీంతో వారు విద్యా ఫలాలను మరింతగా అందుకునే అవకాశాలున్నాయని చెప్తున్నారు.

డిజిటల్ లిటరసీని 'స్మార్ట్'గా పెంచాలి

దేశంలోని ప్రజల్లో 65 శాతం మందికి పైగా స్మార్ట్‌ఫోన్లను కలిగి ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డిజిటల్ ఎడ్యుకేషన్ చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నది. కాబట్టి, నాణ్యమైన ఉపాధ్యాయులు, వనరులను పొందలేనివారికి ఆన్‌లైన్ వేదికలు అంతరాలు తగ్గించటానికి తోడ్పాటునందిస్తాయని చెప్తున్నారు. అయితే, గ్రామీణ ప్రాంతాల్లోని ఇంటర్నెట్ సేవలు, వాటికయ్యే ఖర్చులు, డిజిటల్ లిటరసీ తక్కువగా ఉండటం వంటివి సమస్యలని అంటున్నారు. ఇలాంటి సందర్భాల్లోనే ఆవిష్కరణలు కీలకమని చెప్తున్నారు. కాబట్టి, వాణిజ్య నగరమైన, సంపన్నులుండే ముంబయిలోని ఒక ఖరీదైన ప్రాంతంలో ఉండే విద్యార్థి, మారుమూల గ్రామంలో ఉండే స్టూడెంట్ మధ్య ఈ డిజిటల్ అంతరాలు తగ్గి, అందరూ సమాన విద్యా అవకాశాలు పొందేలా కేంద్రం దృష్టిని సారించాలని సూచిస్తున్నారు.

విద్యకు మరిన్ని నిధులు అవసరం

భారత్ తన జీడీపీలో విద్యకు మూడు శాతం కంటే తక్కువే కేటాయిస్తుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా సిఫారసు చేయబడిన ఆరు శాతం కంటే తక్కువ కావటం గమనార్హం. 26 కోట్ల మందికి పైగా స్కూల్ చిన్నారులున్న దేశంలో, ఉన్నత విద్యకు డిమాండ్ పెరుగుతున్న తరుణంలో ఇంత తక్కువ కేటాయింపు సరికాదని మేధావులు అంటున్నారు. విద్యా రంగం మీద ప్రాధాన్యత మేరకు ఖర్చు చేస్తున్న దేశాలు చక్కటి, వినూత్న ఆర్థిక వ్యవస్థలను నిర్మించుకుంటున్నాయని గుర్తు చేస్తున్నారు. పోటీ ప్రపంచంలో అభివృద్ధి చెందటానికి తమ ప్రజలకు నైపుణ్యాలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాయని చెప్తున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని దేశంలో విద్యకు చేసే ఖర్చును రెట్టింపు చేస్తే అద్భుతాలు సృష్టించొచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఫలితంగా..భారత్‌లోని మారుమూల ప్రాంతాలనే సంబంధం లేకుండా.. విద్యార్థులకు నాణ్యమైన బడులు, అందరికి వనరుల లభ్యత, సమానావకాశాలుంటాయని వివరిస్తున్నారు.

ఐదు మ్యాచుల టీ20 సిరీస్ ఆఖరు అంకానికి చేరుకుంది. స్పిన్ అస్త్రంతో భారత్ సవాల్ విసురుతుండగా, పేస్ అస్త్రంతో ఇంగ్లాండ్ రెఢీ అవుతోంది. ఈ మ్యాచ్‌లో విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు టీమ్ ఇండియా ఎదురుచూస్తోంది.

పుణెలో ముగిస్తారా?

- సిరీస్ విజయంపై టీమ్ ఇండియా గురి
- భారత్, ఇంగ్లాండ్ నాల్గో టీ20 నేడు

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-పుణె

టీ20 సిరీస్‌లో మూడు మ్యాచులు ముగిసినా..అభిమానులకు ధనాధన్ వినోదం దక్కలేదు. భారత్, ఇంగ్లాండ్ జట్లలో బిగ్ హిట్టర్లకు కొదవ లేదు, అయినా ఇప్పటివరకు భారీ స్కోర్లు నమోదు కాలేదు. ఆతిథ్య భారత్ స్పిన్ మ్యాజిక్‌తో మాయజాలం చేస్తుండగా.. ఇంగ్లాండ్ పేస్ మంత్రతో ఎదురుదాడి చేస్తోంది. స్పిన్, పేస్ సవాల్ పుణెకు చేరుకోగా.. సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు టీమ్ ఇండియా తహతహలాడుతోంది. భారత్, ఇంగ్లాండ్ నాల్గో టీ20 పోరు నేడు.

ఆ ఇద్దరు మెరిసేనా?

భారత బ్యాటింగ్ లైనప్‌లో ఇద్దరు కీలక బ్యాటర్లు ఫామ్ కోల్పోయారు. ఓపెనర్ సంజు శాంసన్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌లు మూడు మ్యాచుల్లోనూ అంచనాలను అందుకోలేదు. వరుసగా శతక ఇన్నింగ్స్‌లు బాదిన సంజు శాంసన్ స్వదేశంలో తడబాటుకు గురవుతున్నాడు. టాప్ ఆర్డర్‌లో అభిషేక్ శర్మ, తిలక్ వర్మ మాత్రమే నిలకడగా రాణిస్తున్నారు. హార్దిక్ పాండ్య మెరిసినా.. అతడికి సరైన సహకారం దక్కటం లేదు. ధ్రువ్ జురెల్ రెండు మ్యాచుల్లోనూ తేలిపోయాడు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు ఆల్‌రౌండర్ స్థాయి ప్రదర్శన చేయటం లేదు. సంజు శాంసన్,



సూర్యకుమార్ యాదవ్ రాణిస్తే భారత్‌కు బ్యాటింగ్ కష్టాలు ఉండవు. వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ స్పిన్ మ్యాజిక్ చేస్తున్నారు. వాషింగ్టన్ సుందర్‌కు పూర్తి కోటా ఓవర్లు ఇవ్వటం లేదు. నలుగురు స్పిన్నర్లలో ఒకరిని బెంచ్‌కు పరిమితం చేసి రెండో పేసర్‌ను ఎంచుకునే అవకాశం సైతం కనిపిస్తోంది. మహ్మద్ షమి, అర్షదీప్ సింగ్ ఇద్దరూ కొత్త బంతితో దాడి చేస్తే ఇంగ్లాండ్‌కు కష్టాలు తప్పవు.

ఇంగ్లాండ్ దూకుడు

స్పిన్ ఫోబియా నుంచి బయటపడిన ఇంగ్లాండ్ పేస్‌తో ఎదురుదాడి చేస్తోంది. ఫిల్ సాల్ట్, బట్లర్, డకెట్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. లియాం లివింగ్‌స్టోన్ సైతం జోరుమీదున్నాడు. బౌలర్లు జోఫ్రా ఆర్చర్, మార్క్‌వుడ్, బ్రైడన్ కార్సె సహా జెమీ ఓవర్టన్‌లు భారత బ్యాటర్లను ఇరకాటంలో పడేయటంలో విజయవంతం అవుతున్నారు. ఆదిల్ రషీద్ మాయజాలంతో మెరువటంతో ఇంగ్లాండ్ సైతం నేడు విజయంపై కన్నేసి బరిలోకి దిగుతోంది. సిరీస్ సమరాన్ని వాంఖడెకు తీసుకెళ్లటంపై ఫోకస్ పెట్టింది.

చాంపియన్ టీడీసీఏ ఎలెవన్

ముగిసిన టీడీసీఏ టీ20 టోర్నమెంట్



నవతెలంగాణ-హైదరాబాద్

నాలుగు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్-17 టీ20 టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్లో మహబూబ్‌నగర్‌పై టీడీసీఏ ఎలెవన్ 13 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీడీసీఏ ఎలెవన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 182 పరుగులు చేసింది. ఓపెనర్ మహేశ్ జాదవ్ (101 నాటౌట్, 63 బంతుల్లో 16 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో చెలరేగగా, శివశంకర్ (52, 34 బంతుల్లో 8 ఫోర్లు) అర్ధ శతకంతో రాణించాడు. ఛేదనలో మహబూబ్‌నగర్ ఆఖరు వరకు పోరాడినా.. ఓటమి తప్పలేదు. ఓపెనర్ సంజు (41, 25 బంతుల్లో 8 ఫోర్లు), వీరెందర్ (27, 20 బంతుల్లో 3 ఫోర్లు), దీపక్ పాటిల్ (24, 17 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా.. మహబూబ్‌నగర్ 19.3 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. టీడీసీఏ బౌలర్ దీక్షిత్ (3/23), అరుణ్ కుమార్ (2/26), మహేశ్ జాదవ్ (2/26) కీలక వికెట్లు పడగొట్టారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించిన మహేశ్ జాదవ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు. టీడీసీఏ టీ20 టోర్నమెంట్ చాంపియన్, రన్నరప్ జట్లకు ప్రముఖ ఎన్నారై డాక్టర్. టి సత్యనారాయణ రెడ్డితో కలిసి అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ట్రోఫీలు ప్రదానం చేశారు.

హైదరాబాద్ ముందంజ!

విదర్భ తొలి ఇన్నింగ్స్ 190/10



నాగ్‌పూర్ : రంజీ ట్రోఫీ గ్రూప్-బి చివరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఆకట్టుకునే ప్రదర్శన చేస్తోంది. బౌలర్లు సమిష్టిగా రాణించటంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగులకే కుప్పకూలింది. అనికెత్ రెడ్డి (3/54), రక్షణ్ రెడ్డి (3/29) మూడేసి వికెట్లు పడగొట్టగా.. సివి మిలింద్ (2/46) రాణించాడు. మహ్మద్ సిరాజ్ (1/47), తనయ్ త్యాగరాజన్ (1/3) చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ 6/80తో స్వల్ప స్కోరుకే ఆలౌటయ్యే ప్రమాదంలో పడింది. లోయర్ ఆర్డర్‌లో హర్ష్ దూబె (65, 46 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ అర్ధ సెంచరీతో విదర్భను ఆదుకున్నాడు. 55.5 ఓవర్లలోనే విదర్భ కథ ముగిసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (53, 86 బంతుల్లో 7 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో కదం తొక్కగా.. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 29 ఓవర్లలో 90/2 పరుగులతో నిలిచింది. అభిరాత్ రెడ్డి (20), రాహుల్ (12) నిరాశపరిచినా.. హిమతేజ (5 నాటౌట్)తో కలిసి తన్మయ్ అజేయంగా ఆడుతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ మరో 100 పరుగులు వెనుకంజలో నిలిచింది.



మోహన్‌లాల్

ఆ అంచనాలకు మించి..

మోహన్ లాల్ టైటిల్ పాత్రలో నటించి, 2019లో విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన చిత్రం 'లూసిఫర్'. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఎల్ 2ఇ ఎంపురాన్' రూపొందుతోన్న సంగతి తెలిసిందే. మలయాళ, తెలుగు, హిందీ, కన్నడ, తమిళ భాషల్లో ఈ చిత్రం మార్చి 27న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. లైకా ప్రొడక్షన్స్ ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహిస్తున్నారు. 'లూసిఫర్, బ్రో డాడీ' చిత్రాల తర్వాత మోహన్ లాల్, పృథ్వీరాజ్ కాంబినేషన్‌లో వస్తోన్న మూడో సినిమా ఇది.

అలాగే 'లూసిఫర్' బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న సీక్వెల్ కావడంతో ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఈచిత్రాన్ని మేకర్స్ రూపొందిస్తున్నారు.

ఈ క్రేజీ మూవీతో జి.కె.ఎం.తమిళ్ కుమరన్ నేతృత్వంలో లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ మలయాళ సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. తాజాగా మేకర్స్ టీజర్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు.

దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ, 'మోహన్ లాల్ లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. ఈ ప్రయాణంలో ఆయన నాకెంతో సపోర్ట్ ఇచ్చారు' అని తెలిపారు. 'పృథ్వీరాజ్ భారతదేశపు ఉత్తమ దర్శకుల్లో ఒకరు అవుతారని నేను ఆశిస్తున్నాను. ఈ మూవీని నేను ఆల్రెడీ చూశాను. దర్శకుడిగా పృథ్వీరాజ్ తన 100 పర్సెంట్ ఇచ్చారు. ఈ చిత్రం మలయాళ సినిమాకు ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తుంది' అని మోహన్ లాల్ చెప్పారు.

నవచిత్రం

ఏప్రిల్ 25న 'కన్నప్ప' రిలీజ్




మోహన్ బాబు, విష్ణు మంచు ప్రస్తుతం 'కన్నప్ప' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలతో పాటు ప్రమోషన్స్‌ని కూడా ఏకకాలంలో నిర్వహిస్తున్నారు.

ఈ ప్రమోషనల్ టూర్‌లో భాగంగా 'కన్నప్ప' టీమ్ దేశవ్యాప్తంగా ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శిస్తోంది. ఈ క్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ని మోహన్ బాబు, విష్ణు మంచు కలిశారు. ఈ టూర్‌లో శరత్ కుమార్, ముఖేష్ రిషి, వినయ్ మహేశ్వరి కూడా పాల్గొని, సందడి చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అతిథి మర్యాదలకు, సాదర స్వాగతాలకు 'కన్నప్ప' టీం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.

ప్రముఖ తెలుగు కళాకారుడు రమేష్ గొరిజాల గీసిన అందమైన పెయింటింగ్‌ను ముఖ్యమంత్రికి విష్ణు మంచు బహూకరించారు. 'కన్నప్ప' చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని, అందరి అంచనాలకు దీటుగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ అన్నారు.

ఓ తండ్రి ఆత్మహత్య కథ



బ్రహ్మాజీ

కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'బాపు'. ఏ ఫాదర్స్ సూసైడ్ స్టోరీ అనేది ట్యాగ్‌లైన్. బలగం సుధాకర్ రెడ్డి, ఆమని, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ తదితరులు ప్రధాన పాత్రల్లో నిజ జీవిత ఘటనల ఆధారంగా దర్శకుడు దయా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని రాజు, సీహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ రష్మిక మందన్న సోషల్ మీడియా వేదికగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.

అలాగే మేకర్స్ ఏర్పాటు చేసిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కు హీరో విశ్వక్ సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మధుర ఆడియో ద్వారా సినిమాను విడుదల చేస్తున్న నిర్మాత మధుర శ్రీధర్ కూడా గెస్ట్‌గా విచ్చేశారు. విశ్వక్ సేన్ టీజర్‌ను లాంచ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'నా ఫస్ట్ సినిమా కూడా ఇండిపెండెంట్ సినిమా. ఇండిపెండెంట్ సినిమా గెలవడం చాలా ముఖ్యం. ఇలాంటి సినిమా సక్సెస్ అయితేనే మేకర్స్‌కు ఉత్సాహం, ధైర్యం వస్తుంది. నిజాయితీగా తీసిన సినిమా ఇది. టీజర్ చూస్తే చాలా బాగుంది. కచ్చితంగా ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని చెప్పారు.

'పల్లెటూర్లలో మానవ సంబంధాలు ఎలా ఉంటాయి?, డబ్బు అవసరాలు వచ్చినప్పుడు ఎలా ఆలోచిస్తారు అనే విషయాలు చాలా ఆసక్తికరంగా ఇందులో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సినిమాను సపోర్ట్ చేయాలనే ఉద్దేశంతో ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకొస్తున్నాం. అలాగే వారం ముందుగానే ఫిబ్రవరి 14 నుంచి ప్రీమియర్ షోలు వేయాలని డిసైడ్ అయ్యాం' అని నిర్మాత మధుర శ్రీధర్ అన్నారు.

బ్రహ్మాజీ మాట్లాడుతూ..'ఇందులో నేను చేసింది రెగ్యులర్ క్యారెక్టర్ కాదు. ఇదొక డిఫరెంట్ స్టోరీ. ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేసిన రష్మికకు థ్యాంక్స్' అని తెలిపారు.



నయా సై-ఫై యాక్షన్ థ్రిల్లర్

"శుక్ర", "మాటరాని మౌనమిది", "ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్న దర్శకుడు పూర్వాజ్ మరో సై-ఫై యాక్షన్ థ్రిల్లర్ 'కిల్లర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ చిత్రంలో పూర్వాజ్ హీరోగా నటిస్తుండగా, జ్యోతి పూర్వాజ్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. థింక్ సినిమా బ్యానర్ పై ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్‌ఆర్ సంస్థలతో కలిసి పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు.

'కిల్లర్' పార్ట్ 1: డ్రీమ్ గర్ల్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మూడో షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం 50 శాతం షూటింగ్ కంప్లీట్ అయింది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొని, కీలకమైన యాక్షన్, రొమాంటిక్, థ్రిల్లింగ్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమా లవ్, రొమాన్స్, రివేంజ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, థ్రిల్లర్ అంశాలను అద్భుతంగా మిళితం చేస్తూ, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. సరికొత్త సై-ఫై యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా మెమొరబుల్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వనుంది. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ కోసం టీమ్ త్వరలో రెడీ అవుతోంది అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్: అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, వీఎఫ్‌ఎక్స్ - వర్చువల్ ప్రొడక్షన్: మెర్జ్ ఎక్స్ ఆర్, నిర్మాతలు - పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి, రచన, దర్శకత్వం - పూర్వాజ్.

బ్యాచ్‌లర్స్ కష్టాలు..



సందీప్ కిషన్

హీరో సందీప్ కిషన్ నటిస్తున్న తన 30వ చిత్రం 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రానికి బెజవాడ ప్రసన్నకుమార్ కథ, కథనం, మాటలు అందించారు.

ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై రాజేష్ దండ, ఉమేష్ కేఆర్ బన్సల్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రీతూవర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో రావురమేష్‌కు జోడీగా 'మన్మధుడు' ఫేం అన్షు నటిస్తున్నారు.

ఫిబ్రవరి 21న ఈ సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి మొదటి పాట 'బ్యాచ్‌లర్ యాంథమ్'ను విడుదల చేశారు మేకర్స్.

బ్యాచ్‌లర్స్ జీవితంలో ఉండే స్ట్రగుల్స్, జాయ్స్‌ను హైలైట్ చేసేలా ఉన్న ఈ సాంగ్ కుర్రాళ్లకు చార్ట్‌బస్టర్ కానుంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాట కుర్రాళ్లకు ఎవర్‌గ్రీన్ ఫేవరెట్ కానుంది. ఈ పాటలో బ్యాచ్‌లర్స్ తమ జీవితంలో పడే వంట కష్టాలు, సింగిల్ షాపింగ్ ట్రిప్స్ వంటి వాటిని చాలా బాగా ఎలివేట్ చేశారు.

రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ధనుంజయ్ సీపాన ఎంతో హుషారుగా ఆలపించారు. కుర్రాళ్లందరికీ కనెక్ట్ అయ్యేలా తన గాత్రంతో కట్టిపడేశారు.

లియోన్ జేమ్స్ అందించిన సంగీతం పాటకు మరింత ప్లస్ అయింది. రఘు మాస్టర్ అందించిన స్టెప్పులతో ఈ పాట సినిమాలో హైలైట్‌గా నిలవనుంది. ఈ పాటను సందీప్ కిషన్-రావు రమేష్‌లపై వైజాగ్ బీచ్‌లో చిత్రీకరించారు.

తండ్రీకొడుకుల బ్యాచ్‌లర్ జీవితంలో ఎత్తుపల్లాలను కళ్లకు కట్టినట్లు చూపించేలా తీశారు. వారిద్దరి ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను పడిపడినవ్వేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు అని చిత్ర యూనిట్ తెలిపింది.

భిన్న కాన్సెప్ట్‌తో 'పరాశక్తి'



విజయ్ ఆంటోనీ

విభిన్న కథా చిత్రాలతో ఆకట్టుకుంటున్న విజయ్ ఆంటోనీ మరోమారు ఓ డిఫరెంట్ సబ్జెక్టుతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. 'పరాశక్తి' అనే పేరుతో ఈ సినిమా రాబోతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

'అరువు', 'వాజిల్' వంటి చిత్రాలను రూపొందించిన దర్శకుడు, రచయిత అరుణ్ ప్రభు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

'వినూత్న కథాంశాలతో వైవిధ్యభరితమైన పాత్రలతో విజయ్ ఆంటోనీ అందర్నీ అలరిస్తున్నారు. ఇది ఆయన నటిస్తున్న 25వ చిత్రం. ఈ సినిమాలోని ఆయన అసాధారణమైన నటన ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది. విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లోనూ ఆయన గన్ పట్టుకుని ఎంతో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఈ సినిమా ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని అందించేందుకు మాస్ అప్పీల్, అత్యుత్తమ యాక్షన్, హృదయాన్ని హత్తుకునే కుటుంబ కథ ఎలిమెంట్స్ కలిగి ఉంది' అని చిత్ర యూనిట్ తెలిపింది.

విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రాన్ని మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోనితో పాటు వాగై చంద్రశేఖర్, సునిల్ కృష్ణ, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, మాస్టర్ కేశవ్ వంటి ప్రతిభావంతమైన నటీనటులు భాగంగా ఉన్నారు. ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ సినిమా రాబోయే వేసవిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి రచయిత-దర్శకుడు: అరుణ్ ప్రభు, సినిమాటోగ్రఫీ: షెల్లీ కాలిస్ట్, సంగీతం: విజయ్ ఆంటోనీ, ఎడిటింగ్: రేమండ్ డెరిక్ క్రస్టా, యాక్షన్ కొరియోగ్రఫీ: రాజశేఖర్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.